శుక్రవారం
24-1-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 123
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from
Hyderabad,Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

'ఎవరెస్ట్' ఫీజు పెంచిన నేపాల్

ఖాట్మండు: ఎత్తైన మౌంట్ ఎవరెస్ట్ ఎక్కాలంటే ఇకపై 36శాతం అధిక ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. పర్వతారోహణ రుసుము పెంచుతూ నేపాల్ ఉత్తర్వులు జారీచేసింది. చెత్త, కాలుష్యాన్ని నియంత్రించడం కోసం చేపట్టిన చర్యల్లో భాగంగా రుసుమును పెంచినట్లు వెల్లడించారు. మార్చి-మే మధ్య కాలంలో దక్షిణ మార్గం నుంచి ఎవరెస్టును అధిరోహించే విదేశీయులకు రాయల్టీ రుసుము 11,000 డాలర్ల నుండి 15,000 డాలర్లు, అదే విధంగా సెప్టెంబర్ -నవంబర్ మధ్య పర్వతారోహణ రుసుముకు 5,500 డాలర్ల నుంచి 7,500 డాలర్లకు, డిసెంబర్ -ఫిబ్రవరితో పాటు జూన్-ఆగస్టు మధ్య కాలంలో పర్వతారోహణ కోసం ఒక్కో వ్యక్తికి చెల్లించాల్సిన రుసుమును 2,750 డాలర్ల నుంచి 3,750 డాలర్లకు పెంచుతూ ఆదేశాలిచ్చింది.

పెట్టుబడుల ధమాకా

రూ.1.78 లక్షల కోట్లతో సరికొత్త రికార్డు

- దిగ్గజ పారిశ్రామికవేత్తలను ఆకట్టుకున్న ఫ్యూచర్ సిటీ
- వివిధ కంపెనీలతో ఒప్పందాలు
- రేవంత్ దావోస్ పర్యటన సక్సెస్

విశాలాంధ్ర - హైదరాబాద్: దావోస్‌లో పెట్టుబడుల సమీకరణలో తెలంగాణ సరికొత్త రికార్డు నెలకొల్పింది. అక్కడ జరుగుతున్న వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ సదస్సులో ఇప్పటివరకు రూ.1.78 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించింది. గత ఏడాది దావోస్ పర్యటనలో రూ.40,232 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. అప్పటితో పోలిస్తే ఈసారి నాలుగు రెట్లకు మించి పెట్టుబడులు వచ్చాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు సారథ్యంలో తెలంగాణ రైజింగ్ బృందం దావోస్‌లో వివిధ పారిశ్రామిక వేత్తలతో నిర్వహించిన సమావేశాలన్నీ విజయవంతమయ్యాయి. హైదరాబాద్‌లో ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్య మివ్వటం ప్రపంచ దిగ్గజ పారిశ్రామిక వేత్తలను అమితంగా ఆకట్టుకుంది. దీంతో పాటు యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ, రీజనల్ రింగ్ రోడ్డు నిర్మాణం, మెట్రో విస్తరణకు ప్రభుత్వ ప్రణాళికలు పెట్టుబడుల వెల్లువకు దోహదపడ్డాయి. అన్ని రంగాలకు అనుకూలమైన వాతావరణమున్న హైదరాబాద్ గ్రేటర్ సిటీ పెట్టుబడుల గమ్యస్థానంగా మరోసారి ప్రపంచానికి చాటిచెప్పినట్లయింది. సరళతర పారిశ్రామిక విధానంతో పాటు క్లీన్ అండ్ గ్రీన్ పాలసీ ప్రపంచ పారిశ్రామికవేత్తల దృష్టిని ఆకర్షించింది. దేశ విదేశాలకు చెందిన 16 ప్రముఖ కంపెనీలతో ఒప్పందాలు చేసుకుంది. ఐటీ, ఏఐ, ఇంధన రంగాల్లో అంచనాలకు మించి భారీ పెట్టుబడులను సాధించింది. ఒప్పందాల ప్రకారం రూ.1,78,950 లక్షల కోట్ల పెట్టుబడులతో పాటు రాష్ట్రంలో 49,500 మంది యువతకు ఉద్యోగాలు లభించనున్నాయి.

రూ.750 కోట్లతో ఇన్ఫోసిస్ విస్తరణ

ప్రపంచ దిగ్గజ ఐటీ సంస్థ ఇన్ఫోసిస్ హైదరాబాద్‌లో తమ కార్యకలాపాలను భారీగా విస్తరించనుంది. పోచారంలో ఉన్న ఇన్ఫోసిస్ క్యాంపస్‌లో అదనంగా 17 వేల ఉద్యోగాలు కల్పించనున్నట్లు ప్రణాళిక సిద్ధం చేసింది. అందుకు అనుగుణంగా సదుపాయాలను విస్తరించేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. దావోస్ సదస్సులో ఇన్ఫోసిస్ సీఎఫ్వో జయేశ్ సంగ్రాజ్కా రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబుతో సమావేశమయ్యారు. ఫస్ట్ ఫేజ్‌లో ఇన్ఫోసిస్ సంస్థ రూ.750 కోట్ల పెట్టుబడితో కొత్త ఐటీ భవనాల నిర్మాణం చేపడుతుంది. రాష్ట్రంలో అభివృద్ధి చెందుతున్న ఐటీ పర్యావరణ వ్యవస్థకు గణనీయంగా దోహదపడుతుంది. ఇప్పటికే హైదరాబాద్ సంస్థలో దాదాపు 35,000 మంది ఉద్యోగులున్నారు. తెలంగాణ ప్రభుత్వంతో భాగస్వామ్యం కొత్త ఆవిష్కరణలకు నాంది పలుకుతుందని జయేశ్ సంగ్రాజ్కా అన్నారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను వృద్ధి చేసే లక్ష్యంతో అన్ని రంగాల్లో ప్రముఖ సంస్థలు, పారిశ్రామిక దిగ్గజాలకు ప్రభుత్వం తగినంత మద్దతు ఇస్తుందని మంత్రి శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు.

అమెజాన్‌తో భారీ ఒప్పందం

హైదరాబాద్ లో రూ.60 వేల కోట్లు పెట్టుబడి పెట్టేందుకు అమెజాన్ కంపెనీ అంగీకరించింది. డేటా సెంటర్లలో

- మిగతా 2 లో

కర్నూలులో ఏఐవైఎఫ్ జాతీయ మహాసభలు

- ఉద్యోగాల కల్పనలో కేంద్రం విఫలం
- అమరావతిని ఫ్రీజోన్‌గా చేయాలి
- ఏఐవైఎఫ్ జాతీయ ప్రధానకార్యదర్శి తిరుమలై రామన్

విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు: కర్నూలు నగరంలో ఏప్రిల్‌లో ఏఐవైఎఫ్ 17వ జాతీయ మహాసభలు నిర్వహిస్తున్నట్లు ఏఐవైఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి తిరుమలై రామన్ వెల్లడించారు. జాతీయ మహాసభలు కర్నూలులో నిర్వహించాలని నిర్ణయించినట్లు చెప్పారు. యువతను ఉద్యమాలకు సన్నద్ధం చేయడానికి జాతీయ మహాసభలు కీలకం కానున్నట్లు తెలిపారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో విఫలమైందని, నిరుద్యోగులకు ఏఐవైఎఫ్ అండగా ఉంటుందని, నిరుద్యోగుల కోసం పోరాటాలు చేస్తామని తిరుమలై రామన్ అన్నారు. స్థానిక సీఆర్ భవన్‌లో ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎన్.లెనిన్‌బాబుతో కలసి ఆయన గురువారం పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని అధికారంలోకి వచ్చిన బీజేపీ...పదిన్నర సంవత్సరాల్లో ఎన్ని ఉద్యోగాలు ఇచ్చిందో చెప్పాలని తిరుమలై డిమాండ్ చేశారు. భగత్‌సింగ్ జాతీయ ఉపాధి హామీ చట్టం అమలు చేయాలని ఏఐవైఎఫ్ డిమాండ్ చేస్తోందన్నారు. ఈ చట్టాన్ని ప్రభుత్వం సక్రమంగా అమలు చేస్తే అందరికీ ఉద్యోగాలు వస్తాయన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో ఖాళీ ఉద్యోగాలు భర్తీ చేయడం లేదని ఆయన విమర్శించారు. ఏటా 40 లక్షల ఉద్యోగాలు ఖాళీ అవుతున్నా... వాటి వివరాలు తెలియచేయడం లేదన్నారు. మోదీ సర్కారు ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగిస్తున్నదని విమర్శించారు. దీనివలన నిరుద్యోగులు

- మిగతా 2 లో

'కృష్ణా' వాటాలపై 13న విచారణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మధ్య కృష్ణా జలాల నీటి కేటాయింపుల వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై ఫిబ్రవరిలో విచారణ చేపడతామని సుప్రీంకోర్టు వెల్లడించింది. కృష్ణా ట్రిబ్యునల్ నీటి పంపకాల అంశాన్ని గురువారం సర్వోన్నత న్యాయ స్థానంలో ఏపీ ప్రభుత్వం ప్రస్తావన చేయడంతో ఈ మేరకు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ కోటేశ్వర్ సింగ్ నేతృత్వంలోని ధర్మాసనం నిర్ణయం తీసుకుంది. కృష్ణా ట్రిబ్యునల్‌కు సంబంధించి మూడు రాష్ట్రాల మధ్య పంపకాలు 2014కు ముందే పూర్తయిన నేపథ్యంలో రాష్ట్ర

- మిగతా 2 లో

డయాఫ్రం వాల్ నిర్మాణం వేగవంతం: మంత్రి నిమ్మల

విశాలాంధ్ర-పోలవరం: పోలవరం ప్రాజెక్టుకు కొత్త డయాఫ్రం వాల్ నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు సూచించారు. షెడ్యూల్ ప్రకారం పనులు పూర్తి చేయాలన్నారు. మంత్రి గురువారం నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ డయాఫ్రం వాల్ నిర్మాణం సగం పూర్తయ్యాక ఈసీఆర్ఎఫ్ డ్యామ్ పనులు మొదలు పెడతామని చెప్పారు. జగన్ తుగ్లక్ పాలన వల్ల పోలవరం ప్రాజెక్ట్ మరో 20 ఏళ్లు వెనక్కి వెళ్లిందని విమర్శించారు. పాత డయాఫ్రం

- మిగతా 2 లో

సీసీఐ నిషేధంపై లా ట్రిబ్యునల్ స్టే

న్యూఢిల్లీ: వాట్సప్-మెటా డేటా షేరింగ్ పద్ధతులపై కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) విధించిన ఐదేళ్ల నిషేధంపై నేషనల్ కంపెనీ లా అప్పీలేట్ ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్ ఏటీ) గురువారం స్టే విధించింది. ఈ నిషేధం దేశంలో వాట్సప్ వ్యాపార నమూనాకు విఘాతం కలిగిస్తుందని జస్టిస్ అశోక్‌భూషణ్ నేతృత్వంలోని ఎన్‌సీఎల్‌ఏటీ ధర్మాసనం పేర్కొంది. వాట్సప్ భారత్‌లో దాదాపు 500 మిలియన్లకు పైగా నెలవారీ యాక్టివ్ వినియోగదారులను కలిగి ఉంది. అలాగే సీసీఐ విధించిన రూ.213 కోట్ల పెనాల్టీలో 50 శాతాన్ని

- మిగతా 2 లో

'న్యూ ఎనర్జీ'తో అధిక పెట్టుబడులు

- ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తాం
- అసోసియేషన్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణలో భట్టి

విశాలాంధ్ర - హైదరాబాద్: ప్రపంచంతో పోటీ పడాలని ప్రజా ప్రభుత్వం తీసుకువచ్చిన న్యూ ఎనర్జీ పాలసీ వల్ల రాష్ట్రానికి అత్యధికంగా పెట్టుబడులు రాబోతున్నాయని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఖైరతాబాద్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ భవనంలో గురువారం తెలంగాణ స్టేట్ పవర్ ఇంజినీర్స్ అసోసియేషన్-2025 డైరీ, క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. అనంతరం భట్టి మాట్లాడుతూ... గత ప్రభుత్వం న్యూ ఎనర్జీ పాలసీ తీసుకురాకుండా నిర్లక్ష్యం చేసిందన్నారు. దీంతో రాష్ట్ర అభివృద్ధి కుంటుపడిందన్నారు. వేసవిలో పరిశ్రమలు, వినియోగదారులు, వ్యవసాయానికి ఎటువంటి ఇబ్బంది లేకుండా నాణ్యమైన విద్యుత్తును సమృద్ధిగా సరఫరా చేస్తామని చెప్పారు. ఎనర్జీ సెక్రటరీ నుంచి కింది స్థాయి ఉద్యోగి వరకు ఎలాంటి ఆటంకం లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరాకు సమాయత్తమయ్యారన్నారు. వ్యవసాయానికి అందిస్తున్న ఉచిత కరెంటుకు విద్యుత్ శాఖకు ఇప్పటి వరకు రూ.12,486 కోట్లు చెల్లించినట్టు చెప్పారు. గృహ జ్యోతి పథకం ద్వారా పేద కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచితంగా సరఫరా చేస్తున్న విద్యుత్తు వల్ల డిస్కంలపై భారం పడకుండా రాష్ట్ర ఆర్థిక శాఖ నుంచి రూ.1,538 కోట్లు, ప్రభుత్వ విద్యా సంస్థలకు అందిస్తున్న ఉచిత కరెంటుకు గాను రూ.199 కోట్లు విద్యుత్ శాఖకు చెల్లించినట్టు చెప్పారు. మ్యాన్ పవర్ సూచనను తప్పనిసరిగా పరిశీలిస్తామని వెల్లడించారు. విద్యుత్ శాఖలో ఐదు వేల మందికి ఒకేసారి పదోన్నతులు కల్పించినట్టు వివరించారు. కారుణ్య నియామకాలతో పాటు, కొత్త నియామకాలు చేపట్టామన్నారు. యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్, భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ ఇతర హైడల్ ప్రాజెక్టుల పురోగతి పనులపై నిరంతరం పర్యవేక్షించి వైటీపీఎస్ యూనిట్-2ను వినియోగంలోకి తీసుకువచ్చామని వెల్లడించారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడానికి ప్రజా ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఎనర్జీ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ట్రాన్స్‌కో సీఎం డి. కృష్ణ భాస్కర్, ఆ సంఘం అధ్యక్షులు రత్నాకర్ రావు, ప్రధాన కార్యదర్శి సదానందం, వెంకటేశ్వర్లు, జనప్రియ పాల్గొన్నారు.

నిరాటంకంగా నాణ్యమైన విద్యుత్

విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని భట్టి విక్రమార్క అన్నారు. ప్రజాభవన్ లో ఎస్పీడీసీఎల్, ట్రాన్స్‌కో అధికారులతో వేసవిలో విద్యుత్ సరఫరా ప్రణాళికాలపై గురువారం సమీక్షించారు. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ నిరాటంకంగా సరఫరా చేయాలని ఆదేశించారు. సీఎండీ మొదలు ఎస్ఈల వరకు క్షేత్రస్థాయిలో విస్తృతంగా అవగాహన సమావేశాలు నిర్వహించాలని కోరారు. మీడియా ప్రతినిధులను భాగస్వాములను చేయాలని ఆదేశించారు. ఉన్నత అధికారులు క్షేత్ర పర్యటన షెడ్యూల్ విడుదల చేయాలని ఆదేశించారు. 108 తరహాలోనే విద్యుత్ సరఫరాలో సమస్యల పై ఫిర్యాదు చేసేందుకు ఏర్పాటు చేసిన 1912 ను విస్తృతంగా ప్రచారం చేయాలని ఆదేశించారు. ఫిర్యాదులను వెనువెంటనే పరిష్కరించాలని, ప్రచారానికి అదనపు

- మిగతా 2 లో

విమానాశ్రయానికి సానుకూలం

అధ్యయన బృందం పర్యటన శుభపరిణామం: కూనంనేని

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం: కొత్తగూడెంలో విమానాశ్రయం ఏర్పాటు ప్రక్రియకు ముందడుగు పడింది. స్థలాలపై సర్వే తో పాటు అనుకూల ప్రాంతాల అధ్యయానికి కేంద్ర బృందం గురువారం కొత్తగూడెం చేరుకుంది. పౌర విమానయాన ప్రతినిధులు కొత్తగూడెంలో పర్యటించడం శుభ పరిణామని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆనందం వ్యక్తం చేశారు. బృందం పర్యటనతో విమానాశ్రయం ఏర్పాటు ప్రక్రియ ప్రారంభమైనట్లేనన్నారు. రామవరం పట్టణానికి సమీపంలోని గరీబ్ పేట ప్రాంతాల్లో అధ్యయన బృందంతో కలిసి కూనంనేని వెళ్లారు. ఇక్కడి పరిస్థితులను, విమానాశ్రయం ఏర్పాటు ఆవశ్యకతను బృందానికి ఆయన క్షుణ్ణంగా వివరించారు. అనంతరం మాట్లాడుతూ రామవరం-గరీబ్ పేట ప్రాంతంలో ఉన్న స్థలాన్ని బృందం పరిశీలించిందని, సానుకూలమైన నివేదికను కేంద్ర ప్రభుత్వానికి అందిస్తారని కూనంనేని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ప్రాంత ప్రజలు విమానాశ్రయం ఏర్పాటుకు సానుకూలంగా ఉన్నారన్నారు. పారిశ్రామిక ప్రాంతంగా ఉన్న కొత్తగూడెంకు విమానాశ్రయం ఏర్పాటు చేయాలని ప్రభుత్వం దృష్టికి ఎన్నో సార్లు తీసుకెళ్లానన్నారు. విమానాశ్రయం ఏర్పాటుతో జిల్లా మొత్తంగా సమగ్రాభివృద్ధి సాధిస్తుందన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, చైర్‌పర్సన్ సీతాలక్ష్మి, కమిషనర్ శేషాంజన్ స్వామి, కౌన్సిలర్లు కంచర్ల జమలయ్య, భూక్యా శ్రీనివాస్, బోయిన విజయ్ కుమార్, ధర్మరాజు, సత్యనారాయణాచారి, మాచర్ల శ్రీనివాస్, ఎండి. యూసుఫ్, ఫహీమ్, పిడుగు శ్రీనివాస్, నేరెళ్ల రమేష్, గుత్తుల శ్రీనివాస్ ఉన్నారు.

పోలీసు నిఘా నీడలో శంషాబాద్ ఎయిర్‌పోర్ట్

విశాలాంధ్ర - హైదరాబాద్: గణతంత్ర వేడుకలను పురస్కరించుకుని శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు నిఘవర్గాలు రెడ్ అలర్ట్ ప్రకటించాయి. ఈ నెల 26న జరిగే వేడుకలకు పోలీసులు, భద్రతా అధికారులు అప్రమత్తం అయ్యారు. 30వ తేదీ వరకు రెడ్ అలెర్ట్ కొనసాగుతుంది. సందర్శకులు ఎవరు రావద్దని ఆదేశాలు జారీ చేశారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా సీఐఎస్ఎఫ్ భద్రతా అధికారులు ఎయిర్ పోర్టులో భద్రతను కట్టుదిట్టం చేశారు. ప్రధాన దారిలో బాంబ్ స్క్వాడ్, డాంగ్ స్క్వాడ్ తనిఖీలు చేపడుతున్నారు. వాహనాలపై ప్రత్యేక నిఘా పెట్టారు. అనుమానం వచ్చిన వాహనాలను తనిఖీ చేసిన తర్వాతే లోపలికి అనుమతిస్తున్నారు. అనుమానిత వస్తువులు, అనుమానిత వాహనాలు, అనుమానితులు కనిపిస్తే క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు.

ఇదీ లోకం!

మనకు ఎలా కావాలంటే అలా సర్వే చేసి మీడియాకి రిలీజ్ చేస్తాడు, తీసేసుకుందాం!

ఎన్‌కౌంటర్‌లో మరో అగ్రనేత చంద్రహాస్ మృతి

పోలీసుల వెల్లడి

విశాలాంధ్ర-చింతూరు: చత్తీస్‌గఢ్-ఒడిశా సరిహద్దులో ఇటీవల జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు రామచంద్రారెడ్డి అలియాస్ చలపతితో పాటు కీలక నాయకులు మరణించారు. ఈ ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు పార్టీ మరో అగ్రనేత మృతిచెందినట్లు తెలంగాణ పోలీసులు తెలిపారు. తెలంగాణకు చెందిన చంద్రహాస్ మృతదేహాన్ని పోలీసులు

- మిగతా 2 లో

ప్రకటనలు చూసి ఓటేయం

- ప్రచార ఆర్భాటాలు పట్టించుకోం... పారదర్శకత, ఫలితాలే ముఖ్యం
- ఢిల్లీ ఓటర్ల మనోగతం

న్యూఢిల్లీ: అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఢిల్లీలో రాజకీయం వేడెక్కింది. ప్రధాన పార్టీలు నువ్వా-నేనా అన్నట్లు ప్రచార ఆర్భాటాలు సాగిస్తున్నాయి. మరోసారి అధికారం కోసం ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. కాగా, ఎలాగైనా ఆప్ పాలనకు చరమ గీతం పాడాలని బీజేపీ ముందుకు సాగుతోంది. కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం తన వంతు ప్రయత్నం చేస్తోంది. త్రిముఖ పోరుతో ఆమ్ ఆద్మీ పార్టీ, కాంగ్రెస్, బీజేపీ పోటాపోటీగా ప్రకటనలు, ప్రచారం చేస్తున్నాయి. ఢిల్లీ ఓటర్లను తమ వైపునకు తిప్పుకునేందుకు ఏ పార్టీకి ఆ పార్టీ హామీలు గుప్పిస్తున్నాయి. ఈ తరుణంలో ఢిల్లీ వాసులపై రాజకీయ ప్రకటనల ప్రభావాన్ని గుర్తించేందుకు 'ఐక్యూబ్స్ వైర్' అనే గ్లోబల్ టెక్ సంస్థ ఓ సర్వే నిర్వహించింది. రాజకీయ ప్రకటనలు చూసి ఓటు వేయబోమని, పారదర్శకత, ఫలితాలే

- మిగతా 2 లో

తెలంగాణ సాయుధ పోరాట నేపథ్యం - 1

హైదరాబాద్ సంస్థానంలోని నిజాం పాలనలోని ప్రాంతంలో జరిగిన రైతాంగ పోరాటాన్ని, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం అంటాం. ఈ పోరాటం కమ్యూనిస్టు పార్టీ అధ్వర్యంలో 1946 నుంచి 1951 దాకా సాగింది. తారీకుల ప్రకారం 1946 జులై4 నుంచి 1951 అక్టోబర్ 25 దాకా సాగింది.

ప్రత్యేక వ్యాసం 4వ పేజీలో

నెదర్లాండ్స్ కమ్యూనిస్టు ఉద్యమ నేత
విల్ వాన్ డెర్ క్లిఫ్ట్ కన్నుమూత

డచ్: న్యూ కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ది నెదర్లాండ్స్ (ఎన్‌సీపీఎన్) కేంద్ర కమిటీ, పొలిట్ బ్యూరో మాజీ సభ్యుడు విల్ (విల్లీ ఎర్నెస్ట్ కార్ల్) వాన్ డెర్ క్లిఫ్ట్ కన్నుమూశారు. 1942 నవంబరు 15న జన్మించిన క్లిఫ్ట్ ఈనెల 19వ తేదీన మృతి చెందినట్లు ఎన్‌సీపీఎన్ అధికారికంగా ప్రకటించింది. క్లిఫ్ట్ మరణానికి సంతాపం తెలిపింది. మేనిఫెస్ట్ అండ్ ఇంటర్నేషనల్ వార్తాపత్రిక ఎడిటర్-ఇన్-చీఫ్‌గానూ క్లిఫ్ట్ గణనీయమైన సేవలు అందించారని కొనియాడింది. మెరుగైన ప్రపంచం కోసం ఆయన నిర్విరామంగా పనిచేశారని గుర్తుచేసుకుంది. నెదర్లాండ్స్ కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతల్లో క్లిఫ్ట్ ముఖ్యుడని ఎన్‌సీపీఎన్ పేర్కొంది. కమ్యూనిస్టు కుటుంబంలో జన్మించిన క్లిఫ్ట్ చిన్నతనం నుంచే కమ్యూనిస్టు భావాజాలానికి, కమ్యూనిస్టు సిద్ధాంతాలకు ఆకర్షితులయ్యారు. కమ్యూనిస్టు ఉద్యమాల నుంచి స్ఫూర్తి పొందారు. క్లిఫ్ట్ తల్లి జర్మన్ కమ్యూనిస్టు. క్లిఫ్ట్ వృత్తిపరంగా షిప్ ఇంజినీర్ కాగా ఆయన కార్మిక సంఘంలో క్రియాశీలంగా వ్యవహరించారు. సామాజిక కార్యకర్తగా సామాజిక చైతన్యానికి కృషి చేశారు. ది హేగ్‌లో సామాజిక కార్యకర్తల కోసం కార్మిక సంఘాన్ని ఏర్పాటు చేయడంలో కీలక పాత్ర పోషించారు. కార్మిక నాయకుడిగా ఎదిగిన ఆయన 1972లో నెదర్లాండ్స్ కమ్యూనిస్టు పార్టీ (సీపీఎన్)లో చేరారు. అంచెలంచెలుగా ఎదిగారు. కొన్ని దశాబ్దాల పాటు పొలిట్ బ్యూరోలో, కేంద్ర కమిటీలో సేవలు అందించారు. 28 ఏళ్ల పాటు మేనిఫెస్ట్ పత్రిక (ఎన్‌సీపీఎన్ అధికారిక పత్రిక)కు ఎడిటర్-ఇన్-చీఫ్‌గా ఉన్నారు. ఈమధ్యనే ఆయన ఆరోగ్యం క్షీణించింది. తుది వరకు ప్రపంచ శ్రేయస్సు కోసం ఆలోచించారు. అన్యాయం, దోపిడీ, యుద్ధాలు లేని సమాజాన్ని కాంక్షించారు. ప్రపంచంలో చోటుచేసుకుంటున్న తాజా పరిణామాలపై ఆందోళనకు గురయ్యేవారు. క్లిఫ్ట్ మరణం పార్టీకి తీరని లోటు అంటూ ఎన్‌సీపీఎన్ ప్రకటన తెలిపింది. క్లిఫ్ట్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లతామని, సామాజిక న్యాయం, సోషలిజం కోసం పోరాటాన్ని కొనసాగిస్తామని సంకల్పించింది. క్లిఫ్ట్ మరణానికి సంతాపం తెలుపుతూ ఆయన భార్య టినెకె, కుమార్తె జుడిత్, అల్లుడు రెమి, మనుమళ్లు, ఆత్మీయులకు నెదర్లాండ్స్ కమ్యూనిస్ట్ పార్టీ ప్రగాఢ సానుభూతి తెలిపింది.

కేకేఈ సంతాపం: కమ్యూనిస్టు నాయకుడు, ఎన్‌సీపీఎన్ అంతర్జాతీయ సంబంధాల కార్యదర్శిగా విశేష సేవలు అందించిన క్లిఫ్ట్ మరణం బాధాకరమని గ్రీస్ కమ్యూనిస్టు పార్టీ (కేకేఈ) ఓ ప్రకటన విడుదల చేసింది. బరువెక్కిన హృదయాలతో ఆయనకు తుది వీడ్కోలు పలుకుతున్నామని పేర్కొంది. ఎంతటి సవాళ్లు ఎదురైనా... క్లిష్ట పరిస్థితులు ఎదురైనా క్లిఫ్ట్ ఎప్పుడు వెనకడుగు వేయలేదని, ఆయన యువ కమ్యూనిస్టులకు ఆదర్శనీయులని పేర్కొంది. పెట్టుబడిదారీ వర్గ దోపిడీ రహిత సోషలిస్టు సమాజ నిర్మాణానికి తుది వరకు ప్రయత్నించారని కొనియాడింది. శ్రామిక వర్గానికి క్లిఫ్ట్ వెన్నుదన్నుగా నిలిచారని గుర్తుచేసుకుంది. క్లిఫ్ట్ మరణం తీరని లోటని పేర్కొంది. ఆయన కుటుంబానికి, తోటి కమ్యూనిస్టులకు కేకేఈ ప్రగాఢ సానుభూతి తెలిపింది.

అక్రమ వలసదారుల నిర్బంధ బిల్లుకు కాంగ్రెస్ ఆమోదం

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ అనేక మార్పులు చేర్పులకు సంకల్పించారు. అక్రమ వలసదారుల నిర్బంధ బిల్లును తీసుకొచ్చారు. దీనిని అమెరికా కాంగ్రెస్ ఆమోదించింది. అధ్యక్షుడు ట్రంప్ సంతకంలో ఇది చట్ట రూపం దాల్చబోతోంది. ట్రంప్ చేయబోయే తొలి బిల్లు ఇదే! దొంగతానాలు, నేరాల కట్టడికి అక్రమ వలసదారుల నియంత్రణే లక్ష్యంగా ఈ బిల్లును కాంగ్రెస్ ఆమోదించింది. వలసవాదుల విధానంపై కాంగ్రెస్‌లో ఎప్పుడూ వాడీవేడి చర్చ జరుగుతూనే ఉంటుంది. తాజా ప్రతిపాదనకు 46 మంది డెమొక్రాట్లు, కొందరు రిపబ్లికన్లు అభ్యంతరం తెలిపారు. అయితే బిల్లుకు 263-156 లెక్కన ఓట్లు లభించాయి. మూడు దశాబ్దాల్లో వలసవాదుల సంబంధించి కాంగ్రెస్ ఆమోదించిన కీలక బిల్లు ఇదేనని అలబామా రిపబ్లికన్ సెనేటర్ కేటీ బ్రిట్ వెల్లడించారు. ఈ బిల్లు అమలుకు సరిపడ నిధులు లేవని ఫెడరల్ అధికారులు తెలిపారు. దీంతో ఆటంకాలు రావచ్చు అని కొందరు నిపుణులు అభిప్రాయపడ్డారు. ఇదిలావుంటే అమెరికాలో అక్రమంగా ఉంటున్న లక్షల మంది శరణార్థులను తిప్పి పంపేందుకు నూతన అధ్యక్షుడు సిద్ధమయ్యారు. ఇదే క్రమంలో మెక్సికో సరిహద్దుల్లో శరణార్థి శిబిరాల మూసివేతకు ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లు జారీచేశారు. రెఫ్యూజీ రీసెటిల్మెంట్లను రద్దు చేస్తూ ఆయన ఆదేశాలిచ్చారు.

జల విధానం మార్చుకోండి: కాలిఫోర్నియాకు ట్రంప్ హెచ్చరిక

జల విధానాన్ని మార్చుకోవాలంటూ కాలిఫోర్నియాకు ట్రంప్ తేల్చిచెప్పారు. లేని పక్షంలో విపత్తు సాయాన్ని నిలిపివేస్తామంటూ హెచ్చరించారు. లాస్ ఏంజిల్స్‌లో కార్చిచ్చు క్రమంలో కాలిఫోర్నియా క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటోంది. ఆ రాష్ట్ర నీటి నిర్వహణపై ట్రంప్ అసంతృప్తితో ఉన్నారు.

జల విధానంలో మార్పులు తేవాలంటూ కాలిఫోర్నియా నేతలకు సూచించారు. అలా చేయకపోతే మీ రాష్ట్రానికి ప్రభుత్వమిచ్చే విపత్తు సాయాన్ని ఆపేస్తానని హెచ్చరించారు. నీటిని విడుదల చేసేంత వరకు కాలిఫోర్నియాకు ఏది ఇవ్వరాదన్నారు. రాష్ట్రాలు తమ సొంత సమస్యలను స్వయంగా పరిష్కరించుకోవలని చెప్పారు. అయితే ఇందుకోసం ఎలాంటి సంస్కరణలు తేబోతున్నది మాత్రం ట్రంప్ వెల్లడించలేదు.

మళ్లీ ఎఫ్‌టీఓ జాబితాలోకి హౌతీలు....

యెమన్‌కు చెందిన హౌతీలను మరోమారు 'విదేశీ ఉగ్రవాద సంస్థ (ఎఫ్‌టీఓ)' జాబితాలో చేర్చుతూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ ఇచ్చారు. నాలుగేళ్ల కిందట హౌతీలను ఎఫ్‌టీ జాబితా నుంచి బైడెన్ ప్రభుత్వం తొలగించిన విషయం తెలిసిందే. అయితే తాజా ఆదేశాలు 30 రోజుల్లో అమల్లోకి వస్తాయని ప్రభుత్వ కార్యదర్శి మార్కో రుబియో వెల్లడించారు.

ఎన్‌కౌంటర్‌లో మరో అగ్రనేత చంద్రహాస్ మృతి

(మొదటిపేజీ తరువాయి)

గుర్తించారు. మంగళవారం నాటి ఎన్‌కౌంటర్‌లో హైదరాబాద్‌లోని జవహర్‌నగర్ పరిధి యాప్రాల్ వాసి ప్రమోద్ అలియాస్ చంద్రహాస్ మరణించినట్లు పోలీసులు నిర్ధారించారు. ఒడిశాతో పాటు ఈస్ట్ జోనల్ బ్యూరో ఇంఛార్జ్‌గా ఉన్న అతడి తలపై రూ.20 లక్షల రివార్డ్ ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ఎన్‌కౌంటర్‌లో మొత్తం 20 మందికి పైగా మావోయిస్టులు మరణించినట్లు పోలీసులు వెల్లడించారు. వీరిలో 17 మృతదేహాలను స్వాధీనం చేసుకుని పోస్ట్‌మార్టం నిమిత్తం ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌కు తరలించారు. మిగతా మృతదేహాల కోసం గాలింపు కొనసాగుతోంది. చంద్రహాస్ 1985 నుంచి అజ్ఞాతంలో ఉన్నారు. చంద్రహాస్ మృతిని ధృవీకరిస్తూ 'చంద్రహాస్ మృతదేహం బుధవారం లభ్యమైంది' అని తెలంగాణ పోలీసు సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. 57 ఏళ్ల చంద్రహాస్ మావోయిస్టు పార్టీలో కీలకనేత. కలహండి-కందమాల్-బౌధ్-నాయగర్ (కేకేబీయన్) డివిజన్ కమిటీ, ఈస్ట్ సబ్-జోనల్ బ్యూరో కార్యదర్శిగా ఆయన పనిచేశారు.

భారీ ఆయుధ డంపు స్వాధీనం

కాగా, ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో భద్రతా బలగాలు మావోయిస్టు పార్టీకి చెందిన భారీ డంపును కనుగొన్నాయి. మెటగూడెం - దులేర్ గ్రామాల మధ్య అటవీ ప్రాంతంలో పేలుడు పదార్థాలు, ఆయుధాల తయారీ సామగ్రిని వెలికి తీశారు. మావోయిస్టుల ఉనికి గురించి ఇంటెలిజెన్స్ వర్గాలు ఇచ్చిన సమాచారం మేరకు గాలింపు జరిపి...డంప్‌ను కనుగొన్నాయి. మెటగూడెం గ్రామానికి 1.5 కిలోమీటర్ల దూరంలో గల మావోయిస్టుల సొరంగాన్ని కనుగొని... అందులో గల ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. మావోయిస్టుల ఆయుధశాలలో సబ్బు కేసుల్లో ప్యాక్ చేసిన 21 ఐఈడీ, మల్టిపుల్ బ్యారెల్ గ్రెనేడ్ లాంచర్ (బీజీయల్) బాంబులు, ఒక జనరేటర్‌ను స్వాధీనం చేసుకున్నాయి. భద్రతా బలగాలను ఉన్నతధికారులు అభినందిచారు.అలాగే, బీజాపూర్ జిల్లా బాసగూడలో మావోయిస్టుల కుట్రను భద్రతా దళాలు భగ్నం చేశాయి. బాసగూడ-ఆవపల్లి మార్గంలో పోలీసుల వాహనాలు పేల్చేందుకు మావోయిస్టులు అమర్చిన 50 కిలోల మందుపాతరను సీఆర్‌పీఎఫ్ దళాలు నిర్వీర్యం చేశాయి. జాతీయ రహదారిపై సొరంగం తవ్వి కల్వర్టు కింద మావోయిస్టులు మందుపాతర అమర్చినట్టు అధికారులు తెలిపారు. ముందుగానే గుర్తించి నిర్వీర్యం చేయడంతో ప్రమాదం తప్పిందని చెప్పారు.

'కృష్ణా' వాటాలపై 13న విచారణ

(మొదటిపేజీ తరువాయి)

విభజన తర్వాత ఏపీ, తెలంగాణ మధ్య నీటి పంపకాల వ్యవహారాన్ని తేల్చాలని 2023 అక్టోబరులో కేంద్రం నోటిఫికేషన్ జారీ చేసింది. అంతకుముందే తెలంగాణ ప్రభుత్వం కృష్ణా ట్రిబ్యునల్‌ను ఆశ్రయించింది. తెలంగాణ భూ భాగంలోనే కృష్ణా నది ఎక్కువగా ప్రవహిస్తున్నందున తమ రాష్ట్రానికి కృష్ణా జలాల్లో 70 శాతం వాటా ఇవ్వాలని ట్రిబ్యునల్‌ను కోరింది. లేదంటే వ్యవహారం తేలే వరకు రెండు రాష్ట్రాలకు 50శాతం చొప్పున నీటి కేటాయింపులు చేయాలని కోరుతూ ట్రిబ్యునల్‌లో పిటిషన్ దాఖలు చేసింది. తెలంగాణ వాదనను ఏపీ ప్రభుత్వం ఖండిస్తోంది. ఇప్పటికే ప్రాజెక్టులకు ట్రిబ్యునల్ నీటి పంపకాలు పూర్తి చేసిందని, పాత, ప్రస్తుత విధానం ప్రకారం ఏపీకి 512, తెలంగాణకు 299 టీఎంసీలు ప్రకారం మాత్రమే నీటి పంపిణీ కొనసాగించాలని డిమాండ్ చేస్తోంది. కేఆర్ఎంబీ కూడా ఇదే పద్దతిలో 66 :34 నిష్పత్తిలోనే నీటి పంపిణీ చేపడుతోంది. మరోవైపు కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్‌పై ఇప్పటికే ఏపీ ప్రభుత్వం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఆ పిటిషన్‌పై విచారణ కొనసాగుతుండగానే మరోసారి కృష్ణా ట్రిబ్యునల్ తీసుకున్న నిర్ణయాన్ని సుప్రీంకోర్టులో ప్రత్యేకంగా ఏపీ ప్రభుత్వం మెన్షన్ చేసింది. జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ కోటేశ్వర్ సింగ్ నేతృత్వంలోని ధర్మాసనం ముందు ఈ విషయాన్ని ప్రస్తావించింది. ఫిబ్రవరి 19 నుంచి కృష్ణా ట్రిబ్యునల్ విచారణ ప్రారంభం కానున్న నేపథ్యంలో అంతకుముందే తాము దాఖలు చేసిన రిట్ పిటిషన్‌పై వాదనలు విని తీర్పు ఇవ్వాలని ఏపీ కోరింది. అందుకు అనుగుణంగా స్పందించిన ధర్మాసనం... ఫిబ్రవరి 13న మధ్యాహ్నం 2 గంటలకు వాదనలు వింటామని తెలిపింది. ఆ మేరకు తెలుగు రాష్ట్రాలు, కేంద్రం సిద్ధంగా ఉండాలని స్పష్టం చేసింది.

'న్యూ ఎనర్జీ'తో అధిక పెట్టుబడులు

(మొదటిపేజీ తరువాయి)

నిధులు మంజూరు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. మార్చిలో పీక్ డిమాండ్ 6,328 మెగా వాట్ల విద్యుత్ సరఫరా చేయడానికి కావాలసిన అన్నీ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ట్రాన్స్ మిషన్ వ్యవస్థను బలోపేతం చేయాలని ఆదేశించారు. సబ్ స్టేషన్ల వారీగా ఓవర్ లోడ్ సమస్యలను గుర్తించి ముందుగానే వాటిని పరిష్కరించుకోవాలని సూచించారు. విద్యుత్ అంతరాయం ఏర్పడితే ఎమర్జెన్సీ రీస్టోర్ టీం వాహనాలను వాడుతున్నారని తెలిపారు. ఇంధన శాఖ కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ట్రాన్స్‌కో సీఎండీ డి. కృష్ణ భాస్కర్, ఎస్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి, డైరెక్టర్లు, ముఖ్య అధికారులు పాల్గొన్నారు.

సీసీఐ నిషేధంపై లా ట్రిబ్యునల్ స్టే

(మొదటిపేజీ తరువాయి)

రెండువారాల్లోగా చెల్లించాలని ఎన్‌సీఎల్ఏటీ మెటాను ఆదేశించింది. అయితే మెటా ఇప్పటికే జరిమానాలో 25 శాతం చెల్లించింది. సీసీఐ ఆదేశాలపై స్టే విధించాలని కోరుతూ మెటా, వాట్సప్ గతవారం నేషనల్ లా ట్రిబ్యునల్‌ను ఆశ్రయించాయి. ఈ అభ్యర్థనపై విచారణ చేపట్టిన ఎన్‌సీఎల్ఏటీ తీర్పును రిజర్వ్ చేసింది.

టెక్ హబ్‌గా విశాఖ

- 7వ తరగతి నుంచే పాఠ్యాంశాల్లో ఏఐపై అవగాహన
- దేశంలోనే తొలి యూనివర్సిటీ అమరావతిలో ఏర్పాటు
- ఏఐ ఎనర్జీ ఇంపాక్ట్ సదస్సులో మంత్రి లోకేశ్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం ఇంటర్నెట్ సీ కేబుల్స్‌తో పాటు డేటా సెంటర్లు, ఏఐ, ఇతర డీప్ టెక్ వెంచర్‌లతో కొత్త టెక్ హబ్‌గా అవతరిస్తోందని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేశ్ చెప్పారు. ఏఐ ఎనర్జీ ఇంపాక్ట్ అంశంపై దావోస్ కాంగ్రెస్ హోటల్‌లో జరిగిన సదస్సుకు మంత్రి లోకేశ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ ఏఐ ప్రాధాన్యతను గుర్తించిన తమ ప్రభుత్వం విద్యార్థులకు 7 నుంచి 9వ తరగతి వరకు పాఠ్యాంశాల్లో ఏఐని త్వరలో ప్రవేశపెట్టబోతున్నామన్నారు. వ్యవసాయం, ఆరోగ్య సంరక్షణ, సుస్థిరత, స్కిల్ డెవలప్‌మెంట్, స్టార్టప్ ఎకో సిస్టమ్ వంటి రంగాల్లో ఏఐ అప్లికేషన్లు అందించడం కోసం రాష్ట్ర ప్రభుత్వం గూగుల్‌తో ఒప్పందం చేసుకుంది. దేశంలోనే తొలి ఏఐ యూనివర్సిటీ ఏపీలో ఏర్పాటు కాబోతోందని మంత్రి లోకేశ్ చెప్పారు. భారతదేశం డేటా సెంటర్ సామర్థ్యం రాబోయే రెండేళ్లలో రెట్టింపై 2000 మెగావాట్లకు చేరుకోనుందని మంత్రి వెల్లడించారు.

కాగ్నిజెంట్ నుంచి త్వరలో శుభవార్త

కృత్రిమ మేధ అధునాతన సాంకేతిక నైపుణ్యాల్లో 10 లక్షల మందికి సాధికారిత కల్పించే లక్ష్యంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రతిపాదనలపై త్వరలోనే సానుకూల నిర్ణయం తీసుకుంటామని కాగ్నిజెంట్ టెక్నాలజీ సొల్యూషన్స్ సీఈవో ఎస్. రవికుమార్ చెప్పారు. మంత్రి నారా లోకేశ్ బెల్వడేర్‌లో ఆయనతో భేటీ అయ్యారు. కాగ్నిజెంట్ విస్తరణకు ఏపీలో ఉన్న అపార అవకాశాలను మంత్రి వివరించి... పెట్టుబడులు పెట్టాల్సిందిగా కోరారు. దానికి ఆయన సానుకూలంగా స్పందిస్తూ కాగ్నిజెంట్ టెక్నాలజీస్‌లో పనిచేస్తున్న 80 వేలమంది ఉద్యోగులను టైర్-1 నుంచి టైర్-2 నగరాలకు మార్చేందుకు ప్రణాళికలు ప్రకటించామని, దీనిలో భాగంగానే ఏపీ ప్రతిపాదనలపై త్వరలోనే సానుకూల నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

అపోలో టైర్ల తయారీ యూనిట్ ప్రారంభించండి

ఆటోమేటివ్ పరిశ్రమ శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ఏపీలో కొత్త టైర్ తయారీ యూనిట్‌ను ప్రారంభించాలని అపోలో టైర్స్ వైస్‌చైర్మన్ నీరజ్ కన్వర్‌ను మంత్రి లోకేశ్ కోరారు. ఏపీలోని కీలక రంగాల్లో స్విస్ కంపెనీలను ఆహ్వానించడానికి తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని, టిపా ద్వారా యూరోపియన్ మార్కెట్‌కు కనెక్ట్ చేయాలని కాంటన్ ఆఫ్ వాడ్ స్టేట్ కౌన్సిలర్ క్రిస్టెల్లాతో భేటీ సందర్భంగా మంత్రి విజ్ఞప్తి చేశారు. ఆర్ఈ పరికరాల తయారీ యూనిట్‌ను నెలకొల్పాలని ఎన్విజన్ సంస్థ సీఈవో లీజంగ్‌ను కోరారు. లోకేశ్ వెంట పరిశ్రమల మంత్రి టీజీ భరత్ ఉన్నారు.

వంద కోట్లకు చేరువలో భారత ఓటర్లు: ఈసీ

న్యూఢిల్లీ: దేశంలో ఓటర్ల సంఖ్య వంద కోట్లకు చేరువ కానుందని ఎన్నికల సంఘం (ఈసీ) వెల్లడించింది. గతేడాది జరిగిన లోక్‌సభ ఎన్నికల కంటే ప్రస్తుతం ఓటర్ల సంఖ్య పెరిగిందని ఈసీ తెలిపింది. లోక్‌సభ ఎన్నికల సమయంలో 96.88 కోట్ల ఓటర్లు ఉండగా... ఆ సంఖ్య ఇప్పుడు 99.1 కోట్లకు పెరిగినట్లు ఈసీ లెక్కలు వెల్లడిస్తున్నాయి. జనవరి 25వ తేదీన జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఈ మేరకు ఎన్నికల సంఘం ఓ ప్రకటన విడుదల చేసింది. 18-29 సంవత్సరాల మధ్య వయసు గల ఓటర్లు 21.7 కోట్ల మంది ఉన్నారని తెలిపింది. ఇటీవలి కాలంలో ఎన్నికల లింగ నిష్పత్తి కూడా పెరిగిందని పేర్కొంది. 2024లో 948 పాయింట్లుగా ఉన్న లింగ నిష్పత్తి 2025కల్లా 954కి చేరింది. ఆరుశాతం మేర లింగనిష్పత్తి పెరిగిందని ఈసీ వివరించింది. కాగా, 1950 జనవరి 25న ఎన్నికల సంఘం ఏర్పాటైంది. ఈసీ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా యేటా జనవరి 25న ఓటర్ల దినోత్సవంగా జరుపుకుంటున్నాము. వచ్చే నెల ఫిబ్రవరి 5వ తేదీన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ఎన్నికల షెడ్యూల్ ప్రకటించే ఒకరోజు ముందు (జనవరి 6వ తేదీ) భారత్‌లో ఓటర్ల సంఖ్య 99 కోట్లు దాటిందని, త్వరలోనే వంద కోట్ల ఓటర్లు కలిగిన దేశంగా భారత్ రికార్డు సృష్టిస్తుందని ఎన్నికల ప్రధాన కమిషనర్ రాజీవ్ కుమార్ అన్నారు.

డ్రోన్లతో ఉత్తరాల బట్వాడా... 10 నిమిషాల్లో డెలివరీ

ధర్మశాల: ఉత్తరాల బట్వాడాలో పోస్టల్‌శాఖ మరో ముందడుగు వేసింది. హిమాచల్ పోస్టల్ విభాగం డ్రోన్‌ల సాయంతో మారుమూల, మంచు ప్రాంతాలకు ఉత్తరాలు బట్వాడా చేయనుంది. కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు పోస్టల్‌శాఖ ఎగువ సిమ్లాలో డ్రోన్ ద్వారా ఉత్తరాలు డెలివరీ చేసే ట్రయల్‌ను ప్రారంభించింది. డ్రోన్‌ల సాయంతో సబ్ పోస్టాఫీసు నుండి బ్రాంచ్ పోస్టాఫీసులకు ఐదు నుంచి పది నిమిషాల్లో ఉత్తరాలు డెలివరీ అవుతున్నాయి. గతంలో ఇలా ఉత్తరాలు చేరడానికి ఒక రోజు పట్టేది. ఈ ట్రయల్ విజయవంతం అయిన దరిమిలా కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు పోస్టల్ విభాగం హైటెక్ టెక్నాలజీని ఉపయోగించి ఇతర మారుమూల ప్రాంతాలకు ఉత్తరాలను బట్వాడా చేసే అవకాశం ఏర్పడనుంది. హిమాచల్ తపాలా శాఖ ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల మధ్య డ్రోన్ల ద్వారా సబ్ పోస్టాఫీస్ హట్కోటి నుంచి నందపూర్, కథాసు, ఆంటి, జాధగ్ బ్రాంచ్ పోస్టాఫీసులకు ఉత్తరాలు పంపుతోంది. ఒకేసారి ఏడు కిలోగ్రాముల వరకు భారాన్ని మోయగల ఈ డ్రోన్ ఐదు నుండి పది నిమిషాల్లో ఏడు నుండి ఎనిమిది కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామాలకు ఉత్తరాలు చేరవేసి, తిరిగివస్తోంది. మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో డ్రోన్‌ల ద్వారా ఉత్తరాల డెలివరీకి సంబంధించిన పూర్తి డేటాను ఆన్‌లైన్‌లో ఉంచుతున్నారు. డ్రోన్ ట్రయల్స్ కోసం ఒక ప్రైవేట్ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు పోస్టల్‌శాఖ అధికారి ఒకరు తెలిపారు.

6న ఏపీ మంత్రివర్గ సమావేశం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గ సమావేశం ఫిబ్రవరి 6వ తేదీ ఉదయం 11 గంటలకు జరగనుంది. సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగే మంత్రివర్గ సమావేశంలో వచ్చే బడ్జెట్ సమావేశాలతోపాటు అనేక కీలక అంశాలపై చర్చిస్తారని సమాచారం. ఈ మేరకు సీఎస్ కార్యాలయం గురువారం సర్క్యులర్ జారీజేసింది. మంత్రవర్గ సమావేశం ఆమోదం కోసం ప్రతిపాదిత అంశాలను ఫిబ్రవరి 4వ తేదీ సాయంత్రంలోగా పంపాలని వివిధ ప్రభుత్వ శాఖలకు ఆదేశాలు జారీజేశారు. దావోస్ పర్యటనకు వెళ్లిన చంద్రబాబు బృందం... అక్కడ వివిధ సంస్థల ప్రతినిధులతో సమావేశమైంది. ఈ సందర్భంగా రాష్ట్రంలో ఉన్న అవకాశాలను, పెట్టుబడులకు ఉన్న అనుకూల పరిస్థితుల్ని వివరిస్తూ పెట్టుబడులను ఆహ్వానిస్తున్నది. రాష్ట్రానికి పెట్టుబడులు పెట్టేందుకుగాను అనేక సంస్థలు ముందుకొచ్చాయి. వాటిపైనా మంత్రివర్గ సమావేశంలో చర్చించనున్నారు. వాట్సాప్ గవర్నెన్స్ విధి విధానాలపైనా మంత్రివర్గం కీలక నిర్ణయం తీసుకోనుంది. సూపర్ సిక్స్ హామీలలో భాగంగా మిగిలిన పథకాల అమలుపైనా చర్చించే అవకాశముంది.

ప్రకటనలు చూసి ఓటేయం

(మొదటిపేజీ తరువాయి)

తమకు ముఖ్యమని ఢిల్లీ ఓటర్ల మనస్సులోని మాట తమ సర్వే ద్వారా బయటకు వచ్చిందని నివేదిక పేర్కొంది. రాజకీయ ప్రకటనలతో ప్రభావితం కాబోమని 87 శాతం మంది చెప్పినట్లు సర్వే నివేదిక తెలిపింది. వాటిని చూసి ఓటు వేస్తామని ఐదు శాతం మంది మాత్రమే చెప్పారని పేర్కొంది. అదేసమయంలో కాలుష్యం ప్రధాన సమస్యగా చాలా తక్కువమంది చెప్పారని, విద్యుత్, నీటి సరఫరాకే అత్యధిక మంది ఓటర్లు ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పింది. ఢిల్లీలో మొత్తం 15,52,458 మంది ఓటర్లు ఉండగా... వారిలో 44.91 శాతం మంది 18-40 ఏళ్ల మధ్య వయస్సు వారున్నారు. ఈ సర్వేలో పాల్గొన్న వారిలో 90 శాతం మంది పురుషులు, 10 శాతం మంది మహిళలు ఉన్నారు. వీరిలో 41 శాతం మంది 31-45 మధ్య వయస్సుగల వారు కాగా 33 శాతం మంది 46-60 ఏళ్ల మధ్య వయస్కులు. 17 శాతం మంది 60 ఏళ్లు పైబడిన వారు కాగా... తొమ్మిది శాతం మంది 18-30 మధ్య వయస్సుగల వారు ఉన్నట్లు వెల్లడించింది. దీంతో అన్ని వర్గాలు, వయస్సుల వారి ఆలోచనను సర్వే తెలుసుకోగలిగింది.

ప్రకటనల్లో బీజేపీదే పైచేయి

ఎన్నికల వేళ రాజకీయ ప్రకటనల్లో బీజేపీదే పైచేయిగా ఢిల్లీ వాసులు చెప్పారు. బీజేపీ ప్రకటనలు ఎక్కువగా చూసినట్లు సర్వేలో పాల్గొన్న 41 శాతం మంది చెప్పారని నివేదిక తెలిపింది. కాంగ్రెస్ ప్రకటనలు చూశామని 35 శాతం మంది... ఆప్ ప్రకటనల గురించి 24 శాతం మంది చెప్పినట్లు వెల్లడించింది. అయితే ప్రకటనలు చూసి ఓటు వేసేది లేదని వారంతా స్పష్టం చేశారని పేర్కొంది. రాజకీయ ప్రకటనలపై తమకు నమ్మకం లేదని 52 శాతం మంది చెప్పగా, 27 శాతం మంది మాత్రమే వాటిని విశ్వసనీయమైనవిగా భావిస్తున్నట్లు సర్వేలో వెల్లడైంది. 22 శాతం మంది మాత్రం ప్రకటనలను పూర్తిస్థాయిలో తోసిపుచ్చారని నివేదిక పేర్కొంది.

ఏది ప్రాధాన్యం

కొత్తగా ఏర్పాటయ్యే ప్రభుత్వం విద్యుత్, నీటి సరఫరాపై ప్రధానంగా దృష్టి కేంద్రీకరించాలని 69 శాతం మంది చెప్పారని నివేదిక వెల్లడించింది. రోడ్లు, మౌలిక వసతుల గురించి 20 శాతం మంది, స్వచ్ఛవాయువు కావాలని, కాలుష్యం నివారణకు చర్యలపై దృష్టి అవసరమని ఐదు శాతం మంది చెప్పినట్లు పేర్కొంది.

ఇన్‌ఫ్లుయన్సర్ల ప్రభావమెంత?

రాజకీయ పార్టీల కోసం సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయన్సర్లు ఏ విధంగా ఓటర్లను ప్రభావితం చేయగలిగారన్నదీ ఆరా తీసింది. అయితే రాజకీయ పార్టీల కోసం ప్రచారం చేయరని 88 శాతం మంది చెప్పారని నివేదిక పేర్కొంది. ఢిల్లీ ఎన్నికల వేళ సామాజిక మాధ్యమంలో పోస్టర్లు, వీడియోలు హల్‌చల్ చేస్తున్నాయని తెలిపినట్లు వెల్లడించింది. పోస్టర్ల ప్రచారంపై 10 శాతం మంది, వీడియోలు చూసినట్లు రెండు శాతం మంది చెప్పారని తెలిపింది.

విరాళాలు...

2024 ఆర్థిక సంవత్సరంలో బీజేపీకే అత్యధికంగా విరాళాలు అందాయి. కార్పొరేట్ల నుంచి రూ.2,244 కోట్లను కాషాయ పార్టీ సేకరించింది. 2022-23లో రూ.742 కోట్లు సేకరించింది. అందుకు భిన్నంగా కాంగ్రెస్ పరిస్థితి ఉంది. అదేకాలంలో కాంగ్రెస్‌కు కేవలం రూ.288.9 కోట్లు వచ్చాయి. అంతకుముందు రూ.79.9 కోట్లు సేకరించింది. ఇదిలావుంటే... తమ సర్వే ద్వారా ఢిల్లీ ప్రజల ఆలోచనలో వచ్చిన మార్పు స్పష్టమైందని ఐక్యూబ్స్ వైర్ సీఈవో సాహిల్ చోప్రా తెలిపారు. మార్కెటింగ్ కంటే తమకు కనిపించే ఫలితాలకే ఓటర్లు ప్రాధాన్యత ఇస్తున్నారని వెల్లడైందని చెప్పారు. రాజకీయ ప్రకటనల ప్రభావం ఓటర్లపై లేదని తేలిందన్నారు. నమ్మకమైన, పారదర్శకమైన, మెరుగైన పరిపాలనను ఢిల్లీ ఓటర్లు కోరుకుంటున్నారని సర్వే తేల్చినట్లు సాహిల్ వెల్లడించారు.

కర్నూలులో ఏఐవైఎఫ్ జాతీయ మహాసభలు

(మొదటిపేజీ తరువాయి)

ఉద్యోగ అవకాశాలు కోల్పోతున్నారని విమర్శించారు. ప్రైవేట్ రంగంలోనూ రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగులకు 15 వేల రూపాయల నిరుద్యోగ భృతి ఇవ్వాలన్నారు. దేశంలోని ఖాళీ ఉద్యోగాలపై కేంద్ర ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలన్నారు. యూనివర్సిటీలలో వైస్‌చాన్సలర్ల నియామకాల బాధ్యతను గవర్నర్లకు అప్పగించడం దుర్మార్గమని మండిపడ్డారు. రాష్ట్రప్రభుత్వం భాగస్వామ్యంతోనే నియామకాలు ఉండాలన్నారు. డీఎస్సీపై ఆశలు రేకెత్తించిన చంద్రబాబు ప్రభుత్వం... ఇప్పుడు దాని ఊసే ఎత్తడం లేదన్నారు. అమరావతిని ఫ్రీజోన్‌చేసి అభివృద్ధి వికేంద్రీకరణ చేయాలని డిమాండ్ చేశారు. ఉత్తరాంధ్ర, రాయలసీమ తీవ్రంగా వెనుకబడిపోయాయని, పనులు లేక యువత వలస పోతున్నారన్నారు. ఫ్రీజోన్ చేయడంతో అందరికీ న్యాయం జరుగుతుందని తెలిపారు. కర్నూలు నగరంలో ఈ ఏడాది ఏప్రిల్ మొదటి వారంలో ఏఐవైఎఫ్ 17వ జాతీయ మహాసభలు నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. జాతీయ మహాసభల వేదికగా నిరుద్యోగులకు ఉద్యోగ కల్పన కోసం, రాజ్యాంగ పరిరక్షణ కోసం ఏఐవైఎఫ్ యువతను సమాయత్తం చేస్తుందని తెలిపారు. సమావేశంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారుమంచి నాగరాముడు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీరాములు, శ్రీనివాసులు, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సోమన్న, షాబీర్‌బాష, సహాయకార్యదర్శి శరత్‌కుమార్, ఏఐవైఎఫ్ నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాగరాజు, చంటి, నాయకులు శివ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పెట్టుబడుల ధమాకా

(మొదటిపేజీ తరువాయి)

పెట్టుబడులకు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. భవిష్యత్తులో అర్టిఫిషియల్ ఆధారిత క్లౌడ్ సేవల వృద్ధికి ఈ డేటా సెంటర్లు కీలకంగా మారనున్నాయి. తెలంగాణలో తన క్లౌడ్ మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడానికి 2030 నాటికి 4.4 బిలియన్ డాలర్ల పెట్టుబడులను అమెజాన్ వెబ్ సర్వీసెస్ ఇప్పటికే ప్రకటించింది. ఒక బిలియన్ పెట్టుబడులతో రాష్ట్రంలో మూడు సెంటర్లను గతంలోనే అభివృద్ధి చేసింది. కొత్తగా చేపట్టే విస్తరణ ప్రణాళికలకు అవసరమైన భూమిని కేటాయించాలని అమెజాన్ వెబ్ సర్వీసెస్ రాష్ట్ర ప్రభుత్వాన్ని అభ్యర్థించింది. ప్రభుత్వం అందుకు అంగీకరించింది. అమెజాన్ వంటి ప్రపంచ దిగ్గజ కంపెనీలు మన రాష్ట్రంలో గతంలో ఎన్నడూ లేని విధంగా భారీ పెట్టుబడులకు ముందుకు రావటం ఆనందంగా ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఈ ఒప్పందంతో హైదరాబాద్ దేశంలో డేటా సెంటర్ల కేంద్రంగా తిరుగులేని గుర్తింపు సాధిస్తుందని ఐటీ మంత్రి డి. శ్రీధర్ బాబు అన్నారు.

ఉర్సా క్లస్టర్ ఏఐ డేటా సెంటర్...

అమెరికాకు చెందిన ఉర్సా క్లస్టర్స్ రాష్ట్రంలో అత్యాధునిక అర్టిఫిషియల్ డేటా సెంటర్ హబ్‌ను స్థాపించనుంది. దావోస్ లో రాష్ట్ర ప్రభుత్వంతో ఈ సంస్థ అవగాహన ఒప్పందం చేసుకుంది. కంపెనీ సీవోవో సతీశ్ అబ్బూరి, సీఆర్వో ఎరిక్ వార్నర్ ఈ ఒప్పందంపై సంతకం చేశారు. హైదరాబాద్ లో 100 మెగావాట్లతో డేటా సెంటర్ ఏర్పాటు చేస్తామని కంపెనీ సీఈవో పెందుర్తి అన్నారు. హైబ్రిడ్ ఏఐ చిప్‌లను ఉపయోగిస్తామని చెప్పారు. ఈ ప్రాజెక్టుపై దాదాపు రూ.ఐదువేల కోట్లు పెట్టుబడులు పెడుతున్నట్లు ప్రకటించారు. ఉర్సాతో భాగస్వామ్యం ... అత్యాధునిక సాంకేతిక రంగంలో రాష్ట్రం మరో ముందడుగు వేస్తుందని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు.

డయాఫ్రం వాల్ నిర్మాణం వేగవంతం: మంత్రి నిమ్మల

(మొదటిపేజీ తరువాయి)

వాల్ స్థానంలో కొత్త నిర్మాణం కోసం వెయ్యి కోట్ల అదనపు భారాన్ని మోయాల్సి వస్తున్నట్లు చెప్పారు. ఏడేళ్ల కిందట పోలవరం నిర్వాసితులకు రూ.800 కోట్లుకుపైగా పరిహారం అందించిన చంద్రబాబు... ఇప్పుడు మరో రూ.వెయ్యి కోట్లు పరిహారమిచ్చారన్నారు. 2019 ఎన్నికల ముందు పోలవరం నిర్వాసితులకు అదనంగా రూ.10 లక్షల పరిహారమిస్తానన్న జగన్... అధికారంలోకి వచ్చాక ఆ మాటే మరిచారని మంత్రి నిమ్మల విమర్శించారు. వైసీపీ పాలనలో పునరావాస కాలనీల నిర్మాణానికి బస్తా సిమెంట్ గానీ, నిర్వాసితులకు రూపాయి పరిహారంగానీ అందలేదన్నారు. కూటమి అధికారంలోకి రాగానే కేంద్రాన్ని ఒప్పించి రూ.12,159 కోట్లు తెచ్చిందని, షెడ్యూల్‌లోగా పనులు పూర్తి చేసేందుకు కట్టుబడి ఉందని మంత్రి చెప్పారు. నిర్వాసితులకు న్యాయం జరిగేలా, ప్రాజెక్టుతో పాటే సమాంతరంగా పునరావాస కాలనీలు నిర్మిస్తామన్నారు.

శతాబ్ది బహిరంగ సభను జయప్రదం చేయండి

విశాలాంధ్ర - గార్ల : జనవరి 25న మానుకోట జిల్లా కేంద్రంలో నిర్వహించే సిపిఐ శతాబ ఉత్సవ బహిరంగ సభను జయప్రదం చేయాలనీ ఆ పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు కట్టేబోయిన శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మండల పరిధిలోని మద్దివంచ గ్రామంలో సిపిఐ గ్రామ శాఖా సమావేశం లావుడ్య భీముడు అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ భారత కమ్యూనిస్ట్ పార్టీ అంతరాలు లేని సమసమాజ లక్ష్యం కోసం ఏర్పడిందన్నారు. రష్యా విప్లవ స్ఫూర్తి తో1926 డిసెంబర్ 26న ఆవిర్భావించి భూమి కోసం భుక్తి కోసం వెట్టిచాకిరీ విముక్తి కోసం సాయుధ పోరాటానికి పిలుపునిచ్చిందని చారిత్రక ఘట్టాలు వివరించారు. వీరతెలంగాణ సాయుధ పోరాటం ప్రపంచ ప్రాముఖ్యత గల ఉద్యమం అని అన్నారు. ఈ సందర్భం గా సాయుధ పోరాట నేత మహబూబాబాద్ సిపిఐ మాజీ ఎమ్మెల్యే తీగల సత్యనారాయణ రావు విగ్రహ ఆవిష్కరణ ఉంటుందన్నారు. మండల సహాయ కార్యదర్శి రాగం రమేష్, శాఖా కార్యదర్శి ధూపాటి జనార్ధన్, కట్టేబోయిన భిక్షమయ్య, ఇల్టారి వెంకన్న, పిచ్చయ్య, భీమ్లా, రమేష్, కృష్ణయ్య, బిక్షం, వెంకన్న, పుల్లయ్య, దాదేమియ్య, సక్కు, రమేష్ పాల్గొన్నారు.

సమాజ శ్రేయస్సులో జర్నలిస్టుల పాత్ర అభినందనీయం

విశాలాంధ్ర బ్యూరో- కొమురం భీం : సమాజ శ్రేయస్సులో జర్నలిస్టుల పాత్ర అభినందనీయమని సిర్పూర్ నియోజకవర్గం కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్ల అన్నారు. గురువారం కాగజ్ నగర్ సబ్ డివిజన్ కార్యాలయంలో విశాలాంధ్ర పత్రిక క్యాలెండర్లు, డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల కోసం అనునిత్యం తపించే జర్నలిస్టులు ప్రజా శ్రేయస్సు కోసం చేస్తున్న సేవ అభినందనీయమని కొనియాడారు. ప్రజల సమస్యలను తమ సమస్యలుగా నిత్యం వార్త కథనాలతో ప్రజలకు వెన్నంటే ఉంటూ సమాజంలో జరిగే సమస్యలను తమ ఆయుధంతో వార్త కథనాలుగా అందరికీ చేరవేయడంలో జర్నలిస్టుల ముందుండడం గొప్ప విషయం అన్నారు. సమాజంలో ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొంటూ అవినీతిని నిర్మూలించేందుకు జర్నలిస్టులు బాధ్యతగా వ్యవహరించడం ద్వారా ప్రజా సమస్యలకు పరిష్కారం దొరుకుతుంది అన్నారు. అనంతరం కాగజ్ నగర్ తహసిల్దార్ కిరణ్ కుమార్ చేతుల మీదుగా విశాలాంధ్ర డైరీ క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కొమరం భీం. విశాలాంధ్ర బ్యూరో ఈర్ల సతీష్, రిపోర్టర్ విజయ్, పాత్రికేయ మిత్రులు పాల్గొన్నారు.

ప్రతి సబ్జెక్టును ప్రత్యేక శ్రద్ధతో బోధించాలి : కలెక్టర్

విశాలాంధ్ర జిల్లా బ్యూరో-మహబూబాబాద్ : ప్రతి సబ్జెక్టుపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధతో విద్యార్థులకు విద్య బోధించాలని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం డోర్నకల్ మండల కేంద్రం లో జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలను, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను తనిఖీ చేసి, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పిల్లలకు అందిస్తున్న విద్య బోధనల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి సబ్జెక్టుపై ప్రత్యేక శ్రద్ధ వహించి పిల్లలకు బోధించాలని సూచించారు. పదవ తరగతిలో అత్యుత్తమ ఫలితాలను సాధించాలని ఉపాధ్యాయనీ, ఉపాధ్యాయులకు సూచించారు. పిల్లలపై వ్యక్తిగత శ్రద్ధ వహించాలని, నూతన మెను ప్రకారం మధ్యాహ్న భోజనం రుచికరంగా అందించాలని సూచించారు. పాఠశాల ఆవరణలో మరుగుదొడ్లు, తరగతి గదులు, స్టడీ రూములు ఎప్పటికీ పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పాఠశాలలో ఏమైనా మైనర్ రిపేర్లు ఉంటే ప్రతిపాదనలు పంపాలన్నారు. ప్రతి రోజు వైద్య సేవల కోసం ఎంతమంది వస్తున్నారు, ఆసుపత్రికి సంబంధించిన వాహనాలు ఎన్ని ఉన్నాయిని, ఎలా పనిచేస్తున్నాయని, వాటి పరిస్థితి ఏంటి, ఆసుపత్రిలో తాగునీటి పరిస్థితి, ఎక్కడి నుండి వస్తుందనే వివరాలతో పాటు ప్రసూతి సేవల విభాగాలను పరిశీలించిన కలెక్టర్, వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆపరేషన్ థియేటర్, మందుల విభాగాలను కలెక్టర్ తనిఖీచేశారు. ఆసుపత్రిలో సాధారణ ప్రసవాలు అయ్యేట్టు చూడాలన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు, ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్‌లు ఉన్నారు.

కలప స్మగ్లర్లను పట్టుకున్న అటవీ అధికారులు

విశాలాంధ్ర బ్యూరో - నిర్మల్ జిల్లా : ఖానాపూర్ ఆటవి క్షేత్ర అధికారి కిరణ్ కుమార్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఉమ్మడి అదిలాబాద్ జిల్లాలోని పర్యావరణ పరిరక్షణ కొరకు కవ్వాల అభయారణ్యం టైగర్ జోన్ కోర్ ఏరియాగా ప్రభుత్వం మార్చిన తరువాత కలప స్మగ్లింగ్ తగ్గిందనుకుంటున్న తరుణంలో మరో కేసు వెలుగులోకి వచ్చింది. గత నెలలో ఖానాపూర్ రేంజ్ పరిధిలోని అడవిలో టేకు చెట్లను మిషిన్లతో కట్ చేసి స్మగ్లింగ్ చేసిన నిందితులను ఎట్టకేలకు, కొందరిని పట్టుకొని తప్పించుకు తిరుగుతున్న మరికొందరిని పట్టుకోవడానికి విచారణ చేపట్టినట్లు తెలిపారు. స్మగ్లర్లు టేకు కలపను రెండు వాహనాల్లో మంచిర్యాల జిల్లా ప్రాంతానికి తరలించినట్లు విచారణలో తేలిందని ఆయన తెలిపారు. 8 మంది నిందితుల్లో నాగేష్, శ్రీనివాస్, మధిర రాజగోపాల్ లను అదుపులో తీసుకుని విచారణ చేపట్టి కోర్టుకు తరలిస్తున్నట్లు తెలిపారు. మిగతా వారిని త్వరలోనే అదుపులోకి తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సెక్షన్ ఆఫీసర్ రవీందర్, బీట్ ఆఫీసర్లు నరేందర్, ముత్యం, మోహిద్, రాము పాల్గొన్నారు.

త్వరలోనే కొత్త పోలీస్‌స్టేషన్‌ల ప్రారంభం

విశాలాంధ్ర ప్రతినిధి- పెద్దపల్లి,సింగరేణి : రామగుండం కమీషనరేట్ పరిధిలోని పెద్దపల్లి జిల్లాలో త్వరలోనే కొత్త పోలీస్ స్టేషన్లు ప్రారంభం చేస్తామని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఆయన కొత్తగా పెద్దపల్లిలో ఏర్పాటు చేయనున్న మహిళ పోలీస్ స్టేషన్, రూరల్ పోలీస్ స్టేషన్, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, ఎలిగేడు పోలీస్ స్టేషన్ లకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించినట్లు చెప్పారు. పెద్దపల్లి మహిళ పోలీస్ స్టేషన్ కోసం పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్‌లో, పెద్దపల్లి రూరల్ పోలీస్ స్టేషన్ కోసం బంధంపల్లిలో ప్రాథమిక పాఠశాల భవనం ప్రతిపాదించడం జరిగింది, పెద్దపల్లి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ కోసం ఇప్పుడు పోలీస్‌స్టేషన్‌గా కొనసాగుతున్న భవనం, అదేవిధంగా ఎలిగేడు పోలీస్‌స్టేషన్ కోసం పాత ఎంఆర్‌వో కార్యాలయంలో ఏర్పాటు చేయడం జరుగుతుందని వాటి ఆధునీకరణ పనులు కొనసాగుతున్నాయని అన్నారు. ఆయన వెంట పెద్దపల్లి ఏసీపీ జి. కృష్ణ, ట్రాఫిక్ ఏసీపీ నరసింహులు, పెద్దపల్లి సీఐ ప్రవీణ్ కుమార్, సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ అనిల్ కుమార్, పెద్దపల్లి ఎస్ఐలు లక్ష్మణ్‌రావు, జూలపల్లి ఎస్ఐ సనత్ కుమార్, సుల్తానాబాద్ ఎస్ఐ శ్రావణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కొత్తగూడెం ఉర్దూఘర్ అభివృద్ధికి నిధులు మంజూరు

ఉర్దూ లైబ్రరీ ప్రారంభించిన ఎమ్మెల్యే ఎమ్మెల్యే కూనంనేని

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : కొత్తగూడెం లోని ఉర్దూ ఘర్ అభివృద్ధి కోసం రూ. 20 లక్షలు సిఎస్ ఆర్ నిధులు మంజూరైనట్లు ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. ఉర్దూ ఘర్ పై అంతస్తులో నిర్మించిన ఉర్దూ లైబ్రరీ హాల్ ను ఆయన గురువారం ప్రారంభించారు. అనంతరం ఇక్కడ జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ కొత్తగూడెంలో అభివృధి పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. త్వరలో ఉర్దూఘర్ పనులను ప్రారంభం చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాష, ఉర్దూ ఘర్ అధ్యక్షులు నయీమ్ ఖురేషి, మున్సిపల్ చైర్ పర్సన్ కాపు సీతమహాలక్ష్మి, మున్సిపల్ కమీషనర్ శేషంజనేయులు, 22వ వార్డ్ కౌన్సిలర్ జయంతి మాసూద్, మాజీ కౌన్సిలర్ మాసూద్, సెక్రటరీ మొహమ్మద్ షరీఫ్, జావీద్ సాతే, అభిద్ హుస్సేన్, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

పేదల సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యం : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - పినపాక : కొన్ని పక్షాలు కావాలని ప్రజలను పక్కదో పట్టిస్తూ గొడవలు సృష్టిస్తున్నారని అర్హులైన ప్రతి ఒక్కరికీ రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తుందని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు హామీ ఇచ్చారు. ఈ గ్రామ సభలో సంక్షేమ పథకాలకు ఎంపిక కాని వారు మళ్ళీ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ గ్రామ సభలతోనే ముగిసిపోదని ఇది నిరంతర పక్రియ అన్నారు. గురువారం పినపాక మండలంలోని జానంపేట, అమరారం, చెగర్షల, ఏల్చిరెడ్డి పల్లి, సీతారాంపురం, బోటిగూడెం గ్రామ పంచాయతీలలో ప్రజా గ్రామసభలలో పాల్గొన్నారు. జానంపేట గ్రామసభలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం తోనే సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. నిరంతరం అభ్యంతరాలు, దరఖాస్తులను స్వీకరిస్తామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లను అందిస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన అన్ని హామీలను అమలుచేస్తోందన్నారు. ప్రత్యర్థులు చేసే దుష్ప్రచారంతో ఎవరూ అపోహలకు గురికావద్దన్నారు. ఈ కార్యక్రమంలో తాహశిల్దార్ అద్దంకి నరేష్, ఏడిఏ తాతారావు, ఎంపీడీవో రామకృష్ణ, ఎంపీ ఓ వెంకటేశ్వరరావు, ఏ ఈ ఓ రమేష్, సీనియర్ అసిస్టెంట్ కె.రమేష్, ఆర్ ఐ లు రమేష్, బాలకృష్ణ, డిటి సమ్మయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు రామనాథం, నాయకులు పేరం వెంకటేశ్వర్లు, గంగిరెడ్డి వెంకటరెడ్డి, కొర్సా ఆనంద్, బాలకృష్ణ, చీకటి సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శులు కె శ్రీనివాస్ కుమార్, ఉమామహేశ్వరరావు, జైపాల్ రెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు వెడల్పు ప్రతిపాదనను ఉపసంహరించుకోండి

సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్

విశాలాంధ్ర - ఖమ్మం : ఒకరిద్దరి వ్యక్తిగత స్వార్థం కోసం చేసిన రోడ్డు వెడల్పు ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ డిమాండ్ చేశారు. రోడ్డు వెడల్పు పేరుతో పేదలకు అన్యాయం చేస్తే సహించేది లేదన్నారు. గురువారం ఖమ్మం త్రీటౌన్ పరిధిలోని పత్తి మార్కెట్ నుంచి ప్రకాష్నగర్ బ్రిడ్జి వైపు వెళ్లే రోడ్డును సిపిఐ నాయకులతో కలిసి దండి సురేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ రోడ్డును 80 అడుగుల మేర వెడల్పు చేస్తే పేదలకు చెందిన సుమారు 50 ఇండ్లు తొలగించాల్సి వస్తుందని దీనితో పేదలు భారీగా నష్టపోతారని ఆయన తెలిపారు. ప్రకాష్ నగర్ వరకు రోడ్డు విస్తరణకు సంబంధించి ప్రత్యామ్నాయ మార్గం ఉన్న ఒకరిద్దరు తమ భూముల విలువ పెంచుకోవడానికో లేదా ఇతరత్రా అవసరాల రీత్యా ఈ రోడ్డు వెడల్పు ప్రతిపాదిస్తున్నారని అధికార యంత్రాంగం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దీనిపై పునః పరిశీలన చేయాలని సురేష్ కోరారు. సిపిఐ నగర కార్యదర్శి ఎస్కే జానిమియా, కార్పొరేటర్ బిజి క్లెమెంట్, జిల్లా కార్యవర్గ సభ్యులు మహ్మద్ సలాం, పగడాల మల్లేష్, త్రీటౌన్ ఏరియా నాయకులు బి. సత్యనారాయణ, భూక్యా రవీందర్, నామ కుమార్, సురేష్, వి. లింగయ్య, వెంకన్న, వీరన్న, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభలో కాంగ్రెస్, ప్రతిపక్షాల మధ్య వాగ్వివాదం

అధికారులపై తిరగబడ్డ మహిళలు

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నాలుగు సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా ఉండాలని నిర్వహిస్తున్న ప్రజా గ్రామసభలు గందరగోళంగా మారాయి. అధికార యంత్రంగానికి పథకాల ఎంపిక ప్రక్రియ చాలా తలనొప్పిగా మారింది. ఈ నాలుగు పథకాలకు అర్హుల జాబితా అధికంగా ఉంటే మంజూరు అవుతున్న పథకాలు నాలుగవ వంతు కూడా లేకపోవడంతో గ్రామసభలు ఉద్రిక్తంగా మారుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా గ్రామ సభల్లో అర్హులైన లబ్ధిదారుల పేర్లు ప్రకటించిన జాబితాలో లేకపోవడంతో ఉధృత పరిస్థితులకు కారణం అవుతున్నాయి. తాజాగా గురువారం మండల కేంద్రం చంద్రుగొండలో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో తేడాలు రావడంతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. ముఖ్యంగా ఇందిరమ్మ ఇళ్ల పథకం, ఇందిరమ్మ భరోసా పథకాల్లో కాంగ్రెస్ నాయకులు తమకు అనుకూలమైన వారిని ఎంపిక చేశారని ఆరోపండ్లు వెల్లువేత్తయి. బి ఆర్ఎస్, బిజెపి, న్యూ డెమోక్రసీ, సిపిఎం, టిడిపి పార్టీల నాయకులు గ్రామ సభలో పాల్గొన్న అధికారులను నిలదీశారు. తమకు అర్హత ఉన్నందున పథకాలు వస్తాయని ఎన్నో ఆశలతో సభకు వచ్చిన మహిళలు తమ పేర్లు జాబితాలో లేకపోవడంతో తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు. ప్రతిపక్షాల అండతో కొందరు మహిళలు అధికారుల కూర్చున్న వేదికపైకి దూసుకొచ్చారు. కాంగ్రెస్ నాయకులను, అధికారులను తీవ్రంగా దూషించారు. ఇప్పటికే ఇల్లు ఉన్న కొందరికి, అగ్రకులాలకు చెందిన మరికొందరికి ఇందిరమ్మ ఇళ్ళు కేటాయించటంపై అభ్యంతరాలు వ్యక్తం అయ్యాయి. బి ఆర్ఎస్ నాయకులు, మాజీ జెడ్పిటిసి కొడకండ్ల వెంకటరెడ్డి సారధ్యంలో ప్రజలు గ్రామసభలు అనేక అభ్యంతరాలు వ్యక్తం చేశారు. ఎంపిక చేసిన జాబితాలో అనర్హులను తొలగించి అర్హులైన వారిని జాబితాలో చేర్చాలని డిమాండ్ చేస్తూ సభను చాలాసేపు స్తంభింపజేశారు. అధికారులపై మహిళలు కూడా తిరుగుబాటు చేయడంతో దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది. ఈ జాబితాలో పేర్లు లేని వారు మళ్లీ దరఖాస్తులు చేసుకోవాలని అధికారుల అభ్యర్థించారు. ఒక దశలో కాంగ్రెస్ నాయకులకు, ప్రతిపక్ష నాయకులకు మధ్య తీవ్రంగా విమర్శల యుద్ధం నడిచింది. పోలీసులు చాలా సంయమనం పాటించి ఇరు వర్గాలలో చాలా ఓపికగా సముదాయించారు. దీంతో ఘర్షణ వాతావరణం కొంత చల్లబడింది.

ఆందోళనల మధ్య కొనసాగిన గ్రామసభలు

విశాలాంధ్ర - కారేపల్లి : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పలు సంక్షేమ పథకాల ఎంపిక ప్రక్రియ కొరకు మండల పరిధిలోని విశ్వనాథపల్లి గ్రామపంచాయతీలో ఏర్పాటుచేసిన గ్రామసభలో పేదరికంతో ఉన్న తమకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయరా అంటూ పలువురు అర్హులు అధికారులను నిలవదీశారు. గురువారం మండలం లోని 41 గ్రామపంచాయతీలకు గాను12 గ్రామ పంచాయతీలలో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు,రైతు భరోసా, రేషన్ కార్డుల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ కొరకు అధికారులు గ్రామ సభలు నిర్వహించారు. గ్రామ సభలు నిర్వహించిన విశ్వనాథపల్లి, మాదారం, ఉసిరికాయలపల్లి, సింగరేణి చీమలపాడు, పేరుపల్లి భాగ్యనగర్ తండా, పాటిమీది గుంపు గ్రామసభలలో అధికారుల సాక్షిగా గొడవలు జరిగి ఉద్రిక్తతల మధ్య నడిచాయి. అధికారులు స్టేజీపై చదివి వినిపించిన లిస్టులలో అనర్హులకు అవకాశం కల్పించి అర్హులను ఎంపిక చేయటంలో అధికారులు విఫలమయ్యారని నిరసనలు వ్యక్తం చేసి అధికారులపై ప్రశ్నల వర్షం కురిపించారు. అధికారులు మళ్లీ కొత్తగా దరఖాస్తులు చేసుకోవాలని సూచించిన వెంటనే కొంతమంది నూతనంగా దరఖాస్తులు అందజేశారు. సంబంధిత గ్రామసభలలో అధికారులు ప్రజలకు నచ్చజెప్పే ప్రయత్నం చేసినప్పటికీ ప్రజల నిరసన మధ్య సమావేశాలను ముగించారు. గ్రామసభలలో మండల ప్రత్యేక అధికారి జి గంగాధర్ ఎంపీడీవో జి సురేందర్ తహసిల్దార్ సంపత్ కుమార్ ఏవో బట్టు అశోక్ కుమార్ ఎంఈఓ జయరాజు ఎంపీ ఓ రవీంద్ర ప్రసాద్, ఎస్ఐ రాజారాం, విశ్వనాథపల్లి ప్రత్యేక అధికారి ఎం రాజీవ్ గాంధీ,కార్యదర్శి మద్దుల వెంకటేష్ తోపాటు పలువురు అధికారులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా సుభాష్ చంద్రబోస్ జయంతి

విశాలాంధ్ర - నేరేడుచర్ల : నేరేడుచర్ల బిజెపి కార్యాలయంలో గురువారం ఘనంగా నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర నాయకురాలు, హుజూర్నగర్ నియోజకవర్గ ఇన్చార్జ్ చల్ల శ్రీలతరెడ్డి మాట్లాడుతూ సుభాష్ చంద్రబోస్ ఆశయాలను ఆలోచనలను సాధించే దిశలో యువత ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలని తెలియజేశారు. విద్యార్థిని విద్యార్థులు నేతాజీని ఆదర్శంగా తీసుకోవాలని అందరూ దేశ ఐక్యతకు పాటుపడాలని భారతదేశ స్వాతంత్ర్యం సాధించడంలో సుభాష్ చంద్రబోస్ త్యాగాన్ని ధైర్యాన్ని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు కొణతం నాగిరెడ్డి, గొడ్డేటి పవన్ కుమార్, స్టేట్ కౌన్సిల్ మెంబర్ బాల వెంకటేశ్వర్లు జిల్లా కౌన్సిల్ మెంబర్స్ సంకలమద్ది సత్యనారాయణరెడ్డి, పార్తసబోయిన విజయ్ కుమార్ పట్టణ ఉపాధ్యక్షులు ఉరిమళ్ళ రామమూర్తి, జూలూరి అశోక్, మండల ప్రధాన కార్యదర్శి పగిడి శ్రీనివాస్, పట్టణ కిసాన్ మోర్చా అధ్యక్షులు తాళ్ల నరేందర్ రెడ్డి, మండల, పట్టణ బూత్ అధ్యక్షులు పుల్లెంల సతీష్ గౌడ్, ఏమిరెడ్డి శంకర్ రెడ్డి, కాలం నాగయ్య, ఎడవల్లి సైదిరెడ్డి, కాల్వ సైదులు, కిరణ్ కుమార్, కార్యకర్తలు కటికోల వినయ్ గౌడ్, దేవిరెడ్డి నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల భద్రతకు ప్రాముఖ్యం : డిజీపీ

విశాలాంధ్ర - మెదక్: ప్రజల భద్రతకు ప్రాముఖ్యతని స్తామని డీజీపీ డా. జితేందర్ అన్నారు. దేశంలోనే తెలంగాణ పోలీస్ ఉత్తమ సేవలు అంది స్తున్నట్లు పేర్కొన్నారు. సిబ్బంది సంక్షేమానికి నేనున్నానని అభయమిచ్చారు. మెదక్ జిల్లా పోలీస్ కార్యాలయం ప్రాంగణంలో సెల్యూట్ బేస్, పరేడ్ గ్రౌండ్, గ్యాలరీని డీజీపీ డా.జితేందర్ గురువారం ఎంపీ రఘునందన్ రావు, ఎమ్మెల్యే రోహిత్ లతో కలిసి ప్రారంభించారు. డిజిపి మాట్లాడుతూ సిబ్బంది సరెండర్ లీవుల బిల్లుల కోసం 200 కోట్ల రూపాయలు, ఆరోగ్య భద్రతకోసం 75 కోట్లు విడుదలైనట్లు తెలిపారు. మీకోసం నేనున్నానని పోలీసులకు భరోసా కల్పించారు. ప్రజల శాంతిభద్రత పరిరక్షణ విషయంలో పోలీసులు ఎల్లవేళలా కృషి చేస్తున్నారని వివరించారు. నక్సలిజం, నార్కోటిక్ డ్రగ్స్ మీద ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం అని చెప్పారు. తెలంగాణ పోలీసు వ్యవస్థ పటిష్టంగా ఉంది. పోలీస్ సేవలు ప్రజలు పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలన్నారు. రాష్ట్రంలో వంద డయల్ సేవలందించేందుకు 2 వేల వాహనాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. సైబర్ క్రైమ్ జరిగితే వెంటనే 1930కు ఫిర్యాదు చేయాలన్నారు. ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ 24 గంటలు విధులు నిర్వహించే పోలీసుల సమస్యలు పరిష్కరించాలని డీజీపీకి విజ్ఞప్తి చేశారు. కలెక్టర్ రాహుల్ రాజ్, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్ రెడ్డి, ఐజీలు చంద్రశేఖర్ రెడ్డి, రమేష్, ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి, డీఎస్పీలు ప్రసన్నకుమార్, సుభాష్ చంద్ర బోస్, రంగా నాయక్, వెంకట్ రెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ తొడుపునూరి చంద్రపాల్, కౌన్సిలర్ కిషోర్, బీజేపీ జిల్లా అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్, నియోజకవర్గం ఇంచార్జి పంజా విజయ్ కుమార్, బొజ్జ పవన్, ఆంజనేయులు గౌడ్, మేడి మధుసూదన్ రావు తదితరులు పాల్గొన్నారు.

జీ.నారాయణమ్మ ఇన్‌స్టిట్యూట్‌లో 'నెక్సోరా 2025'

హైదరాబాద్: జీ.నారాయణమ్మ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (జీఎన్ఐటీఎస్) ప్రతిష్ఠాత్మక జాతీయ స్థాయి సాంకేతిక ఉత్సవం 'నెక్సోరా 2025' నిర్వహించింది. ఐఎస్టీఈ, సీఎస్ఐ, ఐఈఈఈ, ఐఎండ్ఐ, ఏసీఎమ్, ఐఈ, ఐఈటీఈ, ఆర్ అండ్ డీ వంటి విద్యార్థులు ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవం తొలి రోజు విశిష్టమైన ఆవిష్కరణలు, సాంకేతిక ప్రతిభతో ఆకట్టుకుంది.

పెట్టుబడుల గమ్యస్థానంగా అస్సాం

హైదరాబాద్: అస్సాంను పెట్టుబడుల గమ్యస్థానంగా రూపొందించడం తమ లక్ష్యమని అస్సాం పాఠశాల విద్య, ఉన్నత విద్య, గిరిజన వ్యవహారాల మంత్రి (ప్లెయిన్) డాక్టర్ రనోజ్ పెగు తెలిపారు. పెట్టుబడిదారులకు సింగిల్ విండో క్లియరెన్స్ సిస్టమ్‌తో రెడీగా ఉన్నామన్నారు. అస్సాంలోని గౌహతిలో ఫిబ్రవరి 25, 26వ తేదీలలో 'అడ్వాంటేజ్ అస్సాం 2.0' పేరుతో నిర్వహించనున్న పెట్టుబడులు, మౌలిక సదుపాయాల సదస్సుకు పెట్టుబడిదారులను సమాయత్తం చేయడమే లక్ష్యంగా హైదరాబాద్‌లో రోడ్డు షో నిర్వహించారు.

కే300ఎస్ఎఫ్‌ని ఆవిష్కరించిన కీవే ఇండియా

హైదరాబాద్: ఆదీశ్వర్ ఆటో రైడ్ ఇండియా (ఏఏఆర్ఐ) ఆధ్వర్యంలో విజయవంతంగా నడుస్తున్న సంస్థ కీవే ఇండియా. కీవే ఇండియా ఇప్పుడు కే300 ఎస్ఎఫ్ (స్ట్రీట్ ఫైటర్) అనే సుప్రసిద్ధ కే300 మోటార్సైకిల్ సిరీస్ ప్రత్యేక ఎడిషన్‌ను లాంచ్ చేస్తున్నట్లు ప్రకటించింది. స్పెషల్ ఆఫర్లో భాగంగా, మొదటి 100 మంది వినియోగదారులకు కేవలం రూ.1.69 లక్షల (ఎక్స్-షోరూమ్) ప్రత్యేక ధరకే అందించనుంది. కే300 ఎస్ఎఫ్ అనేది కే300ఎన్ అప్‌గ్రేడ్ వెర్షన్. అన్నింటికి మించి పరిమితకాల ఆఫర్‌తో అందిస్తున్న ఈ బైక్‌ని అందుకున్నవారు తమ డబ్బుకు తగిన విలువను కలిగి ఉంటారు. ఇంకా చెప్పాలంటే ఈ బైక్‌ను చాలా తక్కువ ధరకే మొదటి 100 మంది వినియోగదారులు పొందబోతున్నారు. ఎప్పటికప్పుడు అభివృద్ధి చెందుతున్న 300సీసీ విభాగంలో, కే300 ఎస్ఎఫ్ ప్రత్యేకమైన ధరలను కలిగి ఉంది. మొదటి 100 మంది కస్టమర్లకు ప్రీమియం 300సీసీ విభాగంలోకి అడుగుపెట్టడానికి ఒక ప్రత్యేక అవకాశాన్ని అందిస్తుంది. తద్వారా ఇది భారతీయ మార్కెట్లో మిగిలిన వాటి నుండి ప్రత్యేకంగా నిలుస్తుందని కీవే ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ వికాస్ జబఖ్ తెలిపారు.

గెలాక్సీ ఎస్25 సిరీస్‌ను విడుదల చేసిన సామ్‌సంగ్

బెంగళూరు: సామ్‌సంగ్ తమ తాజా గెలాక్సీ ఎస్ 25 అల్ట్రా, గెలాక్సీ ఎస్ 25+, గెలాక్సీ ఎస్25 స్మార్ట్‌ఫోన్‌లను విడుదల చేసినట్లు వెల్లడించింది. ఇవి సామ్‌సంగ్ ఇప్పటివరకు సృష్టించిన అత్యంత సహజమైన, సందర్భోచిత మొబైల్ అనుభవాలతో నిజమైన ఏఐ సహచరుడిగా నూతన ప్రమాణాన్ని నెలకొల్పాయి. సామ్‌సంగ్ ఎలక్ట్రానిక్స్ మొబైల్ ఎక్స్పీరియన్స్ బిజినెస్ ప్రెసిడెంట్, హెడ్ టిఎం రోహ్ మాట్లాడుతూ, గెలాక్సీ ఎస్ 25 సిరీస్ ఏఐ-ఇంటిగ్రేటెడ్ ఓఎస్‌కి తలుపులు తెరుస్తుందని తెలిపారు. వన్ యుఐ 7తో వచ్చే మొదటి స్మార్ట్‌ఫోన్ గెలాక్సీ ఎస్25 సిరీస్. ఇది సామ్‌సంగ్ ఏఐ-ఫస్ట్ ప్లాట్‌ఫామ్, ఇది ఏఐ - ఆధారిత వ్యక్తిగతీకరించిన మొబైల్ అనుభవాలను సాధ్యం చేస్తూ అత్యంత సహజమైన నియంత్రణలను అందించడానికి రూపొందింది. మల్టీమోడల్ సామర్థ్యాలతో కూడిన ఏఐ ఏజెంట్లు గెలాక్సీ ఎస్ 25 సహజంగా అనిపించే పరస్పర చర్యల కోసం టెక్స్ట్, ప్రసంగం, చిత్రాలు, వీడియోలను అర్థం చేసుకోవడానికి వీలు కల్పిస్తాయి.

జిందాల్ గ్లోబల్ లా స్కూల్‌లో ఏఐ-లా బీఏ ప్రోగ్రామ్

న్యూఢిల్లీ: ఇంటర్ డిసిప్లినరీ విద్యలో ప్రముఖ సంస్థ అయిన జిందాల్ గ్లోబల్ లా స్కూల్ (జేజీఎల్ఎస్), ఓపీ. జిందాల్ గ్లోబల్ యూనివర్సిటీ (జేజీయూ), భారతదేశంలో మొట్టమొదటి సారిగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), లాలో బ్యాచిలర్ ఆఫ్ ఆర్ట్స్ (బి.ఎ.) ప్రోగ్రామ్‌ను ప్రారంభించడం ద్వారా చరిత్ర సృష్టించింది. ఏఐ మరియు లాలో బి.ఎ. ప్రోగ్రామ్ అనేది సాంకేతికత, న్యాయ వృత్తి మధ్య అంతరాన్ని తగ్గించడానికి రూపొందించిన ఒక మార్గదర్శక కార్యక్రమం. ఈ కోర్సు విద్యార్థులకు ప్రధాన చట్టపరమైన సూత్రాలతో పాటు ఏఐ టెక్నాలజీల గురించి లోతైన అవగాహనను అందిస్తుంది. కొత్త ప్రోగ్రామ్ ప్రారంభం, విద్యా ఆవిష్కరణ, సామాజిక ప్రభావం పట్ల జేజీయూ నిబద్ధతను పునరుద్ఘాటిస్తుంది. ఈ ప్రత్యేకమైన బి.ఎ. ప్రోగ్రామ్‌ను ప్రవేశపెట్టడం ద్వారా, ఏఐ విప్లవం అందించే సవాళ్లు, అవకాశాలను పరిష్కరించడానికి న్యాయ నిపుణులను సిద్ధం చేయడంలో విశ్వవిద్యాలయం తనను తాను మార్గదర్శకుడిగా నిలబెట్టుకుంది.

25న సీగ్రమ్స్ రాయల్ స్టాగ్ బూమ్ బాక్స్ మ్యూజికల్ ఉత్సవం

హైదరాబాద్: 'లివింగ్ ఇట్ లార్జ్' స్ఫూర్తికి చిహ్నంగా హైదరాబాద్, బోల్డర్ హిల్స్‌లో జనవరి 25న మ్యూజిక్, యువ సంస్కృతి వైభవోపేతమైన సంబరం జరగబోతున్నది. రాయల్ స్టాగ్ బూమ్ బాక్స్-జనరేషన్ లార్జ్ ఒరిజినల్ సౌండ్-హైదరాబాద్, తెలంగాణాలకు చురుకైన హిప్-హాప్‌తో బాలీవుడ్ శ్రావ్యమైన గీతాల మిశ్రమాన్ని సంచలనాత్మకమైన సంగీత అనుభవాన్ని తెచ్చింది. ఈ రకమైన పండగ మ్యూజిక్, గేమింగ్, కళ, పార్-సంస్కృతి అనుభవాలను తెచ్చింది. నిఖిత గాంధీ, రఫ్తార్, డిజే యోగీతో పాటు అమిత్ త్రివేదిల పతాక శీర్షికల పెర్ఫార్మెన్స్‌లతో రాయల్ స్టాగ్ బూమ్ బాక్స్ మేజిక్‌ను చూడటానికి రావాలని కోరుతోంది. ఈ కార్యక్రమం హైదరాబాద్ బోల్డర్ హిల్స్‌లో జనవరి 25న మధ్యాహ్నం 3 గంటల నుండి జరుగుతుంది. పేటీఎం ఇన్ సైడర్‌పై టిక్కెట్లు లభిస్తాయి.

ఎల్‌జీ 'నేషన్ కాల్స్ ఫర్ సెలబ్రేషన్' ప్రచారంలో ఆఫర్ల వెల్లువ

న్యూఢిల్లీ: ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా గణతంత్ర దినోత్సవ స్ఫూర్తిని జరుపుకునేందుకు ప్రత్యేక ప్రచారం. 'ద నేషన్ కాల్స్ ఫర్ సెలబ్రేషన్'ను ప్రారంభించింది. ఈ ప్రత్యేక ప్రమోషన్ ఈ గణతంత్ర దినోత్సవాన్ని వినియోగదారులకు మరింత గుర్తుండిపోయేలా చేయడంలో లక్ష్యంగా ఆకర్షణీయమైన ఆఫర్లు, ప్రయోజనాలను అందిస్తోంది. ఎల్‌జీ ఉత్పత్తుల శ్రేణిలో వినియోగదారులు గృహ అవసరాలకు అనుగుణంగా రూపొందించిన ప్రత్యేక డీల్స్‌ను పొందవచ్చు. రూ.26 మాత్రమే చెల్లించి మిగతా మొత్తాన్ని సులభమైన ఈఎంఐలలో చెల్లించడం, కొన్ని మోడళ్లపై 32.5% వరకు క్యాష్‌బ్యాక్ (రూ.50,000 వరకు పొదుపు), రూ.888 నుండి ప్రారంభమయ్యే ఫిక్స్‌డ్ ఈఎంఐ ఆప్షన్లు ఉన్నాయి. ఇవిగాక, ప్రత్యేక ఉచిత బహుమతులు, ప్రయోజనాలు కూడా ఉన్నాయి.

ఎల్ఐసి మ్యూచువల్ ఫండ్ మల్టీ అసెట్ అలోకేషన్ ఫండ్ ప్రారంభం

ముంబై: భారతదేశంలోని ప్రసిద్ధ ఫండ్ హౌస్‌లలో ఒకటైన ఎల్ఐసి మ్యూచువల్ ఫండ్, ఈక్విటీ, డెట్, బంగారంలో పెట్టుబడి పెట్టే ఓపెన్-ఎండ్ స్కీమ్ అయిన ఎల్ఐసి ఎంఎఫ్ మల్టీ అసెట్ అలోకేషన్ ఫండ్‌ను ప్రారంభించింది. కొత్త ఫండ్ ఆఫర్ జనవరి 24, 2025న ప్రారంభమై ఫిబ్రవరి 07, 2025న ముగుస్తుంది. ఈక్విటీ మరియు ఈక్విటీ సంబంధిత ఇన్‌స్ట్రుమెంట్‌లు, డెట్, మనీ మార్కెట్ ఇన్‌స్ట్రుమెంట్‌లు, గోల్డ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్‌ల యూనిట్ల వైవిధ్యభరితమైన పోర్ట్‌ఫోలియోలో పెట్టుబడి పెట్టడం ద్వారా దీర్ఘకాలిక మూలధన పెరుగుదలను సృష్టించడం ఈ పథకం పెట్టుబడి లక్ష్యం. ఈ పథకం బెంచ్‌మార్క్ 65% నిఫ్టీ 500 టీఆర్ఐ+ 25% నిఫ్టీ కాంపోజిట్ డెట్ ఇండెక్స్ + 10% దేశీయ బంగారం ధర కలయికగా ఉంటుంది.

సమీరారెడ్డి, మీరా రాజ్‌పుత్‌తో కిండర్ క్రీమీ కొత్త క్యాంపైన్

హైదరాబాద్: పిల్లల స్నాక్స్ బ్రాండ్‌గా గుర్తింపు పొందిన కిండర్ క్రీమీ, కిండర్ నుండి మినీ స్నాక్, తమ తాజా బ్రాండ్ ఫిల్మ్ కోసం నటీమణి సమీరా రెడ్డి, ఇన్ ఫ్లుయెన్సర్ మీరా రాజ్‌పుత్ కపూర్‌తో చేతులు కలిపింది. ఆధునిక, గర్వించే అమ్మదనం ఆలోచనాత్మకమైన ఎంపికలతో ఉల్లాసకరమైన క్షణాల సారాంశాన్ని కాంపైన్ అందంగా కాప్చర్ చేసింది. సమీరా, మీరాల తమ అమ్మదనం శైలులు, ఆత్మవిశ్వాసం, సానుకూలత, ఆధునికతతో సంప్రదాయాన్ని మిశ్రమం చేస్తూ తాజా ఫిల్మ్‌లో కేంద్రంగా నిలిచారు. స్నాక్ టైమ్ వినోదం, సంరక్షణ రెండిటిని ఏ విధంగా కలిగి ఉండవచ్చో చూపించినట్లు కిండర్, ఫెరేరో ఇండియా రీజనల్ మార్కెటింగ్ హెడ్ అమిడియో అరగోనా తెలిపారు.

ఆత్మగౌరవంతోనే నిజమైన గౌరవం

హైదరాబాద్ : నిజమైన గౌరవం ఆత్మగౌరవంతోనే మొదలవుతుందని హెరిటేజ్ గ్రూప్ ఆఫ్ కంపెనీల వ్యవస్థాపకుడు కేఆర్ గంగాధరన్ తెలిపారు. కేంద్ర సామాజిక న్యాయ, సాధికారత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో హెరిటేజ్ ఫౌండేషన్ ప్రాంతీయ వనరుల శిక్షణా కేంద్రం (హైదరాబాద్)తో కలిసి 'అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం' వేడుకలను సికింద్రాబాద్‌లోని ప్రసిద్ధ హరి హర కళా భవన్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సంవత్సరం థీమ్ గౌరవం చుట్టూ కేంద్రీకృతమై ఉందన్నారు.

వన్ నేషన్ వన్ సబ్‌స్క్రిప్షన్ కార్యక్రమంలో కేంబ్రిడ్జ్ భాగస్వామ్యం

న్యూఢిల్లీ: భారత ప్రభుత్వం సంచలనాత్మక వన్ నేషన్ వన్ సబ్‌స్క్రిప్షన్ (ఓఎన్ఓఎస్) కార్యక్రమంలో కీలక ప్రచురణకర్తలలో కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ ప్రెస్ ఒకటి. ఇది దేశవ్యాప్తంగా విద్య, పరిశోధన నైపుణ్యాలను పెంపొందించే లక్ష్యంతో ఒక మార్పు తీసుకువచ్చే ప్రయత్నంగా పని చేస్తోంది. తన అసంఖ్యాకమైన జర్నళ్లను కేంబ్రిడ్జ్ అందుబాటును విస్తరిస్తోంది. భారతదేశ విద్యా సముదాయం అధిక-నాణ్యత కలిగిన పరిశోధన, నిపుణులు సమీక్షించిన కథనాలను వినియోగించుకునేందుకు అవకాశం కల్పిస్తుంది. ఇదొక మైలురాయి. ఇందులో పాల్గొంటున్న 30 ప్రపంచ ప్రచురణకర్తలలో ఒకటిగా, కేంబ్రిడ్జ్ సైన్స్, టెక్నాలజీ అండ్ మెడిసిన్, హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్‌లోని 430 జర్నళ్లను వినియోగించుకునేందుకు అవకాశం కల్పిస్తుంది.

సంపాదకీయం

ఉమర్ ఖాలిద్ కేసులో సూటి ప్రశ్నలు

ఈశాన్య దిల్లీలో 2020లో జరిగిన మతకలహాలతో సంబంధం ఉందన్న ఆరోపణపై ఉమర్ ఖాలిద్‌ను 2020 సెప్టెంబర్ 14న అరెస్టు చేశారు. ఆయనను ఇంకా ఎంత కాలం జైలులో ఉంచుతారు అని దిల్లీ హైకోర్టు ప్రశ్నించింది. దీనికి ప్రభుత్వం ఏం సమాధానం ఇస్తుందో తెలియదు. ఉమర్ ఖాలిద్ బెయిలు కోసం పెట్టుకున్న పిటిషన్ సుప్రీంకోర్టు దాకా వెళ్లింది. 2022 మార్చిలో మొట్ట మొదటిసారి దిల్లీలోని కర్కర్డూమ కోర్టు ఆయనకు బెయిలు నిరాకరించింది. అప్పటికే ఆయన ఏడాదిన్నర జైలు శిక్ష అనుభవించారు. తరవాత దిల్లీ హైకోర్టుకు వెళ్తే ఆ కోర్టు కూడా 2022 అక్టోబర్‌లో బెయిలు నిరాకరించింది. అప్పుడు ఖాలిద్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. పదకొండు నెలల కాలంలో 14 సార్లు ఈ కేసు సుప్రీంకోర్టులో వాయిదా పడింది. కొన్ని సార్లు ఏదో ఒక పక్షం న్యాయవాదులు అందుబాటులో లేనందువల్ల వాయిదా పడితే మరికొన్ని సార్లు ప్రాసిక్యూషన్ అభ్యర్థనవల్ల వాయిదా వేయాల్సి వచ్చింది. కొన్ని సార్లు ఫలానా న్యాయమూర్తులు విచారణ జరపడం కుదరదని వాయిదా వేశారు. కొన్ని సార్లు సమయం చాలదన్న నెపంతో వాయిదా వేశారు. మరి కొన్ని సార్లు సీనియర్ లాయర్లు అందుబాటులేరన్న సాకు చూపారు. 2024 ఫిబ్రవరిలో ఉమర్ ఖాలిద్ సుప్రీంకోర్టులో తన పిటిషన్ ఉపసంహరించుకున్నారు. మారిన పరిస్థితుల కారణంగా వాయిదా వేశామన్నారు. ప్రస్తుతం ఉమర్ ఖాలిద్ కేసు దిల్లీ హైకోర్టు న్యాయమూర్తులు సురేష్ కుమార్, గిరిష్ కథపాలియా ఎదుట విచారణలో ఉంది. విధిలేక ఉమర్ ఖాలిద్ సుప్రీంకోర్టులో కేసు ఉపసం హరించుకుని మళ్లీ కింది కోర్టుకు వెళ్లక తప్పలేదు. ఇప్పటిదాకా ఈ కేసులో దర్యాప్తే పూర్తి కాలేదు కనక చార్జ్ షీట్ ప్రస్తావనే లేదు. ఉమర్ ఖాలిద్ పై చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం (యు.ఎ.పి.ఎ.) కింద కేసు మోపారు. ఈ చట్టం కింద ఎవరినైనా పోలీసులు అరెస్టు చేస్తే వారి మీద విచారణ జరిపి శిక్షించడం ప్రభుత్వ ఉద్దేశం కాదు. విచారణ ఊసే లేకుండా తమకు కిట్టని వారిపై యు.ఎ.పి.ఎ., దేశ ద్రోహ చట్టం లాంటివి మోపి నిరవధికంగా జైలులో ఉంచి నిర్బంధమే శిక్షగా మార్చడం ప్రభుత్వ ఉద్దేశం. ఈ కేసులో విచారణ ఎప్పుడు ప్రారంభం అవుతుందో చెప్పే స్థితిలో ప్రాసిక్యూషన్ లేదు. ఉమర్ ఖాలిద్‌తో పాటు షర్జిల్ ఇమాం లాంటివారు జైళ్లలో మగ్గుతున్నారు. ఈశాన్య దిల్లీ అల్లర్ల కేసులో పోలీసులు దాదాపు 2500 మందిని అరెస్టు చేశారు. ఇందులో 2000 మందికి బెయిలు మంజూరు అయింది. అరెస్టు చేసిన వారిలో ఎక్కువ మంది ముస్లింలే. బెయిలు హక్కు జైలు అరుదు అని సుప్రీంకోర్టు పదే పదే చెప్తూ ఉంటుంది. కానీ ఉమర్ ఖాలిద్‌కు మాత్రం బెయిలు ఇవ్వరు. అలాగే భీమా కోరేగావ్ కేసులో అరెస్టు అయిన వారిలో కొందరికే వివిధ కారణాలవల్ల బెయిలు మంజూరైంది. మిగతా వారు ఇంకా ఊచలు లెక్కపెడ్తూనే ఉన్నారు. గత ఆగస్టు 13న కూడా న్యాయమూర్తులు అభయ్ ఎస్.ఓకా, అగస్టిన్ జార్జ్ మసీహ్‌తో కూడిన బెంచి కూడా బెయిలు హక్కు అన్న మాటను పునరుద్ఘాటించింది. యు.ఎ.పి.ఎ. కేసుల్లో బెయిలు మంజూరు కావడం అసాధ్యం అనుకుంటారు. గతంలో కొంతమంది సుప్రీంకోర్టు న్యాయమూర్తులే కాక అనేక మంది యు.ఎ.పి.ఎ. కేసుల్లో కూడా బెయిలు సాధ్యమే అని చెప్తూనే ఉన్నారు. మరి ఉమర్ ఖాలిద్ కు బెయిలు ఎందుకు సాధ్యం కాదో మాత్రం ఏ న్యాయమూర్తి చెప్పారు. ఈ నేపథ్యంలో చూస్తే దిల్లీ హైకోర్టు ఖాలిద్‌ను ఇంకా ఎంత కాలం జైలులో ఉంచుతారు అని ప్రశ్నించడం సాహసమే అనుకోవాలి. బెయిలు నిరాకరించడం ప్రాథమిక ఉల్లంఘనే అని కూడా న్యాయమూర్తులు భాష్యం చెప్తుంటారు.

ఉమర్ ఖాలిద్‌కు బెయిలు కేసుపై గత వారం రోజుల నుంచి దిల్లీ హైకోర్టులో విచారణ సాగుతోంది. స్పెషల్ ప్రాసిక్యూటర్ అమిత్ ప్రసాద్, అటార్నీ జనరల్ చేతన్ శర్మ ఖాలిద్‌కు బెయిలు మంజూరు చేయడాన్ని గట్టిగా వ్యతిరేకించారు. ఖాలిద్‌ను అరెస్టు చేయడం బాగా ఆలోచించి, గట్టి సమన్వయంతో అరెస్టు చేశామని వీరు చెప్పారు. దిల్లీ కలహాల్లో ప్రభుత్వ ఆస్తులు, ప్రైవేటు ఆస్తులు కూడా ధ్వంసం అయినాయని వీరు వాదించారు. పోలీసుల మీద దాడి కూడా చేశారని అన్నారు. దిల్లీ పోలీసుల వ్యవహార సరళితో అసంతృప్తి చెందిన దిల్లీ హైకోర్టు ఈ కేసులో ఏ నిందితుడి పాత్ర ఏమిటో తెలియజేయాలని కోరారు. దౌర్జన్యం, హింసాకాండను ప్రోత్సహించిందెవరో చెప్పాలని కూడా న్యాయమూర్తులు అడిగారు. వాస్తవం ఏమిటంటే ఈశాన్య దిల్లీలో మతకలహాలు జరిగినప్పుడు ఉమర్ ఖాలిద్ ఆ ప్రాంతంలో లేను కూడా లేరు. కానీ స్పెషల్ ప్రాసిక్యూటర్ అమిత్ ప్రసాద్ మాత్రం ఒక పథకం ప్రకారమే ఈశాన్య దిల్లీలో అల్లర్లు రెచ్చగొట్టారని పాట మాటలే వల్లించారు. మాకు అసలేం జరిగిందో, దానికి సాక్ష్యాధారాలు ఏమిటో తెలియజేయాలని న్యాయమూర్తులు రెట్టించి అడిగారు. ఈ విచారణ నిరంతరం కొనసాగడానికి వీలు లేదు. ఇది త్వరగా పూర్తి కావాలని న్యాయమూర్తులు స్పష్టం చేశారు. రెండు కోర్టులు ఇప్పటికే ఈ అల్లర్లలో కుట్ర పాత్ర ఉందని ప్రత్యేక ప్రాసిక్యూటర్ వాదించారు. షెర్జిల్ ఇమాం ఉపన్యాసాలు రెచ్చగొట్టేవిగా ఉన్నయని ప్రభుత్వం తరఫున వాదించే న్యాయవాధికారులు అన్నారు. ఇదే కేసులో నిందుతులైన కొంతమందికి బెయిలు మంజూరు అయింది. వాట్సఆప్ ద్వారా సందేశాలు పంపి అల్లర్లు రెచ్చగొట్టారని, మహిళల చేత రాళ్లు రువ్వించారని కూడా న్యాయాధికార్లు వాదించారు. నిందితులు మాత్రం తమ మీద బూటకపు కేసులు మోపారంటున్నారు. ఈ కేసులో తదుపరి విచారణ ఫిబ్రవరి 12 జరుగుతుంది. విచారణ సత్వరం పూర్తి కావాలని పట్టుబడ్తున్న న్యాయమూర్తుల వైఖరి ఎలా ఉంటుందో వేచి చూడాల్సిందే. అప్పటికైనా దిల్లీ పోలీసుల వాదనలు పూర్తి అవుతాయో లేదో కూడా చూడాలి. నిరసనకు ఏర్పాట్లు చేస్తే సరిపోతుందా, హింసాత్మక చర్యలకు రెచ్చగొట్టారని, లేదా అలాంటి చర్యలకు పాల్పడ్డారని రుజువు చేయాలి కదా అని దిల్లీ హైకోర్టు న్యాయమూర్తులు నవీన్ చావ్లా, శాలిందర్ కౌర్ గట్టిగా ప్రశ్నించారు. నిందితుల ఉద్దేశం ఏమిటో స్పష్టం చేయడం యు.ఎ.పి.ఎ.కేసుల్లో అత్యంత ముఖ్యమైందని న్యాయమూర్తులు అభిప్రాయపడ్డారు. అమిత్ ప్రసాద్ తన వాదనలు వినిపిస్తూ ఇది యాదృచ్ఛికంగా జరిగిన నిరసన కాదని కుట్ర ద్వారా జరిగిందని అన్నారు. ప్రాసిక్యూషన్ ఉద్దేశం చట్ట రీత్యా శిక్షించడం కానంత కాలం ఉమర్ ఖాలిద్ లాంటి వారు నిరవధికంగా జైళ్లల్లో మగ్గాల్సిందే.

మరింత మందగిస్తున్న ఆర్థికవ్యవస్థ

కృష్ణ రఘా

కొంతకాలంగా మందగిస్తున్న మన దేశ ఆర్థికవ్యవస్థ 2025లో మరింత దిగజారనుంది. గత నాలుగేళ్లకాలంలో సమాచారం పరిశీలించినట్లయితే 2024-25లో మరింతగా మందగించింది. ఉత్పత్తి, సేవలరంగాలు మందగమనంలోకి చేరడంతో ఆర్థికవ్యవస్థ కూడా మాంద్యంలోకి వెళుతోంది. 2025 జనవరి 8న ప్రభుత్వం విడుదల చేసిన సమాచారం దిగజారుతున్న ఆర్థికవ్యవస్థను తెలియజేస్తోంది. ఈ సూచనలన్నీ భారత్‌లో కార్పొరేట్ పెట్టుబడీదారీ వ్యవస్థ సంక్షోభంలోకి దిగజారుతున్నాయని తెలియజేస్తున్నాయి.

అంబానీ, అదానీ తదితర కొద్దిమంది కార్పొరేట్ల వద్ద సంపద, పెట్టుబడులు కేంద్రీకృతమయ్యాయి. చిన్న, మధ్య తరహా పరిశ్రమలు గరిష్టంగా దేశ ఆర్థికవ్యవస్థకు తోడ్పడుతున్నాయి. అదే సమయంలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నాయి. ఆర్థిక పెట్టుబడికి భారతదేశం క్రీడామైదానంగా ఉండేందుకు అనుమతించడంవల్ల ఈ పరిస్థితి తలెత్తింది. బ్యాంకింగ్, పారిశ్రామిక పెట్టుబడి కలిసిపోవడమే ఈ పరిస్థితికి దారితీసింది. మొదట కార్ల్‌మార్క్స్ నిర్వచించినట్లుగా పెట్టుబడి పెరుగుతున్న పరిణామక్రమంలో కల్పిత పెట్టుబడి వృద్ధి చెందింది. డబ్బు ఉత్పత్తిని పెంచడానికి బదులుగా డబ్బునే పెంచింది. ఇది ఉత్పత్తి, సర్వీసు రంగాలను దిగజార్చింది. వీటితో గుత్తాధిపత్యాన్ని సృష్టించింది. సంపదను, పెట్టుబడిని తక్కువ మంది వద్ద కేంద్రీకరించింది. ఆర్థికపెట్టుబడి పెరిగే కొలదీ ఉత్పత్తినుంచి ఊహాజనిత ధోరణి ఏర్పడింది.

మరోమాటలో చెప్పాలంటే ఉత్పత్తి, సేవల ద్వారా డబ్బు సంపాదించడం కంటే ద్రవ్య చెలామణి లేదా డబ్బునుంచి మరింత డబ్బును సంపాదించాలనే ధోరణి పెరిగింది. ఉత్పత్తి పెట్టుబడులు రోజురోజుకీ తగ్గుతున్నాయి. దీనివల్ల ఊహాజనితం ఏర్పడింది. మరింతగా ఆందోళనకలిగించే విషయం ఏమంటే అనేకమంది ఆర్థికవేత్తలు నరేంద్రమోదీ పాలనలో ప్రకటించే గణాంకాలు ఒట్టి అబద్ధపు మాటలని, తిమ్మిని బమ్మిని చేసేవని విశ్వసిస్తున్నారు. ఈ సంక్షోభాన్ని పూర్తిస్థాయిలో అర్థం చేసుకోవడం అసాధ్యంగా పరిస్థితి తయారైంది. 2024-25లో ముందుగానే అంచనావేసి జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్ఓ)విడుదల చేసిన సమాచారం దేశంలో వాస్తవ పరిస్థితిని తెలియజేయకపోవచ్చు. అంటే పరిస్థితి మరింత అధ్వాన్నంగా ఉంది.

1న ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌ను రూపొందించడానికి ముందుగా వేసిన అంచనాలు ఉపయోగపడవచ్చు లేదా ఊహాజనితం కావచ్చు.

2024 జులై నుంచి సెప్టెంబరు వరకు 7 త్రైమాసికాలలో కేవలం 5.4శాతంగా ఆర్థిక వృద్ధి మందంగా ఉందని ఎన్ఎస్ఓ స్పష్టంచేసింది. అంతక్రితం ఆర్థిక సంవత్సరంలో ఎన్ఎస్ఓ ప్రకటించిన ప్రకారం, 9.9శాతం ఉత్పత్తి ఉండగా, అది క్రమంగా 5.3శాతానికి తగ్గింది. వాణిజ్యం, హోటళ్లు, రవాణా, కమ్యూనికేషన్లతో కూడిన సేవలరంగం 2023-24లో 6.4శాతం కాగా, ఈ ఏడాది 5.8శాతం నమోదవుతుందని అంచనా. అలాగే వ్యవసాయరంగం ప్రస్తుత ద్రవ్యపరిస్థితి 3.8శాతానికి రికార్డుస్థాయిలో పెరుగుతుందని అంచనావేశారు. 2023-24లో కేవలం 1.4శాతం వ్యవసాయంలోఉత్పత్తి జరిగింది.

నమాచారాన్ని వక్రీకరించడం, తప్పుదారి పట్టించడం కంటే నిజాయితీగా పరిష్కార చర్యలను తీసుకోవడం ఆర్థికవ్యవస్థకు ఎంతైనా అవసరమని ప్రభుత్వం అర్థం చేసుకోవాలి. 2024-25లో జాతీయ గణాంకాల కార్యాలయం విడుదలచేసిన జాతీయ ఆదాయం 2024 డిసెంబరులో రిజర్వు బ్యాంకు అంచనావేసిన 6.6శాతం కంటే తక్కువగాఉంది. అంతేకాకుండా, ఆర్థిక మంత్రిత్వశాఖ ప్రాథమికంగా అంచనావేసిన 6.5-7శాతంకంటే తక్కువగా ఉంది. ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్ లోక్‌నభలో ఫిబ్రవరి

> **కార్ల్‌మార్క్స్ నిర్వచించినట్లుగా పెట్టుబడి పెరుగుతున్న పరిణామక్రమంలో కల్పిత పెట్టుబడి వృద్ధి చెందింది. డబ్బు ఉత్పత్తిని పెంచడానికి బదులుగా డబ్బునే పెంచింది. ఇది ఉత్పత్తి, సర్వీసు రంగాలను దిగజార్చింది. వీటితో గుత్తాధిపత్యాన్ని సృష్టించింది. సంపదను, పెట్టుబడిని తక్కువ మంది వద్ద కేంద్రీకరించింది. ఆర్థికపెట్టుబడి పెరిగే కొలదీ ఉత్పత్తినుంచి ఊహాజనిత ధోరణి ఏర్పడింది.**

2023-24 ఆర్థిక సంవత్సరంలో మొదట 8.2శాతం వృద్ధిరేటు అంచనా వేయగా, వాస్తవ జీడీపీ 6.4 శాతానికి పెరుగుతుందని ఎన్ఎస్ఓ తెలియజేసింది. అలాగే 2023-24లో జీడీపీ 9.6శాతం ఉండగా, స్వల్పంగా 2024-25లో 9.7శాతానికి పెరగవచ్చునని తెలుస్తోంది. 2024-25లో జీడీపీ 324.11లక్షల కోట్లు ఉండవచ్చునని అంచనా.

బడ్జెట్‌లో గ్రామీణప్రాంతాల్లో పేదప్రజలకు మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధివథకం కింద పనిదినాలను, వేతనాలను పెంచడంకంటే తగ్గిస్తున్నారు. ఇప్పటికైనా దేశంలో పరిస్థితిని వాస్తవంగా అంచనావేసి మహాత్మాగాంధీ గ్రామీణ పథకానికి నిధులను పెంచవలసిన అవసరం ఎంతైనా ఉంది. జిఎస్‌టి, ఆదాయం పన్ను విషయంలోనూ మధ్యతరగతికి వెసులుబాటును కల్పించాలి.

డిటెన్షన్ విధానం విద్యార్థినులకు హాని

మల్లాడి శ్రీనగేష్

విద్యా హక్కు చట్టం ద్వారా ఉచిత నిర్బంధ విద్యా ప్రణాళికలు అమలుకు 2010 వ సంవత్సరంలో శ్రీకారం చుట్టి బడికి దూరంగా వున్న పిల్లలను బడిలో చేర్చాలన్నది లక్ష్యం. నేడు విద్యా హక్కు చట్టం ప్రశ్నార్థమై నిలుస్తోంది. బడి మానేసిన పిల్లలను వయసు ఆధారిత తరగతిలో నమోదు చేసి ప్రత్యేక శ్రద్ధతో వయసు, తరగతి వారీ సామర్థ్యాలను సమకూరేలా తయారు చేయడంలో సఫలం కాలేదు. మరలా డిటెన్షన్ విధానం

వచ్చింది. పిల్లలను మరలా బడికి దూరం చేస్తుందా అనే ప్రశ్న అందరిలో తలెత్తింది. నో డిటెన్షన్ విధానానికి స్వస్తి పలికి విద్యార్థిని 5వ తరగతి, 8వ తరగతిలో పరీక్షల ఫలితాల ఆధారంగా పై తరగతి ఉత్తీర్ణత సాధించేలా కేంద్ర ప్రభుత్వం నో డిటెన్షన్ విధానానికి ముగింపుగా ఓ గజిట్ విడుదల చేసిన సంగతి అందరికీ తెలిసిందే. ఈ విషయంలో రాష్ట్రాలదే తుది నిర్ణయమే అయినప్పటికీ వాటి పరిణామాలు విద్యార్థులపై వివక్ష దిశగా పరిణమించే పరిస్థితులు ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయి. ముఖ్యంగా డిటెన్షన్ వలన ఒక వేళ తరగతిలో పలు మార్లు ప్రయత్నించి, ఫలించక నిరాశతో బడి బాటను వదిలేస్తే ఇప్పటికే వివక్ష వలయంలో విలవిల్లాడుతున్న బాలికలవిద్య మరింత జఠిలం అవుతుంది. ఎక్కువ శాతం బాలికలు బడికి దూరమయ్యే పరిస్థితులు ఎదుర్కొనక తప్పదు. సమాజంలో ఆడ పిల్లల చదువు పట్ల ఇప్పటికీ వివక్ష చూపించడం, ఉన్నత చదువులకు ప్రోత్సహించక పోవడం గమనార్హం. ఇప్పటికే ప్రాథమికస్థాయిలో బడి మానేస్తున్న బాలికల శాతం 2020-21 సంవత్సరంతో 0.69 కాగా, 2021-22 లో 1.35 గా నమోదైంది. ఈ పరిస్థితి గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో మరీ ఎక్కువ, ఈ ప్రాథమిక విద్యా ప్రభావం ఉన్నత విద్యపైన, డ్రాప్ అవుట్ శాతం పైన మరింత ప్రభావాన్ని చూపిస్తుందనేది వాస్తవం. ఉన్నత విద్యలో గణాంకాల ప్రకారం సుమారు 14.7 శాతం మంది విద్యార్థులు సెకండరీస్థాయిలో బడి మానేస్తుండగా, బాలికలు 13.7 శాతం మంది చదువుకు దూరం అవుతున్నారని మానవ అభివృద్ధి నివేదిక 2020-21 తెలియజేసింది. ఇప్పటికీ గ్రామీణ స్థాయిలో బడి మానేస్తున్న విద్యార్థుల శాతం 2020-21 సంవత్సరంలో 37 శాతంగా నమోదైంది. అసర్ 2023 నివేదిక ప్రకారం బాలికల విద్యా విషయానికొస్తే సుమారు 16.80 శాతం మంది బడికి దూరం అవుతున్నారంటే విద్యా హక్కు చట్టం 2009 ప్రధాన భూమికకే తూట్లు పడ్డాయనేది వాస్తవం. ఈ పరిస్థితిలో మరలా వెలుగులోకి వచ్చిన డిటెన్షన్ విధానం గజెట్ ప్రభుత్వ పాఠశాలపై ఆధారపడి చదువుకొనే హరిజన, గిరిజన, వెనుకబడిన వర్గాలకు ప్రత్యేకించి బాలికా విద్యకు విఘాతం కలిగిస్తుందనేది నిపుణుల అభిప్రాయం వాస్తవం కూడా.

డిటెన్షన్ విధానాన్ని బలపరిచే నిర్ణయం ఏమాత్రమూ ఆకస్మిక నిర్ణయం కాదు. ఈ నిర్ణయంపై 2015 లో కేంద్ర కమిటీ ఆయా రాష్ట్రాలతో చర్చించి విద్యా హక్కు చట్టానికి ఏ మాత్రం నష్టం వాటిల్లకుండా విద్యార్థుల భవిష్యత్తును తీర్చి దిద్దాలని సూచించింది. అయితే ప్రస్తుత పరిస్థితి నూతన విద్య విధానంలో ప్రధానాంశంగా పొందుపరచిన పూర్వ ప్రాథమిక విద్య, ప్రాథమిక దశలోనే గట్టి పునాది వంటి అంశాలను పరిగణలోనికి తీసుకొని డిటెన్షన్ విధానం వచ్చినా పిల్లలు అనుకున్న ఫలితాలతో ముందుంటారనే భావనతో ప్రభుత్వం ఈ ప్రతిపాదనను ముందుకు తెచ్చి ఉండవచ్చు. కానీ చేసిన ప్రణాళికలను ఆయా రాష్ట్రాల్లో అమలు తీరును అంచనా వేయకుండా డిటెన్షన్ నిర్ణయం తీసుకుంటే ఇది విద్యార్థులకు నష్టం జరిగే ప్రమాదం వుంది. పాఠశాలల్లో డ్రాప్ అవుట్ రేటు శాతం ముఖ్యంగా బాలికల విద్యలో తీవ్ర పరిణామం చూపే ప్రమాదం వుంది. విద్యార్థుల పునాదిని బలపరిచే పూర్వ ప్రాథమిక విద్యనూ బలపరచకుండా అకస్మాత్తుగా డిటెన్షన్ విధానాన్ని ప్రోత్సహిస్తే, పరీక్ష ఫెయిల్ అయిన రెండు మాసాలలో మరలా పరీక్ష నిర్వహించి తిరిగి ఉతీర్ణతను బట్టి అదనపు తరగతికి చేరే వెసులుబాటు కల్పించారు. కానీ ఈ వ్యవధిలో విద్యార్థిని సంసిద్ధపరచడం ఎంత అసాధ్యమోఅనేది యోచించాలి. విద్యార్థి ఫెయిల్ అయితే మరలా గడచిన తరగతిలోనే కొనసాగితే విద్యార్థి ఎదుర్కొనే మానసిక సంఘర్షణ ఒక వైపు. దీనికి ప్రభుత్వం తగిన వసతులు, బోధనా పరికరాలు, శిక్షణలు ఏర్పరచాలి. వినూత్న విద్యా బోధనా సరళికి ఉపాధ్యాయులను ప్రోత్సహించేలా నిధి -విధి రెండూ జోడించాలి. డిటెన్షన్ పేరుతో ఆడపిల్లల చదువుకు అడ్డు కట్ట వేయకుండా ఆడపిల్లల చదువుకు కావలసిన రక్షణ, పారిశుద్ధ్య వసతులు, జీవన నైపుణ్యాలు, ఆడ -మగ వివక్షకు దారి లేకుండా స్నేహపూర్వక వాతావరణాన్ని ఏర్పరచాలి. మాతృ భాషలో బోధనతో బాటు ఆంగ్ల మాధ్యమాలలో బోధనకు సుశిక్షుతులైన ఉపాధ్యాయుల నియామకం, పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక విద్యను అనుసంధానం చేయడం తప్పనిసరిగా ప్రభుత్వం గుర్తించాలి. పిల్లల అభ్యాసనా సామర్థ్యాల పునరుద్ధరణే ప్రథమ లక్ష్యంగా పాఠశాలలు గుర్తించాలి. అంతే తప్ప డిటెన్షన్ పేరుతో విద్యార్థుల మానసిక పరిస్థితులలో ఆందోళన కల్గించి బడికి దూరం చేయడం విద్యా సంస్కరణల సూత్రం కాకూడదు.

తెలంగాణ సాయుధ పోరాట నేపథ్యం - 1

ఆర్వీ రామారావ్

హైదరాబాద్ సంస్థానంలో నిజాం పాలనలోని ప్రాంతంలో జరిగిన రైతాంగ పోరాటాన్ని తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం అంటాం. ఈ పోరాటం కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో 1946 నుంచి 1951 దాకా సాగింది. తారీకుల ప్రకారం అయితే ఇది 1946 జులై4 నుంచి 1951 అక్టోబర్ 25 దాకా సాగింది. అయితే 1944 నుంచే పోరాటానికి అనుకూలమైన పరిస్థితులున్నాయి. నిజాం సంస్థానంలో పాలన నిజాందే అయినా అసలు అధికారం చెలాయించింది దేశ్ పాండ్యా, దేశ్ ముఖ్, జాగిర్దార్, మక్తేదార్, పరగణాదార్లే. వీరిని దొరలు అనేవారు. వీరిలో తరతమ భేదాలు ఉన్నా అందరూ దొరల కిందే లెక్క భూమి శిస్తు వీరే వసూలు చేసేవారు. ఈ శిస్తు నిర్ణయించేది కూడా వీరే. గ్రామాల్లో భూమికి సంబంధించిన రికార్డుల నుంచి గ్రామాలపై పెత్తనం కూడా వీరిదే. నిజాం పరిపాలన కొనసాగుతున్న ప్రాంతంలో దేశంలోని మిగతా ప్రాంతాలకన్నా దోపిడీ ఎక్కువగానే కాక క్రూరంగా ఉండేది. వ్యవసాయం చేసేవారు దొరలకు బానిసల్లా బతకాల్సిన పరిస్థితి. ప్రపంచ వ్యాప్తంగా వచ్చిన ఆర్థిక మాంద్యం ప్రభావం నిజాం సంస్థానంలోని ప్రజలపై కూడా ఉండేది. 1940లలో రైతులు, రైతు కూలీలు నెమ్మదిగా కమ్యూనిస్టు పార్టీ పట్ల ఆకర్షితులయ్యారు. వీరు హక్కుల కోసం పోరాడడం మొదలుపెట్టారు. రెండవ ప్రపంచం ముగిసే నాటికి ప్రజల పరిస్థితి మరింత మిక్కమైంది. రైతులను నిజాం ప్రభుత్వం, దొరలు తీవ్రంగా అణచి వేయడంవల్ల తిరుగుబాటు ప్రారంభమైంది. ఆనాడు హైదరాబాద్ సంస్థానంలో మూడు భాగాలు ఉండేవి. కర్నాటకలోని మూడు జిల్లాలు, ప్రస్తుత మహారాష్ట్రలోని అయిదు జిల్లాలు నిజాం ఏలుబడిలో ఉండేవి. ప్రభుత్వ అణచివేత కన్నడ, మరాఠీ, తెలుగు మాట్లాడే ప్రాంతాలపై సమానంగానే ఉన్నా తెలుగు ప్రజలు మరింత దాష్టీకం ఎదుర్కోవలసి వచ్చింది. కన్నడ, మరాఠీ ప్రజలపై నిజాంకు లేని వ్యతిరేకత అధిక సంఖ్యాకులైన తెలుగు మాట్లాడే వారిపై ఉండేది. జాగీర్ గ్రామాలు సివిల్ కోర్టుల పరిధిలోకి వచ్చేవి కావు. భూమి శిస్తు వసూలుతో పాటు, శాంతి భద్రతలు, న్యాయ వ్యవస్థ కూడా భూస్వాముల చేతుల్లోనే ఉండేది. నిజాం సొంత ఖర్చుల కోసం విస్తారమైన భూమి ఉండేది. దీనిని సర్ఫెఖాస్ అనే వారు. భూస్వాములు ప్రత్యేక ఏజెంట్ల ద్వారా శిస్తు వసూలు చేసేవారు. ప్రభుత్వ అధీనంలో ఉన్న భూములను

దివానీ భూములు అనేవారు. వసూలు చేసిన పన్నులను సక్రమంగా, సమయానికి ప్రభుత్వానికి చెల్లించే భూస్వాములకు ఎలాంటి ఇబ్బంది ఉండేది కాదు. ఇందులో కొంత భాగం రైతుల అధీనంలో ఉండేవి. వీటిని పట్టా భూములు అనేవారు. వారు పన్ను చెల్లిస్తే చాలు. ఇలాంటి భూములను భూస్వాములు సాగుచేసేవారు కాదు. రైతులు లేదా కౌలుదార్లు సాగు చేసేవారు. వీరిని షికందార్లు, ఆసాములు అని కూడా అనేవారు. అయితే కౌలుదార్లకు ఆ భూములు సొంతం కాదు. అంటే వారు ఫ్యూడల్ వ్యవస్థలో భూస్వాముల అడుగులకు మడుగులొత్తుతూ బతకాల్సిందే. రైతుల్లో ఎక్కువ మంది నిరక్షరాస్యులే. అప్పటికి మొత్తం అక్షరాస్యుల సంఖ్యే మూడు శాతం. దీనివల్ల రైతులు సాగు చేస్తున్న భూములను కూడా భూస్వాములు అధికారుల అండదండలతో తమ భూములుగా రాయించుకునే వారు. గ్రామాలకు గ్రామాలు భూస్వాముల చేతుల్లోనే ఉండేవి. ఈ భూముల వ్యవహారం చూడడానికి భూస్వాములు ప్రైవేట్ ఉద్యోగులను నియమించుకునే వారు. వీరిని సేరిదార్లు అనేవారు. 30 శాతం భూములు జాగీర్దార్ల చేతిలో ఉంటే 60 శాతం దివానీ భూములుగా ఉండేవి.

తెలంగాణాలో ఫ్యూడల్ వ్యవస్థ మరింత కర్కశంగా ఉండేది. దొరలు వడ్డీ వ్యాపారం కూడా చేసేవారు. వెట్టి చాకిరీ సర్వ సాధారణం. దొరల భూములు ముందు సాగుచేసి తరవాతే రైతులు తమ భూముల్లో సేద్యం చేసుకోవాలి. దొరలకు కావలసిన కూరగాయల దగ్గర నుంచి మట్టి పాత్రలు, వంట చెరుకు దాకా అన్నీ గ్రామస్థులు ఉచితంగా సరఫరా చేయాల్సిందే. దొరల ఇంట్లో పెళ్లో మరో పండగో జరిగితే దానికి కావాల్సిన వస్తువులన్నీ రైతులు సమకూర్చాల్సిందే. దీనిని సరబరా (సరఫరా) పద్ధతి అనేవారు. ఇవన్నీ ఉచితంగా సమర్పించుకోవలసిందే. పటేల్ పట్వారీ వ్యవస్థ కూడా ఆనువంశికంగా దొరల చేతుల్లోనే ఉండేది. పైగా దొరలకు పశువులు, పండిన పంట, డబ్బు నజరానా (కానుక)గా సమర్పించాల్సిందే. దొరల్లో ఎక్కువ భాగం బ్రాహ్మణులే. కొంతమంది వెలమ, రెడ్డి దొరలు కూడా ఉండేవారు. కొందరు ముస్లింలు జాగీర్దార్లుగా ఉండేవారు. కింది కులాల వారు దొరలుగా ఉన్న సందర్భాలు చాలా తక్కువ. గ్రామాల్లోని శూద్ర కులాల వారు కులాన్నిబట్టి దొరలకు ఊడిగం చేయాల్సిందే. పేదల ఇంట్లో శుభ కార్యాలైనా దొరలకు కానుకలు ముట్ట చెప్పాల్సి వచ్చేది. నల్లగొండ, మహబూబ్ నగర్, వరంగల్ జిల్లాల్లో ఒక్కో దొర చేతిలో అనేక గ్రామాలు, వేల ఎకరాల భూములు ఉండేవి. చిన్న కమతాలు ఉన్న రైతులు శిస్తు చెల్లించకపోతే వారి భూములను దొరలు లాకున్నందువల్ల వారు కౌలుదార్లో, వ్యవసాయ కూలీలుగానో మారిపోయేవారు. మొదట నైజాం తరఫున పన్నులు వసూలు చేయడానికి దళారీ వ్యవస్థ ఉండేది. మొదటి సాలార్ జంగ్ ప్రధానిగా ఉన్నప్పుడు ఈ వ్యవస్థను రద్దుచేసి సెటిల్మెంట్ (జమాబందీ) విధానాన్ని ప్రవేశ పెట్టారు. అప్పుడే భూస్వాములు మంచి భూములను సొంత కమతాలుగా సెటిల్మెంట్‌లో రాయించుకున్నారు. అనేక సందర్భాలలో రైతులు పోడుగొట్టి సాగు చేసుకున్న భూములను కూడా కబళించారు. ఆర్థిక మాంద్యం భూములున్న రైతులను కూడా దెబ్బ తీసింది. వెనుకబడిన తరగతుల వారు, హరిజనులు విధిగా వెట్టి చాకిరీ చేయాల్సి వచ్చేది. దొరలు ప్రజలను చిత్రహింసలు పెట్టడం సర్వ సాధారణం. చాకలి, మంగలి, కుమ్మరి, వడ్రంగి, కమ్మరి - ఇలా సకల చేతి వృత్తుల వారు దొరలకు ఊడిగం చేయాల్సిందే. పై అధికారులు వస్తే వారికి కావలసిన సరంజామా ఉచితంగా సరఫరా చేయాల్సి వచ్చేది. దొరల దాష్టీకం ఎంత ఘోరంగా ఉండేదంటే నచ్చిన స్త్రీ ఎవరైనా గడీ చేరాల్సిందే.

రాహుల్‌కు అనారోగ్యం... ఎన్నికల ర్యాలీ రద్దు

న్యూదిల్లీ: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అనారోగ్యానికి గురయ్యారు. దీంతో గురువారం నాటి ఎన్నికల ప్రచారాన్ని రద్దు చేసుకున్నారు. దిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ముస్తఫాబాద్‌లో రాహుల్‌గాంధీ ఎన్నికల ప్రచారం నిర్వహించాల్సి ఉంది. అయితే అనారోగ్యం కారణంగా వైద్యుల సూచన మేరకు ఈ ప్రచార సభ రద్దైందని కాంగ్రెస్ పార్టీ దిల్లీ అధ్యక్షుడు దేవేందర్ యాదవ్ తెలిపారు. షెడ్యూల్ ప్రకారం శుక్రవారం మాదిపూర్‌లో రాహుల్‌గాంధీ ఎన్నికల ర్యాలీ జరుగుతుందని చెప్పారు. భారీ బహిరంగ సభలో ఆయన ప్రసంగించే అవకాశం ఉందన్నారు. సదర్ అసెంబ్లీ నియోజకవర్గంలోని ఇందర్‌లోక్ మెట్రోస్టేషన్ సమీపంలో బుధవారం జరిగిన ఎన్నికల ర్యాలీకి కూడా రాహుల్ గాంధీ హాజరుకాలేదు. ఆయన పాల్గొనాల్సిన మూడు ప్రచార సభల్లో రెండు రద్దయ్యాయి. దీంతో ముస్లిం ఓటర్ల విభజనకు కారణం కాకుండా రాహుల్ గాంధీ ఆప్‌కు సహకరిస్తున్నట్లు వదంతులు వినిపిస్తున్నాయి. దేవేందర్ యాదవ్ దీనిని ఖండించారు. దిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో తాము సొంతంగానే పోటీ చేస్తున్నట్లు తెలిపారు. తాము ఏ పార్టీకి మద్దతు ఇవ్వడం లేదని అన్నారు. రిపబ్లిక్ డే తర్వాత రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ సహా పార్టీ నేతలు దిల్లీలో ఎన్నికల ప్రచారం ముమ్మరం చేస్తారని చెప్పారు.

500 పైగా కోడ్ ఉల్లంఘన కేసులు

న్యూదిల్లీ: దిల్లీలో అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇప్పటివరకు ఎన్నికల కోడ్ ఉల్లంఘనలకు సంబంధించి 500 కి పైగా కేసులు నమోదయ్యాయి. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన జనవరి 7 నుండి జనవరి 22 మధ్య ఈ కేసులు నమోదైనట్లు ఎన్నిక సంఘం తెలిపింది. ఈ కాలంలో ఎక్సైజ్ చట్టంతో సహా వివిధ నిబంధనల కింద మొత్తం 17,879 మందిని అరెస్టు చేసినట్లు కూడా వెల్లడించింది. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేసింది. ఎన్నికల వేళ నగర పోలీసులు సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద నిఘాను ముమ్మరం చేశారు. ఆయుధాలు, మద్యం, మాదకద్రవ్యాల అక్రమ రవాణాతో సహా చట్టవిరుద్ధ కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకున్నారు. మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ (ఎంసిసి) ఉల్లంఘన ఆరోపణలపై దిల్లీ పోలీసులు 504 కేసులను నమోదు చేసి... 270 లైసెన్స్ లేని తుపాకులు, 372 కాట్రిడ్జ్‌లను స్వాధీనం చేసుకున్నట్లు ప్రకటన తెలిపింది. అలాగే రూ.1.3 కోట్లు విలువైన 44,265 లీటర్ల లిక్కరు, రూ.20కోట్ల విలువైన 110.53 కిలోల డ్రగ్స్, 1200 మేర నిషేధిత ఇంజక్షన్లు స్వాధీనం చేసుకున్నారు. ఇక లెక్కలు చూపని రూ.4.56 కోట్ల నగదు, 37.39 కిలోల వెండిని అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు ప్రకటన వివరించింది.

ఓటరు జాబితా నుంచి మాజీ సీఎం పేరు మాయం

డెహ్రాడూన్: కాంగ్రెస్ నేత, ఉత్తరాఖండ్ మాజీ ముఖ్యమంత్రి హరీశ్ రావత్‌కు చేదు అనుభవం ఎదురైంది. గురువారం అక్కడ స్థానిక సంస్థల ఎన్నికల పోలింగ్ జరగ్గా... డెహ్రాడూన్‌లో ఓటేయడానికి వెళ్లిన ఆయన పేరు ఓటరు జాబితాలో కనిపించలేదు. దీంతో ఆయన అక్కడే ఎదురుచూస్తూ ఉండిపోయారు. డెహ్రాడూన్‌లోని నిరంజన్‌పూర్‌లో రావత్ 2009 నుంచి నివాసం ఉంటున్నారు. 2022 అసెంబ్లీ ఎన్నికలతో పాటు కిందటి ఏడాది సార్వత్రిక ఎన్నికల్లోనూ ఓటేసిన సంగతిని ఆయన గుర్తు చేస్తున్నారు. 'గత 16 ఏళ్లుగా నేను ఓటు హక్కు వినియోగించుకుంటున్నా. కానీ, ఇప్పుడు నా పేరే లేకుండా పోయింది. ఉదయం నుంచి నేను పోలింగ్ స్టేషన్ వద్దే ఉన్నా. అయినా అధికారుల నుంచి ఎలాంటి స్పందన లేదు. నాకే ఇలా జరిగిందంటే... ఇది కచ్చితంగా అప్రమత్తం కావాల్సిన విషయం' అని ఆయన అన్నారు. దీనిపై ఆయన రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. అయితే... కంప్యూటర్ సర్వర్‌లో తలెత్తిన సమస్యే ఇందుకు కారణంగా తేలింది. దీంతో రావత్‌కు ఓటు హక్కు వినియోగించుకునే పరిస్థితి లేదని ఈసీ సమాచారం అందించింది. ఉత్తరాఖండ్‌లో గురువారం 11 మున్సిపల్ కార్పొరేషన్లు, 43 మున్సిపల్ కౌన్సిళ్లు, 46 నగర పంచాయతీలకు ఎన్నికలు జరిగాయి.

బాలీవుడ్ నటులకు బెదిరింపులు

ముంబై: బాలీవుడ్ సెలబ్రిటీలకు వరుస బెదిరింపులు ఆందోళన కలిగిస్తున్నాయి. ఇప్పటికే లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ నుంచి బాలీవుడ్ నటుడు సల్మాన్ ఖాన్ వరుస బెదిరింపులు ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. మొన్నటికి మొన్న బాలీవుడ్ స్టార్ సైఫ్ అలీఖాన్‌పై దుండగుడు కత్తితో దాడి చేశాడు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన సైఫ్ కోలుకుంటున్నాడు. ఇంతలోనే కొంతమంది బాలీవుడ్ సెలబ్రిటీలకు హత్య బెదిరింపులు కలకలం రేపుతున్నాయి. బాలీవుడ్ స్టార్ కమెడియన్ కపిల్ శర్మతోపాటు రాజ్‌పాల్ యాదవ్, రెమో డిసౌజా, సుగంధ మిశ్రాకు హత్య బెదిరింపులు వచ్చినట్లు పోలీసులు తాజాగా తెలిపారు. బిష్ణు అనే పేరుతో వీరికి బెదిరింపు మెయిల్ వచ్చినట్లు పేర్కొన్నారు. కాగా, బెదిరింపు మెయిల్‌లో 'మేము మీ ప్రతి కదలికను ఎప్పటికప్పుడు నిశితంగా గమనిస్తున్నాం. ఇది పబ్లిక్ స్టంట్ లేదా మిమ్మల్ని వేధించే ప్రయత్నం అయితే కానే కాదు. మీరు ఈ సందేశాన్ని సీరియస్‌గా తీసుకోండి' అంటూ ఈ-మెయిల్లో పేర్కొన్నట్టు మీడియా సంస్థలు పేర్కొన్నాయి. బెదిరింపు మెయిల్ పంపిన వ్యక్తి తన డిమాండ్లను ఎనిమిది గంటల్లోగా నెరవేర్చకపోతే ప్రమాదకర పరిణామాలు ఎదుర్కొంటారని హెచ్చరించినట్లు తెలిసింది. అయితే ఆ వ్యక్తి డిమాండ్లు ఏమిటన్నవి బయటకు రాలేదు.

ప్రముఖుల ఫిర్యాదు మేరకు అంబోలి, ఓషివారా పోలీస్ స్టేషన్లలో కేసు నమోదైంది. ఈ ఘటనపై విచారణ జరిపిన పోలీసులు ఈ మెయిల్ ఐపీ అడ్రస్ పాకిస్థాన్‌కు చెందినదిగా ప్రాథమిక విచారణలో గుర్తించారు. తదుపరి విచారణ కొనసాగుతోంది.

నిన్నటి శత్రువులే నేటి మిత్రులు

- దిల్లీ ఎన్నికల్లో ఫిరాయింపుదార్లకు పెద్దపీట
- ఆప్, బీజేపీ, కాంగ్రెస్ మూడింటిదీ అదేదారి
- కార్యకర్తల పనితీరే నిర్ణయాత్మకం

న్యూదిల్లీ: ఫిబ్రవరి లో జరగబోయే దిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించేందుకు అన్ని పార్టీలు సమాయత్తమవుతున్నాయి. వ్యూహప్రతివ్యూహాలతో ముందుకుసాగుతున్నాయి. ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్), బీజేపీ, కాంగ్రెస్ మధ్య ముక్కోణపు పోరు సాగుతోంది. ఈ క్రమంలో ఆఖరి నిమిషంలో ఒక పార్టీ నుంచి ఫిరాయించి... మరో పార్టీ టికెట్ పోటీ చేస్తున్న నాయకులు అనేకమంది ఉన్నారు. ఈ మూడు ప్రధాన పార్టీలు కలిసి చివరి నిమిషంలో మిత్రులుగా మారిన శత్రువులను సుమారు 20మందిని ఎన్నికల బరిలో దింపాయి. అయితే వీరికి ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు పూర్తి స్థాయిలో సహకరిస్తారా అనేది ప్రశ్నార్థకంగా మారింది. ఏ పార్టీ అధికారంలోకి రావాలన్నా వీరి పనితీరే నిర్ణయాత్మకం కానుంది. చివరి నిమిషంలో పార్టీ మారిన నాయకులు కొత్త సెటప్‌లో తమను తాము నిరూపించుకోవడం అంత సులభమేమి కాదన్న వాదనలున్నాయి. ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్దీ... ఆప్, కాంగ్రెస్, బీజేపీకి చెందిన అనేక మంది ప్రముఖ నాయకులు తమ రాజకీయ భవిష్యత్తు కోసం అనేక మార్గాలు అనుసరించారు. అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్లు దక్కవేమోనన్న భయంతో అర డజను మంది నాయకులు ఆప్‌లోకి మారారు. వారందరిని ఆప్ వివిధ నియోజకవర్గాల నుండి పోటీకి నిలిపింది. ఈ నాయకులు 2020లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులుగా పోటీ చేశారు. బీజేపీ నుంచి వచ్చిన వారిలో ప్రవేశ్ రతన్‌ను ఆప్ పటేల్ నగర్ (ఎస్సీ) స్థానం నుండి మాజీ మంత్రి, బీజేపీ అభ్యర్థి రాజ్ కుమార్ ఆనంద్ పై పోటీకి నిలిపింది. 2020లో కూడా వారు ప్రత్యర్థులే. కానీ వేర్వేరు పార్టీల నుండి పోటీ చేశారు. ఆప్ నుండి ఆనంద్, బీజేపీ నుండి రతన్ పోటీ చేశారు. ఇక ఆప్‌లో చేరిన జితేందర్ సింగ్ షుంటి, సురీందర్ పాల్ బిట్టు వరుసగా షాహ్దరా, తిమార్పూర్ నియోజకవర్గాల నుండి టికెట్లు పొందారు. మరో ముగ్గురు బీజేపీ నాయకులు - బ్రహ్మ సింగ్ తన్వర్ (ఛత్తర్పూర్), బీబీ త్యాగి (లక్ష్మీనగర్), అనిల్ ఝా (కిరారి)లకు సైతం ఆప్ టికెట్లు ఇచ్చింది. 2020 ఎన్నికల్లో బ్రహ్మ సింగ్ తన్వర్ ను ఓడించిన కర్తార్ సింగ్ తన్వర్ ఇప్పుడు ఛత్తర్పూర్ నుండి బీజేపీ అభ్యర్థి కావడం గమనార్హం. పార్టీని వీడిన ఎమ్మెల్యే రితురాజ్ ఝాకు టికెట్ నిరాకరించడం ద్వారా ఝాను ఆప్ కిరారి స్థానం నుంచి పోటీకి దింపింది. 2020లో అనిల్, రితురాజ్ చేతిలో స్వల్ప తేడాతో ఓడిపోయారు. ఇర ఇటీవల కాలంలో పార్టీలో చేరిన కాంగ్రెస్ నాయకులను కూడా ఆప్ పోటీకి దింపింది. సీమాపురి నుండి వీర్ సింగ్ ధింగన్, మటియాలా నుండి సుమేష్ షోకీన్, సీలంపూర్ నుండి జుబైర్ అహ్మద్‌లను ఎన్నికల బరిలో నిలిపింది. ఇక బీజేపీ భారీ అవకాశం ఇచ్చినవారిలో దిల్లీ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు అరవిందర్ సింగ్ లవ్లీ, ఆప్ ప్రభుత్వంలో మాజీ రవాణా మంత్రి కైలాష్ గెహ్లాత్ ఉన్నారు. లవ్లీ గాంధీ నగర్ స్థానం నుండి బీజేపీ టికెట్‌పై పోటీ చేస్తుండగా, గెహ్లాత్ బిజ్వాసన్ నియోజకవర్గం నుండి పార్టీ అభ్యర్థిగా ఉన్నారు. మాజీ కాంగ్రెస్ నాయకులకు కూడా బీజేపీ టికెట్లు ఇచ్చింది. మంగోల్‌పురి నుండి రాజ్ కుమార్ చౌహాన్, కస్తూర్బా నగర్ నుండి నీరజ్ బసోయా, జంగ్‌పురా నుండి తర్విందర్ మార్వా బీజేపీ నుంచి పోటీ చేస్తున్నారు. మరోవైపు కాంగ్రెస్ పార్టీ ఆప్ ఎమ్మెల్యేలు ధరమ్ పాల్ లక్రా, అబ్దుల్ రెహ్మాన్‌లను పార్టీలో చేర్చుకుని వారిని వరుసగా ముండ్కా, సీలంపూర్ నుండి పోటీకి నిలిపింది. లక్రాతో పాటు కాంగ్రెస్‌లో చేరిన ఆప్ కౌన్సిలర్ రాజేష్ గుప్తా ఇప్పుడు కిరారి నుండి పోటీ చేస్తున్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ సభ్యులుగా ఉన్న ఆప్ మాజీ ఎమ్మెల్యేలు దేవేందర్ సెహ్రావత్, హాజీ ఇష్రాక్‌లు బిజ్వాసన్, బాబర్‌పూర్ నుండి పోటీ చేస్తున్నారు. ఈ కొత్త అభ్యర్థులలో చాలామంది ఆశ్చర్యకర ఫలితాలను అందించగలరని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. దేవేందర్ సెహ్రావత్, హాజీ ఇష్రాక్, అబ్దుల్ రెహ్మాన్ విజయావకాశాలపై కాంగ్రెస్ నాయకులు విశ్వాసం వ్యక్తం చేశారు. దిల్లీలోని 70 అసెంబ్లీ స్థానాలకు ఫిబ్రవరి 5వ తేదీన పోలింగ్ జరగనుంది. ఆప్, బీజేపీ, కాంగ్రెస్ మధ్య త్రిముఖ పోటీ నెలకొనే అవకాశం ఉన్న ఈ ఎన్నికలు ఫిబ్రవరి 8న జరిగే ఓట్ల లెక్కింపుతో ముగుస్తాయి. దిల్లీ ఎన్నికల పోరు తీవ్రంగా ఉంటుందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

దిల్లీ కోరుకునేది షీలా దీక్షిత్ అభివృద్ధి నమూనా

రాహుల్

న్యూదిల్లీ: దిల్లీ ప్రజలు మాజీ ముఖ్యమంత్రి షీలా దీక్షిత్ యొక్క 'నిజమైన అభివృద్ధి నమూనా'ని కోరుకుంటున్నారని... ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ చేస్తున్న 'తప్పుడు ప్రచారం, పీఆర్ నమూనా'ని కాదని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ పేర్కొన్నారు. దిల్లీలో ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, కాలుష్యం, అవినీతి వంటి అంశాలను హైలైట్ చేస్తూ ఆయన గురువారం ఫేస్‌బుక్‌లో ఓ వీడియో విడుదల చేశారు. 'దిల్లీ ఇప్పుడు షీలా దీక్షిత్ జీ చేసి చూపిన నిజమైన అభివృద్ధి నమూనాను కోరుకుంటోంది. మోదీ, కేజ్రీవాల్ తప్పుడు ప్రచారం, ప్రజా సంబంధాల నమూనాను కాదు' అని రాహుల్ పేర్కొన్నారు. రాహుల్ అస్వస్థతకు గురవడంతో బుధవారం సదర్ బజార్ అసెంబ్లీ నియోజకవర్గంలో జరిగిన బహిరంగ సభలో ప్రసంగించలేకపోయారు. అయితే అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీకి అఖండ విజయం చేకూర్చాలని కోరుతూ సందేశం పంపారు. అనారోగ్యం కారణంగా మంగళవారం కర్నాటకలోని బెళగావిలో జరిగిన 'జై బాపు, జై భీమ్, జై సంవిధాన్' ర్యాలీకి కూడా గాంధీ వెళ్లలేకపోయారు. అంతకుముందు న్యూదిల్లీ నియోజకవర్గంలో ఆయన రాజకీయ సభ కూడా నిర్వహించలేకపోయారు. ప్రధాని నరేంద్ర మోదీ, దిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌లపై ఇటీవల రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు చేశారు. ఇద్దరు నాయకుల మధ్య ఎటువంటి తేడా లేదని, వెనుకబడిన వర్గాలు, దళితులు, గిరిజనులు, మైనారిటీల మేలును వారు కోరుకోవడం లేదని అన్నారు. దిల్లీలో జరిగిన బహిరంగసభలో కేజ్రీవాల్‌ను లక్ష్యంగా చేసుకుని... దేశ రాజధానిలో కాలుష్యం, అవినీతి, ద్రవ్యోల్బణం పెరుగుతున్నప్పటికీ ఆప్ కన్వీనర్...మోదీ ప్రచార వ్యూహం, తప్పుడు వాగ్దానాలను అనుసరిస్తున్నారని విమర్శించారు.

ఉబర్, ఓలా సంస్థలకు కేంద్రం నోటీసులు

న్యూదిల్లీ: యాప్ ఆధారంగా క్యాబ్ సర్వీసులు అందిస్తున్న ఉబర్, ఓలా సంస్థలపై ఫిర్యాదులు ఎక్కువ కావడంతో కేంద్ర వినియోగదారుల మంత్రిత్వశాఖ స్పందించింది. ఆ రెండు సంస్థలకు నోటీసులు జారీ చేసింది. ఈ తరహా యాప్‌లు ఫోన్ ధర ఆధారంగా చార్జీలు వసూలు చేస్తున్నాయంటూ ఎప్పటి నుంచో ఆరోపణలు ఉన్నాయి. ఆండ్రాయిడ్, ఐఓఎస్ అనే తేడా మాత్రమే కాకుండా... ఫోన్ రేటు ఆధారంగా ధరల్లో తేడా ఉంటోందని వినియోగదారులు సోషల్ మీడియా వేదికగా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఆరోపణలపై పూర్తి వివరణ ఇవ్వాలని ఉబర్, ఓలా సంస్థలను వినియోగదారుల మంత్రిత్వశాఖ ఆదేశించింది. మరోవైపు ఒకే సర్వీసుకు ఈ రెండు సంస్థలు వేర్వేరు చార్జీలు వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు వచ్చాయి. దీనిపైనా కేంద్ర వినియోగదారుల రక్షణ సంస్థ (సీసీపీఏ) చర్యలకు ఉపక్రమించింది. ఒకే సర్వీసుకు రెండు వేర్వేరు ధరలు ఎలా నిర్ణయిస్తున్నారో వివరణ ఇవ్వాలని ఆదేశించింది. ధరల్లో వ్యత్యాసం ఉన్నట్లు స్పష్టంగా అర్థమవుతోందని సీసీపీఏ పేర్కొంది. చార్జీల విషయంలో నిజాయతీ, పారదర్శకత తీసుకొచ్చేందుకు సరైన వివరణతో రావాలని పేర్కొంది. ఇటీవల దిల్లీకి చెందిన రిషబ్‌సింగ్ అనే వ్యక్తి ఎక్స్‌లో పెట్టిన పోస్టు బాగా వైరల్ అయింది.

రిపబ్లిక్ డే ఏర్పాట్లు ముమ్మరం



న్యూదిల్లీ: గణతంత్ర దినోత్సవాలకు దేశ రాజధాని దిల్లీ ముస్తాబవుతోంది. జనవరి 26న రిపబ్లిక్ డే వేడుకలు నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం ముమ్మర ఏర్పాట్లు చేస్తోంది. భారతదేశ సైనిక బలం గొప్పతనం తెలిసేలా త్రివిధ దళాలు ప్రదర్శన చేయనున్నాయి. వైమానిక ప్రదర్శనలు, సైనికుల కవాతులు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. దేశానికి సంబంధించిన వివిధ సంస్కృతులు అద్దం పట్టేలా వివిధ రాష్ట్రాలకు చెందిన శకటాలను ప్రదర్శించనున్నారు. రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా జన్ భగీదరి థీమ్‌పై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈసారి గణతంత్ర దినోత్సవాలకు ఇండోనేసియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. న్యూదిల్లీ వేదికగా గణతంత్ర దినోత్సవం రోజున భారత సాయుధ బలగాలకు చెందిన కంటెంజెంట్స్‌తోపాటు 160 మంది సభ్యుల కవాతు బృందం, ఇండోనేసియాకు చెందిన 190 మంది సభ్యుల బ్యాండ్ కర్తవ్య మార్గ్‌లో కవాతు చేయనున్నట్లు రక్షణ కార్యదర్శి రాజేశ్ కుమార్ సింగ్ తెలిపారు. ఈ మేరకు కర్తవ్య పథ్‌లో గురువారం ఉదయం ఫుల్ డ్రెస్ రిహార్సల్స్ జరిగాయి. కేంద్ర, రాష్ట్రాలకు చెందిన 31 శకటాలు ఫుల్ డ్రెస్ రిహార్సల్స్‌లో ప్రదర్శన ఇచ్చాయి. సైనిక విన్యాసాలు, కళాకారుల నృత్యాలు చేస్తూ రిహార్సల్స్ చేశారు. ఈ వేడుకల్లో ఏటికొప్పాక బొమ్మల థీమ్‌తో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ శకటం పాల్గొంది. గురువారం మధ్యాహ్నం 12 గంటల వరకూ సెంట్రల్ దిల్లీలో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ఈ ఏడాది 'స్వర్ణిం భారత్: విరాసత్ ఔర్ వికాస్' (బంగారు భారతదేశం: వారసత్వం, పురోగతి) థీమ్ చుట్టూ కేంద్రీకృతమై వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు, కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖలు, విభాగాలకు చెందిన 31 శకటాలు పాల్గొంటాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జాతీయ యుద్ధస్మారక చిహ్నం వద్ద పుష్పగుచ్ఛం ఉంచడంతో కవాతు ప్రారంభమవుతుంది. ఆ తర్వాత మార్చి ఫాస్ట్ సందర్భంగా గౌరవ వందనం స్వీకరించడానికి రాష్ట్రపతి ఉత్సవ బగ్గీలో కర్తవ్య మార్గ్ వద్దకు చేరుకుంటారు. కవాతులో సాయుధ దళాలు, పారామిలిటరీ బలగాలు, సహాయక పౌరబలగాలు, ఎన్సీసీ, ఎన్ఎస్ఎస్ విభాగాలు పాల్గొంటాయి.

మిస్టరీ మరణాలకు అంటువ్యాధి కారణం కాదు: కేంద్రమంత్రి

న్యూదిల్లీ: జమ్మూకశ్మీర్‌లో చోటుచేసుకుంటున్న అంతుచిక్కని మరణాలపై కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ స్పందించారు. ఈ మరణాలకు అంటువ్యాధి కారణం కాదని వెల్లడించారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ జమ్మూకశ్మీర్‌లోని రాజౌరీ జిల్లాలోని బుధాల్ గ్రామంలో నెలన్నర వ్యవధిలో 17 మంది అనూహ్యరీతిలో ప్రాణాలు కోల్పోయారు. 'ఈ మరణాలకు బ్యాక్టీరియా, వైరస్ కారణం కాదని ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది. కొన్ని విషపూరిత పదార్థాలను గుర్తించాం. అవి ఏమిటో నిర్ధారించే దిశగా దర్యాప్తు జరుగుతోంది. ఇతర కోణాలను కూడా వదిలిపెట్టడం లేదు. ఏదైనా కుట్ర ఉందని తేలితే... తగిన చర్యలు తీసుకుంటాం' అని మంత్రి వెల్లడించారు. ఇదిలాఉంటే బుధాల్ గ్రామాన్ని ఇప్పటికే అధికారులు కంటైన్‌మెంట్ జోన్‌గా ప్రకటించారు. ఇకపై గ్రామంలో ఎటువంటి ప్రభుత్వ, ప్రైవేటు సమావేశాలు జరపకూడదని నిషేధాజ్ఞలు జారీ చేశారు. బాధిత కుటుంబాలు, వారి సన్నిహితులు ప్రభుత్వ అధికారులు అందించే ఆహారం మాత్రమే తీసుకోవాలని, వారి ఇళ్లలో ఉన్న ఇతర పదార్థాలు వినియోగించకూడదని హెచ్చరికలు జారీ చేశారు. కేసు దర్యాప్తులో భాగంగా బాధిత కుటుంబాల ఇళ్లలోని ఆహార పదార్థాలను స్వాధీనం చేసుకొని పరీక్షించాలని ప్రభుత్వం ఆదేశించింది. 11 మందితో కూడిన బృందం ఈ మిస్టరీ మరణాలపై దర్యాప్తు చేస్తోంది.

ఆప్ అంటే ఆల్కహాల్ అఫెక్టెడ్ పార్టీ

కాంగ్రెస్ విమర్శలు

న్యూదిల్లీ: అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ, బీజేపీ, కాంగ్రెస్ పార్టీల మధ్య త్రిముఖ పోటీ నెలకొంది. పోలింగ్ గడువు సమీపిస్తున్న తరుణంలో ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ఆయా పార్టీలు తమ వ్యూహాలకు పదును పెడుతున్నాయి. అధికార ఆమ్‌ఆద్మీ పార్టీ లక్ష్యంగా విమర్శలు చేస్తూ ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నాయి. తాజాగా ఆమ్ ఆద్మీ అంటే ఆల్కహాల్ అఫెక్టెడ్ పార్టీ అంటూ ప్రతిపక్ష కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. దిల్లీ అసెంబ్లీ ఎన్నికల వేళ ఏఐసీసీ మీడియా, ప్రచార విభాగం చైర్మన్ పవన్ ఖేరా గురువారం మీడియాతో మాట్లాడారు. 'మద్యం ఆరోగ్యానికి హానికరం అనే విషయం మనందరికీ తెలుసు. మద్యం అలవాటు మనిషిని, అతని కుటుంబాన్ని, సమాజాన్ని నాశనం చేస్తుందని మనందరికీ తెలిసిన విషయమే. కానీ, మద్యం ద్వారా డబ్బు సంపాదించాలనే వ్యసనం కారణంగా కేవలం వ్యక్తి, సమాజం మాత్రమే కాకుండా మొత్తం నగరం కూడా నాశనం అవుతుంది. ఆప్ (ఆల్కహాల్ అఫెక్టెడ్ పార్టీ) మద్యం ద్వారా మొత్తం దిల్లీని ఎలా నాశనం చేసిందో మనం చూశాం. ఇప్పుడు మీకు ఓ ఆడియో క్లిప్ వినిపిస్తాను. వినండి. ఆ ఆడియోలో ఆప్ ఎమ్మెల్యే, ఆ పార్టీకి చెందిన విద్యాశాఖ మంత్రి, ఎక్సైజ్ మంత్రి ఎలా కుంభకోణం చేశారో తెలుస్తోంది. ఆప్ కన్వీనర్ కేజ్రీవాల్ ఓ మాట అన్నారు. తన వద్ద ప్రతి రోగానికి ఔషధం ఉందని. ఔషధం కనిపించలేదు. కానీ మద్యం కుంభకోణం స్పష్టంగా కనిపిస్తోంది. అందులో మొత్తం ప్రభుత్వం మునిగిపోయింది' అని విమర్శలు గుప్పించారు. పవన్ ఖేరా వ్యాఖ్యలు దిల్లీ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి.

ఐదేళ్లలో నిరుద్యోగం రూపుమాపుతా

కేజ్రీవాల్

న్యూదిల్లీ: దేశరాజధాని దిల్లీలో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండటంతో రాజకీయ పార్టీలు ఓటర్లను ఆకర్షించేందుకు నానాతంటాలు పడుతున్నాయి. తాజాగా ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ నిరుద్యోగులను ఆకర్షించేలా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. వచ్చే ఐదేళ్లలో దిల్లీలో నిరుద్యోగ సమస్య లేకుండా చేస్తానని కేజ్రీవాల్ హామీ ఇచ్చారు. ఈమేరకు ఆయన గురువారం ఓ వీడియోను విడుదల చేశారు. 'యువతకు ఉపాధి కల్పించడమే నా ప్రాధాన్యత. నిరుద్యోగ సమస్యను పరిష్కరించేందుకు మా బృందం ఓ ప్రణాళిక రూపొందిస్తోంది. పంజాబ్‌లోని ఆప్ ప్రభుత్వం రెండేళ్లలో 48 వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేసింది. అంతేకాకుండా మూడు లక్షలకు పైగా ప్రైవేటు రంగ ఉద్యోగాలు కల్పించాం. ఉపాధి ఎలా సృష్టించాలో మాకు బాగా తెలుసు. ప్రజల మద్దతుతో మళ్లీ అధికారంలోకి వస్తే ఐదేళ్లలో దిల్లీలో నిరుద్యోగ సమస్య లేకుండా చేస్తా' అని కేజ్రీవాల్ హామీ ఇచ్చారు. కాగా... దేశ రాజధానిలో ఫిబ్రవరి 5న అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. 8న ఫలితాలు వెలువడనున్నాయి. మూడోసారి అధికారం సాధించేందుకు ఆప్ ప్రయత్నిస్తుండగా... ఈ సారి ఎలాగైన ఆప్‌ను గద్దె దించేందుకు కాంగ్రెస్, బీజేపీ తంటాలు పడుతున్నాయి.

రెస్టారెంట్‌లో కత్తి దొంగిలించా

సైఫ్‌పై దాడి నిందితుడి వెల్లడి

ముంబై: బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్‌పై దాడి చేయడానికి వినియోగించిన కత్తిన దుండగుడు హోటల్ నుంచి దొంగిలించినట్లు పోలీసులు గుర్తించారు. నిందితుడు షరిఫుల్ ఫకీర్‌ను విచారించగా ఆసక్తికర విషయాలు బయటపడ్డాయి. దర్యాప్తు బృందం ఇప్పటికే కత్తికి సంబంధించి రెండు ముక్కలను స్వాధీనం చేసుకొంది. ఒకటి సైఫ్ వీపులోనే ఇరుక్కుపోవడంతో డాక్టర్లు శస్త్రచికిత్స చేసి దానిని వెలికి తీశారు. ఇక రెండోది నటుడి ఇంట్లోనే దొరికింది. మూడో ముక్కను తాజాగా పోలీసులు స్వాధీనం చేసుకొన్నారు. దాడి అనంతరం నిందితుడు షరిఫుల్ నడుచుకొంటూ దాదాపు 1.4 కిలోమీటర్లు ప్రయాణించాడు. అక్కడే ఉన్న చిన్న చెరువు వద్ద ఆ మూడో ముక్క పడేసి వెళ్లిపోయాడు. అనంతరం నేషనల్ కాలేజీ వద్ద ఆ రాత్రికి నిద్రపోయాడు. ఉదయం దాదర్ వెళ్లేందుకు రైలు కోసం బాంద్రా స్టేషన్‌కు వెళ్లినట్లు గుర్తించారు. ఇటీవల దర్యాప్తు బృందాలు సైఫ్‌పై దాడికి సంబంధించి సీన్ రిక్రియేషన్ ప్రక్రియ నిర్వహించాయి. అనంతరం నిందితుడిని బాంద్రాలోని చెరువు వద్దకు తీసుకెళ్లగా ఆ ఆయుధాన్ని చూపించాడు. పోలీసులు తాజాగా దానిని సేకరించారు. షరిఫుల్ ఫకీర్ ఈ దాడికి ముందు... తర్వాత ధరించిన దుస్తులను అధికారులు స్వాధీనం చేసుకొన్నారు. వీటిల్లో దాడి వేళ ధరించిన క్యాప్ కూడా ఉంది. దీంతోపాటు ఒక స్కార్ఫ్, కత్తులకు సంబంధించిన కొన్ని భాగాలు గుర్తించారు. వీటిని ఫోరెన్సిక్ ల్యాబ్‌నకు పంపించనున్నట్లు చెప్పారు. దాడికి వాడిన కత్తిని పనిచేసిన రెస్టారెంట్‌లో చోరీ చేసినట్లు నిందితుడు వెల్లడించాడు.

గుర్రంపై దళిత వరుడి ఊరేగింపు

200 మంది పోలీసుల భద్రత

జైపూర్: సుమారు 200 మంది పోలీసుల భద్రత మధ్య దళిత వరుడు గుర్రంపై ఊరేగాడు. కుటుంబ సభ్యులు, బంధువులతో కలసి వధువు గ్రామానికి చేరుకున్నాడు. ఈ వీడియో క్లిప్స్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. దళిత వరుడు గుర్రంపై ఊరేగడాన్ని ఆ గ్రామంలోని ఉన్నత కులాల వారు వ్యతిరేకించారు. దీంతో ఆందోళన చెందిన వధువు తండ్రి పోలీసుల సహాయం కోరాడు. రాజస్థాన్‌లోని అజ్మీర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. దళిత వర్గానికి చెందిన విజయ్ రేగర్‌కు లావెరా గ్రామానికి చెందిన దళిత మహిళ అరుణతో పెళ్లి నిశ్చియమైంది. దళిత వరుడు గుర్రంపై ఊరేగడంపై ఆ గ్రామ అగ్రవర్ణాల వారు వ్యతిరేకించారు. దీంతో వధువు కుటుంబం ఆందోళన చెందింది. దీంతో మానవ్ వికాస్ అవమ్ అధికార్ కేంద్ర సంస్థాన్ కార్యదర్శి రమేశ్ చంద్ బన్సాల్ సహా స్థానిక కార్యకర్తలను వధువు తండ్రి నారాయణ్ కలిశాడు. వారి సహాయంతో జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు లేఖ రాశాడు. అలాగే దళిత వరుడికి భద్రత కోసం పోలీస్ అధికారులను కలిశాడు. మరోవైపు దళిత వధువు కుటుంబం ఆందోళనపై అజ్మీర్ ఎస్పీ స్పందించారు. దళిత వరుడు గుర్రంపై ఊరేగింపు కోసం భద్రత కల్పించాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. దీంతో సుమారు 200 మంది పోలీసులను లావెరా గ్రామంలో మోహరించారు. దళిత వరుడు గుర్రంపై ఊరేగింపు కోసం ముందుగా గ్రామస్తులతో చర్చించారు. ఉన్నత కులాల వారు సానుకూలంగా స్పందించారు.

ఎలాంటి ఇబ్బంది కలిగించబోమని చెప్పారు. అయితే గ్రామంలోని అగ్రవర్ణాలకు ఆగ్రహం కలిగించకుండా ఉండేందుకు డీజే, పటాకులు కాల్చడం వంటి హంగామాకు వధువు కుటుంబం దూరంగా ఉన్నది. మరోవైపు భారీ పోలీసుల భద్రత మధ్య దళిత వరుడు విజయ్ గుర్రంపై ఊరేగిన వీడియో క్లిప్స్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. కుల వివక్షపట్ల నెటిజన్లు మండిపడ్డారు.

కుంభమేళాలో 10 కోట్ల మంది పుణ్యస్నానాలు

ప్రయాగ్‌రాజ్: ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న కుంభమేళాకు దేశ, విదేశాల నుంచి భక్తులు తరలివస్తున్నారు. పుణ్యస్నానాలు ఆచరిస్తున్నారు. ఇప్పటివరకు త్రివేణి సంగమంలో 10 కోట్లకు పైగా భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ప్రకటించింది. గురువారం మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగిన పుణ్యస్నానాలపై ప్రభుత్వం ఓ ప్రకటన విడుదల చేసింది. రోజురోజుకు భక్తుల సంఖ్య పెరుగుతోందని తెలిపింది. ఇప్పటివరకు త్రివేణి సంగమంలో 10 కోట్లకు పైగా భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారని వెల్లడించింది. గురువారం మధ్యాహ్నం వరకు 30 లక్షల మంది పుణ్యస్నానాలు చేసినట్లు తెలిపింది. మకర సంక్రాంతి రోజు దాదాపు 3.5 కోట్ల మంది సంగమంలో స్నానాలు ఆచరించారు. 1.7 కోట్ల మంది పౌష్ పూర్ణిమ వేడుకలో పాల్గొన్నారు. దీంతో పండుగల వేళలో స్నానాల ప్రదేశంలో భక్తుల సంఖ్యపై పరిమితులు విధించింది. మిగిలిన రోజుల్లో ఎలాంటి ఆంక్షలు అమలులో ఉండవు. ఈసారి కుంభమేళాకు 45 కోట్ల మందికి పైగా భక్తులు వస్తారని ప్రభుత్వం అంచనా వేసింది. ఇప్పటివరకు 40 కోట్ల మందికి పైగా భక్తులు వచ్చినట్లు తెలుస్తోంది. జనవరి 13న మొదలైన కుంభమేళా ఫిబ్రవరి 26 వరకు మొత్తంగా 45 రోజుల పాటు జరగనుంది.

విశాలాంధ్ర హైదరాబాద్

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి : మంత్రి కోమటిరెడ్డి

విశాలాంధ్ర - తుర్కయంజాల్ : కాంగ్రెస్ పార్టీతోనే అనివర్గాలకు అభివృద్ధి సాధ్యమని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. గురువారం రంగారెడ్డి జిల్లా ఆదిభట్ల మున్సిపాలిటీలో రూ.25 కోట్లతో ఆదిభట్ల నుండి మంగళపల్లి వరకు చేపట్టనున్న రోడ్డు విస్తరణ పనులకు స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, రోడ్డు డెవలప్మెంట్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, మున్సిపల్ చైర్మన్ మర్రి నిరంజన్ రెడ్డితో కలసి మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం ప్రజాపాలన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాలకు అభివృద్ధి ఫలాలు సాధ్యమని అన్నారు. సంక్షేమ పథకాల విషయంలో ఏ ఒక్కరు అధైర్య పడవద్దని అర్హులైన ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందజేస్తామని పేర్కొన్నారు. ప్రధాన రహదారులతో పాటు గ్రామాల రోడ్లను సైతం అభివృద్ధి చేస్తామని తెలిపారు. సంక్షేమ పథకాల అమలు నిరంతర ప్రక్రియ అని ఇతర పార్టీల అపోహలను ప్రజలు నమ్మవద్దని అన్నారు. కార్యక్రమంలో కమిషనర్ బాలకృష్ణ, ఇబ్రహీంపట్నం చైర్మన్ కప్పరి స్రవంతి, నాయకులు లక్ష్మీపతి గౌడ్, గురునాథ్ రెడ్డి, దానికి కౌన్సిలర్లు, అధికారులు ప్రజలు పాల్గొన్నారు.

మహేశ్వరం జోన్ పోలీస్‌స్టేషన్‌లన్నీ డిజిటలైజషన్

విశాలాంధ్ర - బ్యూరో, మేడ్చల్- మల్కాజిగిరి : రాచకొండ కమిషనరేట్ పరిధిలోని మహేశ్వరం జోన్ అన్ని పోలీస్ స్టేషన్ల కమ్యూనికేషన్ వ్యవస్థను అనలాగ్ నుండి డిజిటల్‌కు మార్చడం జరిగింది. దీని ద్వారా ఇకనుండి కమిషనరేట్ ఆఫీస్ నుండి మహేశ్వరం జోన్ పరిధిలోని 1715 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో మొత్తం 10 లా అండ్ ఆర్డర్ పోలీస్‌స్టేషన్ల అధికారులు, సిబ్బందితో ఎటువంటి అంతరాయం లేకుండా సత్వర సమాచారం అందించడం సాధ్యమవుతుంది. ఈ డిజిటల్ కమ్యూనికేషన్ వ్యవస్థ భారతదేశంలోనే తొలిసారిగా రాచకొండ కమిషనరేట్ పరిధిలోని మహేశ్వరం జోన్లో ప్రవేశపెట్టడం గమనార్హం. ఇందుకోసం ఎటువంటి అదనపు వ్యయం అవసరం లేకుండా అందుబాటులో ఉన్న సాంకేతిక పరికరాల సహాయంతోనే ఈ నూతన డిజిటల్ కమ్యూనికేషన్ వ్యవస్థను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. డిఐజి ఐటీ, కమ్యూనికేషన్ జె.శ్రీనివాసరావు, డీసీపీ స్పెషల్ బ్రాంచ్ జి.నరసింహారెడ్డి, ఎస్పీ ఆర్.జె.సుధాకర్, అదనపు డీసీపీ అడ్మిన్ శివకుమార్, డీఎస్పీ జి.బాబు, డీఎస్పీ జి.శ్రీనివాసులు, ఏసీపీ ఐటి సెల్ నరేందర్ గౌడ్, ఎసిపి సిసిఆర్బి రమేష్, ఇన్‌స్పెక్టర్లు జి.మురళీ కృష్ణారెడ్డి, ఎ.భాను ప్రసాద్, ఎన్.జ్ఞాన సుందరి, సబ్ ఇన్‌స్పెక్టర్లు ఎస్.నరేందర్ రెడ్డి, స్వామిజీ, సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులందరికీ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని మాదాపూర్ వార్డ్ కార్యాలయంలో అధికారుల అధ్యక్షతన మన తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఈనెల 26న ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న అభివృద్ధి పథకాలు, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు అమలు, లబ్దిదారుల ఎంపిక కొరకు ఏర్పాటు చేయనున్న ఇందిరమ్మ సభను శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి జగదీశ్వర్ గౌడ్ పరిశీలించారు. అధికారులు ప్రజలకు అర్థం అయ్యేలా తగు చర్యలు తీసుకుంటూ వారికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా దరఖాస్తుల స్వీకరణ చేయాలసిందిగా సూచించారు. ప్రజలు ఎలాంటి అధైర్యం లేకుండా వారికి ఉన్న సందేహాలను అధికారులను అడిగి నివృత్తి చేసుకోవాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమం గురించి అవగాహన లేని స్థానికులకు, తెలిసినవారు వెళ్లి వారికి తెలియజేసి, అర్హులైన లబ్దిదారులను ఎంచుకునే క్రమంలో ప్రజలు కూడా తమ వంతు సాయం చేయాల్సిందుగా ఆయన కోరారు. మన వార్డ్ వద్దనే ఏర్పాటు చేసినటువంటి కార్యక్రమంలో పాల్గొని, దరఖాస్తులు ఇచ్చి లబ్దిదారులందరు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.

13,861 గ్రామ సభలు పూర్తి

విశాలాంధ్ర - హైదరాబాద్ : రాష్ట్ర వ్యాప్తంగా నేటి వరకు 13,861 గ్రామాలు, వార్డులలో గ్రామ సభలు (85.96 శాతం) పూర్తయ్యాయని ప్రభుత్వం ప్రకటించింది. గ్రామ సభలు ప్రారంభమైన మూడవ రోజైన గురువారం నాడు 3,986 గ్రామ సభలు విజయవంతంగా పూర్తయ్యాయి. ఈ గ్రామ, వార్డు సభలకు పెద్ద ఎత్తున ప్రజలు హాజరై ప్రభుత్వం ప్రారంభించనున్న నాలుగు పథకాలకు సంబంధించి తమ దరఖాస్తులు అందచేశారు. రాష్ట్ర వ్యాప్తంగా నేడు గ్రామ సభలు 3130, వార్డు సభలు 856 నిర్వహించడం జరిగింది. ఈ గ్రామ సభలలో పలువురు రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా సుభాష్‌చంద్రబోస్ జయంతి వేడుకలు

విశాలాంధ్ర - కాప్రా : నేతాజీ సుభాష్ చంద్రబోస్ 128వ జయంతి వేడుకలు నాచారం సైకిల్ పోలో అసోసియేషన్ అధ్యక్షులు పాండురంగం ఆధ్వర్యంలో నాచారంలో ఘనంగా నిర్వహించడం జరిగింది, ఈ కార్యక్రమంలో ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు శిల్పారెడ్డి ముఖ్య అతిధిలుగా హాజరై పూలమాలల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా సుభాష్ రెడ్డి మాట్లాడుతూ నేతాజీ నిజమైన దేశ భక్తుల్లో ఒకరని, ప్రత్యేక సైన్యం తయారు చేసుకొని బ్రిటీష్ వాళ్ళ గుండెల్లో భయం నెలకొల్పిన గొప్ప నాయకులు అని కొనియాడారు. కార్యక్రమంలో నాచారం బీజేవైఎం నాయకులు విగ్రహ కమిటీ అధ్యక్షులు అభిషేక్ గౌడ్ పిలుపు మేరకు తెలుగుదేశం పార్టీ మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఇంచార్జ్ నంది కంటి అశోక్ కుమార్ గౌడ్, బిఆర్ఎస్ గ్రేటర్ నాయకులు సాయిజన్‌శేఖర్, బిజెపి నాయకులు ప్రకాష్, కొత్త డివిజన్ బిజెపి అధ్యక్షులు నవీన్, జిల్లా బిజెపి కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు రాగిరి మోహన్ రెడ్డి, బిజెపి సీనియర్ నాయకులు బేక్కరి రవీందర్ రెడ్డి, కాటిపల్లి రవీందర్ రెడ్డి, అనిత పద్మ రెడ్డి, అంజి, వరలక్ష్మి, ప్రతాప్ రెడ్డి, దయాగౌడ్, ఓరుగంటి వెంకటేష్ గౌడ్, ఉదయ్ కిరణ్ రెడ్డి, పాదం వెంకటేష్, సాయి గౌడ్, శేఖర్ బాలకృష్ణ, మూల వెంకటేష్, వెంకటేశ్వర్లు, బ్యాంకు వెంకటేష్, ప్రవీణ్, నిత్య, బాలు, నవీన్, చారీ, బాలరాజ్, శ్రీకాంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

లెండి ప్రాజెక్ట్‌పై తెలంగాణ దృష్టి

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో నాందేడ్ యంపీ భేటీ

విశాలాంధ్ర - హైదరాబాద్ : మహారాష్ట్ర-తెలంగాణా రాష్ట్రాల మధ్యన ఉన్న లెండి ప్రాజెక్ట్ నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసేందుకు తెలంగాణా రాష్ట్రం ప్రత్యేక దృష్టి సారించిందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఉదయం మహారాష్ట్ర నాందేడ్ కు చెందిన కాంగ్రెస్ పార్టీ యంపి రవీంద్ర చవాన్, మాజీ యంఎల్ఏ హనుమంత్ రావు పాటిల్, సురేష్ పండిత్ వార్, సుభాష్ బాద్, వాకిడిష్వార్, దినేష్ అవాజ్, సందీప్ పాటిల్ తదితర మహారాష్ట్ర కాంగ్రెస్ ప్రతినిధుల బృందం రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డిని కలసి లెండి భారీ ప్రాజెక్ట్ పూర్తి చేసే అంశంపై సమీక్ష నిర్వహించారు. అనంతరం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ 1984 ప్రాంతంలో 2183.88 కోట్ల అంచనా వ్యయంతో మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా ముఖేడ్ తాలూకా వద్ద ప్రారంభించిన లెండి భారీ ప్రాజెక్ట్ పూర్తి అయితే తెలంగాణా రాష్ట్రంలో 38573.15 ఎకరాలు, మహారాష్ట్రలో 27710.397 ఎకరాలు సేద్యంలోకి వస్తుందన్నారు. ఇప్పటి వరకు రెండు రాష్ట్రాల ఒప్పందం ప్రకారం అటు మహారాష్ట్ర ఇటు తెలంగాణా రాష్ట్రాలు ఈ ప్రాజెక్ట్‌పై 1040.87 కోట్ల ఖర్చు చేసి ఎర్తేన్ డ్యామ్ వర్క్ 70శాతం, స్పిల్ వే 80శాతం పూర్తి కాగా కాలువల నిర్మాణాలు పురోగతిలో ఉన్నాయని ఆయన తెలిపారు. భూ అంతర్భాగం నుండి పైపులా ద్వారా నీటి సరఫరాకు సంబంధించిన ప్రతిపాద నలు సిద్ధం చేసినట్లు ఆయన వెల్లడించారు.

అయితే కాలక్రమంలో భూనిర్వాసితులు అడ్డు పడడంతో 2011లో అర్ధాంతరంగా నిలిపివేయబడిన పనులను తిరిగి పునరుద్ధరుంచడంతో నది గర్భంలోని మట్టి పనులను పూర్తి చేసే విధంగా ప్రణాళికలు రూపొందించుకుంటున్నట్లు ఆయన తెలిపారు. రెండు రాష్ట్రాల ఒప్పందంలో భాగంగా వచ్చే యాడాది చివరి నాటికి పూర్తి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

విష్ణుపురి ఎక్స్‌టెన్షన్‌లో ఎమ్మెల్యే మర్రి పర్యటన

విశాలాంధ్ర - మల్కాజిగిరి : ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి చొరవతో విష్ణుపురి ఎక్స్‌టెన్షన్‌లో ఒక కోటి అయిదు లక్షల వ్యయంతో బాక్స్ డ్రైన్ త్వరలోనే ఏర్పాటు కానున్న సందర్భంగా అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత సంవత్సర కాలంగా నియోజకవర్గ పరిధిలోని జరగవలసిన అభివృద్ధి పనులను మంజూరు చేయించాలని ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించామని, దాని ఫలితంగానే ఇప్పుడు కోటి అయిదు లక్షల బాక్స్ డ్రైన్ పనులు జరుతున్నాయని, ఇకపై అన్ని పనులను ప్రారంభించుకునే విధంగా ప్రణాళికతో ముందుకు సాగుతామని, ప్రభుత్వంలో నిధుల కొరతతో పనుల్లో జాప్యం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ డిఈ. మహేష్. మాజీ కార్పొరేటర్ నిరుగొండ జగదీష్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, మురుగేష్, సతీష్, రాములు, రవీందర్, వేణు యాదవ్, శ్రీకాంత్, సురేష్ యాదవ్ శ్రీనివాస్ యాదవ్, నాగరాజు, వి.వీ.ఎస్.ఎన్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో నగరాన్ని అభివృద్ధి చేయాలి

స్టాండింగ్ కమిటీలో 13 అంశాలకు కమిటీ ఆమోదం

విశాలాంధ్ర - హైదరాబాద్ : నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధ్యక్షతన గురువారం 7వ స్టాండింగ్ కమిటీ సమావేశం జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో జరిగింది. కమిటీ సమావేశంలో 10 అంశాలు, మూడు టేబుల్ ఐటమ్‌లకు సభ్యులు ఆమోదించినట్లు మేయర్ తెలిపారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ కార్పొరేటర్లు, అధికారులు సమన్వయంతో పనిచేసి, నగరాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తూ ప్రజలకు మరింత మెరుగైన సౌకర్యాలు అందించాలని మేయర్ కోరారు.

ఆమోదించిన అంశాలు...

గుల్మొహర్ పార్కు జంక్షన్ నుండి వయ తారా నగర్ మీదుగా బి.హెచ్.ఇ.ఎల్ జంక్షన్ వరకు మరియు రైల్వే క్రాసింగ్ లింగంపల్లి నుండి 1100 మీటర్ల పొడవు రోడ్డు విద్యాణికేతన్ స్కూల్ నుండి గల్మోహర్ జంక్షన్ వరకు 30 మీటర్లు, 36 మీటర్ల వెడల్పుతో రోడ్డు విస్తరణ 227 ఆస్తుల సేకరణకు ప్రభుత్వ అనుమతి కోసం కార్పొరేషన్ ద్వారా సిఫార్సు చేస్తూ కమిటీ ఆమోదం చేసారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు నేషనల్ హైవే 44 పైనా ఆరు లేన్ల గ్రేడ్ సపరేటర్‌కు డాక్టర్ మన్మోహన్‌సింగ్ ఎక్స్‌ప్రెస్‌వేగా నామకరణం చేయుటకు కమిషనర్ యాక్షన్ తీసుకొనుటకు ప్రభుత్వం కార్పొరేషన్ కు సిఫార్సును కమిటీ ఆమోదించింది. కేబీఆర్ పార్కు పరిసర ఎంట్రన్స్ పాయింట్స్ వద్ద ఫైబర్, సిమెంట్ కుండిలతో పూల మొక్కల తో గ్రీనరీ కోసం సి.ఎస్.ఆర్ పద్ధతిన ఏర్పాటు చేసి నిర్వహించుటకు మెస్సర్స్ క్రియేటివ్ థాట్స్ మీడియా హైదరాబాద్ వారికి మూడేళ్ల పాటు నిర్వహించుటకు ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ ఎం.ఓ.యు చేయుటకు కమిటీ ఆమోదం చేసింది. చార్మినార్, ఖైరతాబాద్, కూకట్ పల్లి, శేరిలింగంపల్లి జోన్లలో 2025 సంవత్సరానికి గాను ఆరు డి-సిల్టింగ్ పనుల కోసం రూ.మొత్తం 2231.75 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న 6 డి సిల్టింగ్ పనులలో చార్మినార్ జోన్‌లలో 1233 లక్షలతో 3 పనులు చార్మినార్ జోన్‌లో, ఖైరతాబాద్ జోన్‌లో 379.15 లక్షల వ్యయంతో అదేవిధంగా కూకట్ పల్లి జోన్‌లో 315. లక్షలు శేరిలింగంపల్లి జోన్‌లో 305 లక్షల వ్యయంతో చేపట్టేందుకు పరిపాలన అనుమతితో పాటు టెండర్ పిలువడానికి ఆలస్య నివారణకు రాటిఫికేషన్ కమిటీ ఆమోదం చేసింది. చార్మినార్, ఖైరతాబాద్, సికింద్రాబాద్ జోన్లలో 2025 సంవత్సరానికి గాను మూడు డి-సిల్టింగ్ పనుల కోసం రూ. 697.85 లక్షలలో ఒక పని చార్మినార్ జోన్‌లో 229. 95 లక్షలు ఖైరతాబాద్ జోన్‌లో 264.30 లక్షలు సికింద్రబాద్ జోన్‌లో 203.60 లక్షల చేపట్టే డిసిల్టింగ్ పనులకు పరిపాలన అనుమతితో పాటు ఈ ప్రొక్యూర్మెంట్ ద్వారా టెండర్ వేయుటకు కమిటీ ఆమోదం చేసారు. (ఎ) గతంలో సి.ఆర్.ఎం.పి ఫేజ్ - 1 కింద చేపట్టిన పనులకు కొనసాగింపుగా సి.ఆర్.ఎం.పి ఫేజ్-2 కింద 744.22 కిలోమీటర్ల రోడ్డు నిర్వహణ కోసం జోన్ వైస్ ప్యాకేజీలతో 2025 నుండి 2030 కాలానికి ఐదు సంవత్సరాల పాటు రూ. 2491 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదించిన పనులు చేపట్టడానికి గతంలో ఉన్న టెర్మ్స్ అండ్ కండిషన్ ప్రకారంగా బడ్జెట్ కేటాయింపు కోరుట (లేదా) (బి) సి.ఆర్.ఎం.పి ఫేజ్-2 కింద 2025-30 ఐదు సంవత్సరాల కాలానికి రూ. 3828 కోట్ల అంచనా వ్యయంతో 1142.54 కిలోమీటర్ల కొత్త రోడ్ల అభివృద్ధి కోసం పరిపాలన అనుమతితో పాటు టెండర్ ప్రాసెస్ చేయుటకు కార్పొరేషన్ ద్వారా ప్రభుత్వానికి సిఫార్సు చేయుటకు కమిటీ ఆమోదించింది. లాలాపేట్ ఫ్లైఓవర్ నుండి మౌలాలి ఫ్లైఓవర్ వరకు 100 ఫీట్ల రోడ్డు విస్తరణ కొరకు మంజూరైన రూ.3 కోట్లకు అదనంగా అయిన రూ.1.30 కోట్లకు రివైజ్డ్ పరిపాలన అనుమతికి కమిటీ ఆమోదం చేసింది. హైదరాబాద్ ఇన్నోవేటివ్ ట్రాన్స్ఫర్మేటివ్ ఇన్ఫ్రా స్ట్రక్చర్ (హెచ్-సిటీ) కింద ఫ్లైఓవర్, అండర్ పాస్ నిర్మాణాలకు 7032 కోట్ల వ్యయంతో చేపట్టే పనుల కోసం ప్రభుత్వ ఆమోదం కోసం సిఫార్సుకు కమిటీ ఆమోదం అందులో (ఎ) ప్యాకేజీ 1 ద్వారా జూబ్లీహిల్స్ చెక్ పోస్ట్ జంక్షన్ కేబీఆర్ పార్కు ఎంట్రెన్స్ జంక్షన్, ముగ్దా జంక్షన్ వద్ద స్టీల్ ఫ్లైఓవర్, అండర్ పాస్ నిర్మాణానికి రూ. 580 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టడానికి ప్రతిపాదించడ మైనది. ఎం.జె మార్కెట్ నుంచి భూలక్ష్మి దేవాలయం (ముస్లిం జంగ్ బ్రిడ్జి) వయా మాలకుంట బేగం బజార్ రోడ్డు వరకు 30 మీటర్ల వెడల్పుతో అభివృద్ధి చేయుటకు కమిటీ ఆమోదం చేసారు. కమిషనర్ ఇలంబర్తి, స్టాండింగ్ కమిటీ సభ్యులు బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్, ఫాహెద్ బిన్ అబ్దుల్ సమద్ బిన్ అబ్దత్, పొడవు అర్చన, మహమ్మద్ నజీర్ ఉద్దీన్, గౌస్ ఉద్దీన్ మహమ్మద్, మన్నె కవితా రెడ్డి, మహమ్మద్ రషీద్ ఫరాజుద్దీన్, ఉప్పలపాటి శ్రీకాంత్, సబీహా బేగం, ఆవుల రవీందర్ రెడ్డి, చింతల విజయ్ శాంతి, కంది శైలజ, అడిషనల్ కమిషనర్లు శివ కుమార్ నాయుడు, నళిని పద్మావతి, గీతా రాధిక, చంద్రకాంత్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, సత్యనారాయణ, సుభద్రాదేవి పాల్గొన్నారు.

రజకులను అణగారిన వర్గాలుగా గుర్తించాలి

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి

విశాలాంధ్ర - హైదరాబాద్ : రాష్ట్రంలో ఉన్న రజకులను అణగారిన వర్గాలుగా గుర్తించాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్ రెడ్డి డిమాండ్ చేసారు. రజకులు ఆర్థిక, సామజిక, రాజకీయంగా ఎదిగేందుకు రాష్ట్ర ప్రభుత్వం తగు చెర్యలు తీసుకోవాలని అయన విజ్ఞప్తి చేసారు. వాషెర్మాన్ ఫెడరేషన్ ను తగినన్ని నిధులు కేటాయించి, ఆధునిక సాంకేతికతను జోడిస్తూ రజక వృత్తిదారులకు ఆదుకోవాలని కోరారు. హైదరాబాద్, హిమాయత్ నగర్, అమృత ఎస్టేట్స్, టిజి వృత్తిదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర కార్యాలయంలో గురువారం తెలంగాణ రాష్ట్ర రజక వృత్తిదారుల సమాఖ్య రూపొందించిన 2025 నూతన సంవత్సర కేలండర్‌ను తెలంగాణ రాష్ట్ర వృత్తి సంఘాల సమాఖ్య అధ్యక్షులు బొమ్మగాని ప్రభాకర్, రజక వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, బొద్దుపల్లి కృష్ణ, ఉపాధ్యక్షులు పగిళ్ల జోజి, కార్యదర్శి గోరుకంటి కృష్ణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దండు నిరంజన్, ఉడుతల మల్లేష్ లతో కలసి చాడ వెంకట్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రజకులు దేశంలో 18 రాష్ట్రాలలో, రెండు కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఎస్సి జాబితాలో ఉన్నారని, తెలంగాణలో రజకులని ఎస్సీ జాబితాలో చేర్చాలని అన్నారు. రజక ఫెడరేషన్‌కు పాలకమండలి ఏర్పాటు చేసి, రాష్ట్రంలో ఉన్న రజక జనాభా ప్రతిపాదికన బడ్జెట్ కేటాయింపులు చేసి దోబీగాట్లను ఆధునీకరించి, మౌలిక వసతులు కల్పించాలని అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో కీలక పాత్ర పోషించిన వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహాన్ని హైదరాబాద్ ట్యాంక్ బండ్‌పై ఏర్పాటు చేయాలనీ రాష్ట్ర ప్రభుత్వాన్ని చాడ వెంకట్ రెడ్డి విజ్ఞప్తి చేసారు. బొమ్మగాని ప్రభాకర్ మాట్లాడుతూ చేతి వృత్తులు ప్రాచీన వృత్తులని, గ్రామీణ జీవనంలో మమేకమై అభివృద్ధిలో భాగస్వామ్యం అయ్యాయని తెలిపారు. 55 సంవత్సరాల నిండిన రజకులకు 4000 రూపాయలు పెన్షన్ మంజూరు చేయాలని, రజకులకు ప్రస్తుతం కొనసాగిస్తున్న 250 యూనిట్ల ఉచిత విద్యుత్‌ని 500 యూనిట్లకి పెంచాలని బొమ్మగాని ప్రభాకర్ డిమాండ్ చేసారు.

అరవింద్ కేజ్రీవాల్‌పై రాళ్ల దాడిపై ఆగ్రహం

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌పై బీజేపీ గుండాలు రాళ్ల దాడి చేయడం పై ఆప్ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ ఆగ్రహం వ్యక్తం చేసారు. శనివారం అరవింద్ కేజ్రీవాల్ ఢిల్లీలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తుండగా బీజేపీ నేత పర్వేశ్ వర్మకు చెందిన కొందరు గుండాలు అరవింద్ కేజ్రీవాల్ కాన్వాయ్‌పై రాళ్ళూ రువ్వారని తెలిపారు. కారు అద్దాలు పగలగా, అదృష్టవశాత్తూ అరవింద్ కేజ్రీవాల్‌కు ఎలాంటి గాయాలు కాలేదని చెప్పారు. దేశ రాజధాని ఢిల్లీ ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ బీజేపీకి భయం పట్టుకొని ఆప్ ప్రచారాన్ని అడ్డుకునేందుకు ఇలానే నీచమైన దాడులకు పాల్పడుతుందని మండిపడ్డారు. బీజేపీ పిరికిపంద చేర్యాలకు అరవింద్ కేజ్రీవాల్ భయపడరని, ఢిల్లీ ప్రజలు ఆప్ వెంటనే ఉన్నారని ఈ అసెంబ్లీ ఎన్నికల్లో తగిన బుద్ధి చెపుతారని అన్నారు. అరవింద్ కేజ్రీవాల్‌పై బీజేపీ గుండాల రాళ్ల దాడిని తీవ్రంగా ఖండిస్తూ ఆప్‌ను గద్దె దించడానికి బీజేపీ కాంగ్రెస్‌లు ఎన్ని విశ్వప్రయత్నాలు చేసిన ఢిల్లీ ప్రజల సంక్షేమం, అభిరుద్ధికి యెనలేని కృషి చేసిన ఆప్ కె మళ్ళీ పట్టం కడుతారని డాక్టర్ దిడ్డి సుధాకర్ ధీమా వ్యక్తం చేసారు.

ప్రభుత్వాసుపత్రుల్లో సమస్యలను పరిష్కరించాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేట్, కార్పొరేట్ మెడికల్ మాఫియా దందాను అరికట్టాలని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) ఆధ్వర్యంలో కోఠిలోని డైరెక్టరేట్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ కార్యాలయ ముట్టడి కార్యక్రమం నిర్వహించారు. ధర్నా నిర్వహించి, కార్యాలయంలోకి చొచ్చుకెళ్తున్న నేపధ్యంలో పోలీసుల అడ్డుకుని అక్రమంగా అరెస్ట్ చేసి సుల్తాన్ బజార్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె. ధర్మేంద్ర, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్‌లు మాట్లాడుతూ ప్రజల ప్రాణాలతో వ్యాపారం చేస్తున్న ఆస్పత్రులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్యం పట్ల నిర్లక్ష్య ధోరణి కనబరుస్తున్నదని వాపోయారు. రాష్ట్రంలో ప్రైవేట్, కార్పొరేట్ ఆగడాలను అరికట్టడంలో పూర్తిగా విఫలం చెందారని ధ్వజమెత్తారు. ఇదే అదునుగా ప్రైవేట్ ఆసుపత్రులు తమ వికృత వ్యాపార మెడికల్ దందాకు తెరలేపిందని, ఈ నేపథ్యంలో ఇటీవల కాలంలో కిడ్నీ అక్రమ మార్పిడిలు, చర్మ సంబంధిత సర్జరీలు, బ్లడ్ అక్రమ దందాలు, నకిలీ డాక్టర్ల సేవలు, ప్రైవేట్ డయాగ్నోస్టిక్ సెంటర్ల విచ్చలవిడి దోపిడీలు తారాస్థాయికి చేరాయని వారు ఆరోపించారు. రాష్ట్రంలో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు కాసుల కక్కుర్తికి అలవాటు పడి మామూళ్ల మత్తులో మునిగి తేలుతున్నారని ధ్వజమెత్తారు. అందుకే ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రులపై చర్యలు తీసుకోవడంలో మీనమేషాలు లెక్కిస్తున్నారని ఎద్దేవా చేశారు. డయాగ్నొస్టిక్ సెంటర్లు, ప్రైవేట్ ఆసుపత్రి యాజమాన్యాల మధ్య లోపాయికారి ఒప్పందం చేసుకొని కమిషన్లకు కక్కుర్తి పడి సామాన్య జనాల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని ఆరోపించారు. అదే విధంగా రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో మెరుగైన వైద్య సదుపాయాలను మరింతగా వేగవంతం చేయాలని, ఆసుపత్రులలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, అన్ని ఆసుపత్రులలో అన్ని రకాల మందుల కొరత లేకుండా అందించాలని వారు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక విభాగం ఏర్పాటు ద్వారా రాష్ట్ర మంతటా ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రిలపై దాడులు చేపట్టాలని, అనుమతులు లేకుండా నడుస్తున్న వాటిపై క్రిమినల్ చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు.లేని పక్షంలో ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున పోరాటాలకు పిలుపు ఇస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి.సత్య ప్రసాద్, శ్రీమాన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు షేక్ మహమూద్, పి.శివ కుమార్, మజీద్ అలీఖాన్, మధు, కళ్యాణ్, అనీల్ కుమార్, శేఖర్, వీరేశ్, భాను, సంజయ్, నగేష్, శివ కుమార్, జెట్టి శ్రీనివాస్, వంశీ, గణేష్‌లతో పాటు 20 మంది పాల్గొన్నారు.

నాలల విస్తరణ పనులపై సమీక్ష

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని పలు డివిజన్లలో హెచ్‌సీఐటీఐ, ఎస్ఎన్‌డీపీ ఫేస్-2 లో భాగంగా మంజూరైన నాలల విస్తరణ పనులపై శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయంలో జరిగిన సమీక్షా సమావేశంలో గౌరవ జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి, ఎస్ఎన్‌డీపీ విభాగం సీఈ కోటేశ్వరరావు, ఎస్ఎన్‌డీపీ విభాగం అధికారులు, జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులతో పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్ఎన్‌డీపీ ఫేస్ 2లో శేరిలింగంపల్లి నియోజకవర్గంలో రూ.79 కోట్ల 58 లక్షల అంచనా వ్యయంతో నాలల విస్తరణ పనులు చేపట్టడంతో ఎన్నో ఏండ్ల వరద ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటున్నామని, నాలల విస్తరణ పనులతో లోతట్టు, ముంపు ప్రాంతాలకు ఉపశమనం లభించింది అని ప్రజా అవసరాల దృష్ట్యా ప్రథమ ప్రధాన్యతలో విస్తరణ పనులు చేపట్టాలని, నాలల విస్తరణ పనులలో వేగం పెంచాలని, యుద్ధప్రాతిపదికన పనులుప్రారంభించాలని, అధికారులకు తెలియచేశారు.

పాఠశాలల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేయాలి : ఎమ్మెల్యే

విశాలాంధ్ర-దుండిగల్: పాఠశాలల సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని ఎమ్మెల్యే కేపీ వివేకానంద పేర్కొన్నారు. ఇటీవల టిఆర్ఎస్ఎంఎ రాష్ట్ర నూతన అధ్యక్షులుగా నియమితులైన జగద్గిరిగుట్ట చైతన్య విద్యానికేతన్ కరస్పాండెంట్ శివరాత్రి యాదగిరి గురువారం నియోజకవర్గం పేట్ బషీరాబాద్‌లోని ఎమ్మెల్యే కేపీ వివేకానందని ఆయన క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఫిబ్రవరి 4వ తేదీ నుంచి నిర్వహించనున్న మండల స్థాయి స్పోర్ట్స్ మీట్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆహ్వానిస్తూ ఆహ్వాన పత్రిక అందజేశారు. ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్ మెంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులుగా నియమితులైన శివరాత్రి యాదగిరికి శుభాకాంక్షలు తెలిపారు. ట్రస్మా జిల్లా కోశాధికారి పరశురాం గౌడ్, కుత్బుల్లాపూర్ ట్రస్మా అధ్యక్షులు శ్రీనివాస్, సెక్రటరీ తిరుపతిరెడ్డి, అసోసియేషన్ సభ్యులు నర్సిరెడ్డి, వనజ, అశోక్, ఛాయా, ప్రవీణ్, కుమార్, బలవంత్, శకుంతల తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నారా లోకేష్ పుట్టిన రోజు వేడుకలు

విశాలాంధ్ర- హైదరాబాద్ : ఎన్‌టిఆర్ భవన్‌లో తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ మంత్రివర్యులు నారా లోకేష్ పుట్టిన రోజు కార్యక్రమాన్ని తెలంగాణ తెలుగుదేశం పార్టీ గురువారం ఘనంగా నిర్వహించింది. ఈ సందర్భంగా కేక్‌ను కట్ చేసి తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తమ శుభాకాంక్షలను తెలియజేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న పొలిట్‌బ్యూరో సభ్యులు, జాతీయ పార్టీ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు మాట్లాడుతూ పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు, ఆనాటి వైసీపీ ప్రభుత్వ ముఖ్యమంత్రి ప్రశ్నిస్తున్న వారిపై దుర్మార్గపు చర్యలు తీసుకుంటున్నప్పటికీ నారా లోకేష్ గారు ధైర్యంగా యువగళ పాదయాత్రను చేపట్టి ప్రజల నుంచి అనూహ్య స్పందనను పొందడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ఇప్పటి వరకు రూ. 8 కోట్ల 60 లక్ష ఆర్థిక సహాయాన్ని అందించడం జరిగిందని అన్నారు. సభ్యత్వ నమోదు చేసుకున్న కార్యకర్తలు ప్రమాదవశాత్తు మరణిస్తే వారికి గతంలో ఉన్న రూ.2 లక్షల ఇన్సూరెన్స్‌ను ప్రస్తుతం రూ.5 లక్షలకు పెంచడం జరిగింది. ప్రమాదవశాత్తు మరణించిన 515 మంది కార్యకర్తలకు రూ.2 లక్షల చొప్పున రూ.10 కోట్లను ఇన్సూరెన్స్ ద్వారా చెల్లించడం జరిగింది. లోకేష్ పుట్టిన రోజు వేడుకలను పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు జరుపుతున్నారని, అన్నదానం వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నారన్నారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు అజ్మీరా రాజునాయక్, గద్దె పద్మావతి, జీవిజి నాయుడు, నెల్లూరి దుర్గాప్రసాద్, మీడియా కమిటీ చైర్మన్ ప్రకాశ్ రెడ్డి, సూర్యదేవర లత, వెలివెల దుర్గారావు, కుర్రా ధనలక్ష్మి, వేజెండ్ల కిషోర్, రాఘవులు పాల్గొన్నారు.

మల్కాజిగిరిలో : తెలుగు దేశం పార్టీ జాతీయ కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ ఐటీ మంత్రి నారా లోకేష్ 42వ జన్మదినాన్ని పురస్కరించుకుని మల్కాజిగిరి సఫిల్ గూడలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద చింతల నరేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ పొగాకు జైరాం చందర్ హాజరై ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు సమర్పించి, ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం, డాక్టర్ పొగాకు జైరాం చందర్ గారు కేక్ కట్ చేసి, నారా లోకేష్ కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ తెలుగు ప్రజల హక్కుల కోసం నిరంతరం పోరాడిన మహానేత అని ఆయన ఆశయాలను నారా లోకేష్ నేటి తరానికి అందిస్తూ, అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్తున్నారని అభిప్రాయపడ్డారు.

అర్హత లేకపోయినా...

అందలమెక్కాలనే ప్రయత్నం...!

డిప్యూటేషన్‌పై వచ్చి ఏళ్ళు గడిచినా జిహెచ్‌ఎంసిని వదలని వైనం

చీఫ్ ఎంటమాలజిస్టు పోస్ట్ కోసం మంత్రులకే లక్షలు ఆఫర్ చేసినట్లు ప్రచారం...?

విశాలాంధ్ర - హైదరాబాద్ : గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ పరిధిలో పని చేస్తున్న కొంత మంది సీనియర్ ఎంటమాలజిస్టులు గ్రేటర్ మున్సిపాలిటీని శాసిస్తూ వీడని పరిస్థితి నెలకొం టుంది. డిప్యూటేషన్‌పై వచ్చి 6 ఏళ్ళకు పైగా అవుతున్నా జిహెచ్‌ఎంసి అధికారులు ఏవిధంగా వీరితో పనులు చేయించు కున్నారనే విమర్శలు చోటు చేసుకుంటు న్నాయి. డిప్యూటేషన్‌పై వచ్చిన సిబ్బంది 5 ఏళ్ళు పూర్తి కాగానే తమ మాతృ సంస్థలకు వెళ్ళాల్సి ఉన్నా, వీరు వెళ్ళని పరిస్థితి నెలకొంటుంది. జిహెచ్‌ఎంసి అధికారులు కూడ డిప్యూటేషన్ సమయం పూర్తి అయినా ఏళ్ళ తరబడి వీరినే ఎందుకు కొనసాగి స్తున్నారనే సందేహం పలువురిలో వ్యక్తం అవుతోంది. గ్రేటర్‌లో చీఫ్ ఎంటమాలజీస్ట్ పదవీ విరమణ చేయడంతో ఈ పోస్ట్ కోసం అర్హత లేని సీనియర్ ఎంటమాలజిస్టులు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. ఏకంగా ఇద్దరు మంత్రులతో పాటు మేయర్‌తో ప్రయత్నాలు కొనసాగిస్తున్నారనే ప్రచారం సాగుతోంది. ఈ సీనియర్ ఎంటమాలజిస్టు మంత్రులకు రూ. 25 లక్షల పైనే ఆఫర్ ఇచ్చినట్లు ఎంటమాలజీ విభాగంలో గుసగుసలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వంలో అవినీతికి ఆస్కారం లేదనే కాంగ్రెస్ మంత్రులు ఈ సీనియర్ ఎంటమాలజిస్టు ఆఫర్‌ను ఏ విధంగా సమర్థిస్తారో చూడాలనే ఆలోచనలో ఎంటమాలజీ సిబ్బంది వేచి చూస్తున్నారు. ఎంటమాలజీ విభాగంలో పని చేస్తున్న ఈ సీనియర్ ఎంటమాలజిస్టుపై ఎల్‌బినగర్ జోన్‌లో అనేక అవినీతి ఆరోపణలు ఉన్నాయనే ఆరోపణలున్నాయి. అయినా ఆ అధికారిపై ఉన్నతా ధికారులు దృష్టి సారించని పరిస్థితి నెలకొందనే విమర్శలు వెళ్ళువెత్తాయి. ఖైరతాబాద్‌లో పరిస్థితి అదే విధంగా ఉందనే ఆరోపణలున్నాయి. ఈ అధికారి వైద్య శాఖలో జిల్లా మలేరియా అధికారిగా (డిఎంఓ) పని చేయాల్సి ఉన్నప్పటికికి డిఎంఓ కంటే తక్కువ స్థాయిలో ఉన్న సీనియర్ ఎంటమాలజిస్టు పోస్ట్‌లో పని చేయడానికి ఎందుకు ఉత్సాహం చూపుతు న్నారనే సందేహం పలువురిలో వ్యక్తం అవుతోంది. క్రింది స్థాయి పోస్టులో పనిచేస్తున్న ఆ అధికారి ఏకంగా చీఫ్ ఎంటమాలజిస్టు పోస్టుకే టార్గెట్ పెట్టి తన స్థాయి కల్గిన అధికారులను జిహెచ్‌ఎంసిలో ఏ జోన్‌లో కూడ పని చేయకుండా చేస్తున్నారనే ఆరోపణలు చోటు చేసుకుంటున్నాయి. ఎల్‌బి నగర్‌లో పనిచేసిన సీనియర్ ఎంటమాలజీస్టుపై అనేక అరోపణలు సృష్టించి అతన్ని అక్కడి నుండి పంపించడంతో పాటు మళ్ళీ అదే జోన్‌కు సీనియర్ ఎంటమాజిస్టుగా రావాడం అందరిని ఆశ్చర్యా నికి గురి చేసిందని ఎంటమాలజీ విభాగం సిబ్బంది చర్చించుకోవడం గమనార్హం. అంతేకకా కూకట్‌పల్లి జోన్‌లో పని చేసిన సీనియర్ ఎంటమాలజీస్టును సైతం ట్రాప్‌లో వేసి తనను కూడ అవినీతి అక్రమాల ఆరోపణలో ఇరికించి ఇక్కడ పని చేయకుండా చేసినట్లు ప్రచారంలో ఉంది. తన స్థాయి పోస్ట్ ఉన్న వారు ఎవరు లేకపోతే తానే చీఫ్ ఎంటమాలజిస్టు కావాలనే ఆలోచనతో ఈ విధమైన చర్యలకు పూసుకుంటుం దనే విమర్శలున్నాయి. రంగారెడ్డి డిఎంఓగా పని చేయాల్సిన ఈ అధికారులు నగరాన్ని అనుకుని ఉన్న రంగారెడ్డి జిల్లాలో పని చేయకుండా జిహెచ్‌ఎంసికే ఎందుకు ప్రధాన్యతను ఇస్తున్నారనే సందేహం పలువురి లో వ్యక్తం అవుతోంది. మరో విషయం ఏమంటే ఈ అధికారి స్పౌస్ కోటలో ఇక్కడ పోస్టు తీసుకున్నట్లు తెలిసింది. ఆ కోట హైదరాబాద్ వర్తించదని, ఆ కోట వేరే జిల్లాకు వర్తిస్తుందని పలవురు అభిప్రాయపడుతు న్నారు. ఏ విధంగా చూసినా కూడ తనకు అర్హత లేదనే విషయం తెలిసి తన స్థాయి క్యాడర్ సిబ్బంది తన చుట్టు ఉండరాదనే అక్కసుతో జిహెచ్‌ఎంసికి వచ్చిన వారిపై లేని విషయాలను అంటగడుతూ దొంగే దొంగ దొంగా అన్న సామెతను గుర్తు చేసేలా వ్యవరిస్తున్నారని పలువురు అభిప్రాయపడుతున్నారు. చీఫ్ ఎంటమాల జిస్టు పోస్ట్‌కు సమాన స్థాయి క్యాడర్ అయిన అసిస్టెంట్ డైరెక్టర్ స్థాయి అధికారులు ఉన్నప్పటికి అక్రమంగా సీనియర్ ఎంటమాలజీ పోస్టును నిర్వహిస్తూ, అర్హత లేకపోయినా పట్టువదలని విక్రమార్కునిలా చీఫ్ ఎంటమాలజిస్టు పోస్టు కోసం ప్రయత్నం చేయడం ఈ విభాగం సిబ్బందిని విస్మయానికి గురిచేస్తుందని సిబ్బంది పేర్కొంటున్నారు. చీఫ్ ఎంటమాలజిస్టు పోస్టుకు అర్హత ఉన్న కొంత మంది పేర్లను జిహెచ్‌ఎంసి అధికారులు ప్రభుత్వానికి పంపినా వాటిని సైతం డార్కులో పెట్టించే ప్రయత్నం చేస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. ఇద్దరు మంత్రులతో ఎలాగైనా చీఫ్ ఎంటమాలజిస్టు పోస్టును తెచ్చుకోవాలని ప్రయత్నాలకు స్థానిక మేయర్ కూడ వత్తాసు పలుకుతున్నట్లు ప్రచారం సాగుతోంది. మేయర్ కూడ అర్హత లేని వారికి అవకాశం కల్పించాలనే ప్రయత్నం చేయడం విడ్డూరంగా ఉందని పలువురు సిబ్బంది చర్చించుకుంటున్నారు. కొంత మంది సీనియర్ ఎంటమాలజిస్టులు జిహెచ్‌ఎంసి ఏర్పాటు అయిన నాటి నుండి నేటి వరకు ఇక్కడ పని చేస్తున్న పరిస్థితి నెలకొంటుంది. ఇక్కడ చేతి వాటిటానికి మరిగిన ఈ అధికారులు జిల్లా మలేరియా అధికారి (డిఎంఓ)గా ప్రమోషన్ వచ్చినా వాటిని నిరాకరిస్తున్న పరిస్థితి నెలకొంది. వీరి వల్ల కొంతమందికి ప్రమోషన్లు రాకుండానే పదవీ విరమణ పొందుతున్న దుస్థితి ఏర్పడుతుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విజిలెన్స్ తనికీలు నామమాత్రం...

ఎంటమాలజిలో అక్రమాలు జరిగానే అనుమానంతో విజిలెన్స్ అధికారులు పలు సర్కిళ్ళలో తనిఖీలు చేపడుతున్నారు. అయితే అక్రమాలు జరిగిన జోన్‌లు, సర్కిళ్ళు వదిలేసి అక్రమాలు జరగని సర్కిళ్ళు, జోన్‌ల చుట్టు తిరుగుతున్నరనే విమర్శలు చోటు చేసుకుంటున్నాయి. ముఖ్యంగా గ్రేటర్‌లోని ఈస్ట్ జోన్ ఎల్.బి.నగర్, ఖైరతాబాద్ జోన్‌లో ఎలాంటి తనిఖీలు చేపట్టకపోవడంలో ఆంతర్యం ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఎల్‌బినగర్ జోన్, ఖైరతాబాద్ జోన్‌లో జరిగిన అక్రమాలు ఏక్కడ జరగలేదని, విజిలెన్స్ అధికారులు తూతూమంత్రంగా తనిఖీలు చేపట్టి అమాయకులను బలి చేసే ప్రయత్నం చేయకుండా అక్రమాలకు పాల్పడినిన వారిని వెలికితీయాలని పలువురు సిబ్బంది అభిప్రాయపడుతున్నారు.

ఘనంగా నారా లోకేష్ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - కాప్రా : తెలుగు దేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర మంత్రి నారా లోకేష్ బాబు జన్మదిన వేడుకలను కాప్రా సర్కిల్ పరిధిలోని ఘనంగా నిర్వహించారు. కాప్రా సర్కిల్ తెలుగుదేశం పార్టీ నాయకుల ఆధ్వర్యంలో నిర్వహిం చిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మల్కాజిగిరి మేడ్చల్ జిల్లా కన్వీనర్ మాజీ అధ్యక్షుడు అశోక్ కుమార్ గౌడ్, మాజీ ఉపాధ్య క్షుడు టి జి కె మూర్తిలు హాజరైకే కట్ చేశారు. మాజీ కౌన్సిలర్ గడ్డమిది రాములు యాదవ్, ఎర్ర రమేష్ గౌడ్, కాంటెస్ట్ కార్పరేటర్ నిర్మలా సాంబమూర్తి గౌడ్, దూడల సాంబమూర్తి గౌడ్, ఉప్పల్ ఆడ హక్ కమిటీ మెంబర్ కనక మెడల రాంబాబు, రుద్ర గౌని రామచందర్ గౌడ్, నీరు కొండ సతీష్ బాబు, సూర్ణం రాజేష్, తిక్క ప్రకాష్, శ్రీరాములు, పాండు, ప్రేమ్ కుమార్ గౌడ్, జంగారెడ్డి, ఉమాశంకర్ గౌడ్, శివానంద్, వెంకటేశ్వరరావు, రామకృష్ణ, వడ్లమూడి శ్రీనివాస్, కిషోర్, సత్యం, నందం గౌడ్, బొప్పన శ్రీనివాసరావు, అవినాష్ గౌడ్, పరమేష్, సావిత్రి, ప్రతిభ, హరి, నవీన్, కృష్ణారావు ,గోబేరు రమేష్,నాదం గౌడ్. పాల్గొన్నారు.

లోడింగ్, అన్లోడింగ్ కార్మికులకు

సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : దేశంలోని వివిధ రంగాలలో లోడింగ్, అన్లోడింగ్ విభాగంలో పనిచేయుచున్న టువంటి హమాలీ కార్మికులకు ఎలాంటి రక్షణ చట్టాలు లేకుండా ఉన్నాయని, ఈ కార్మికులకు మహారాష్ట్ర మాదిరి మథాడి యాక్ట్ ను తీసుకురావడం ద్వారా న్యాయం జరిగే అవకాశం ఉన్నదని ఆల్ ఇండియా లోడింగ్ అన్లోడింగ్ వర్కర్స్ ఫెడరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఏఐటీయూసీ జాతీయ కార్యదర్శి సుకుమార్ దామిలే డిమాండ్ చేశారు. నేడు ఆల్ ఇండియా లోడింగ్ అన్లోడింగ్ వర్కర్స్ ఫెడరేషన్ జాతీయ కార్యవర్గ సమావేశం హిమాయత్ నగర్‌లోని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయంలో యూనియన్ జాతీయ అధ్యక్షులు ఎస్ బాలరాజ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సుకుమార్దాములే మాట్లాడుతూ మహారాష్ట్ర మత్తడి యాక్ట్ ను దేశవ్యాప్తంగా అమలు చేయాలని, తద్వారా దేశంలో లోడింగ్ అన్లోడింగ్ విభాగంలో పని చేయుతున్నటువంటి కార్మికులకు పేమెంట్ ఆఫ్ వేజెస్ యాక్ట్, బోనస్ యాక్ట్, గ్రాచుటీ యాక్ట్, ప్రావిడెంట్ ఫండ్ యాక్ట్, ఇండస్ట్రియల్ డిస్ప్యూటీ యాక్ట్, లాంటి తదితర యాక్టులు అమలు కావడానికి అవకాశం ఉంటుందని వారు వెల్లడిం చారు. ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం అసంఘటితరంగా కార్మికుల సమస్యలపై ఎలాంటి పరిష్కార మార్గాలు చూపటం లేదని గతంలో యూపీఏ గవర్నమెంట్ భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి దేశవ్యాప్తంగా అమలు చేయడం జరిగిందని తద్వారా కోట్లాదిమంది భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు కిందికి వచ్చారని వారు తెలియజేశారు. లోడింగ్ అన్లోడింగ్ కార్మికులకు కూడా సంక్షేమ చట్టాలను అమలు చేయాలని దాని కోసం రాబోయే పార్లమెంటు సమావేశాల సందర్భం గా దేశవ్యాప్తంగా లోడింగ్ అన్లోడింగ్ కార్మికులను సమీకరించి చలో పార్లమెంటు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వారు వెల్లడించారు. యూని యన్ అధ్యక్షులు ఎస్ బాలరాజు మాట్లాడుతూ లోడింగ్ అన్లోడింగ్ హమాలీ కార్మికులను నాలుగవ తరగతి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, ప్రభుత్వానికి, వ్యాపారులకు మధ్యవర్తులుగా ఉండి సరుకు రవాణాలో తమ శ్రమను ఖర్చు చేస్తున్నటువంటి హమాలీలకు తగిన రక్షణ చట్టాలను అమలు చేయాలని వీరికి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసేదాకా దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళను నిర్వహించనున్నట్లు వారు వివరించారు. ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం నరసింహ, యూనియన్ జాతీయ నాయకులు ఎం ప్రవీణ్ కుమార్, వెంకటసుబ్బయ్య అంజిబాబు కొఠారి రమణ, మహేష్, సత్పాల్, రంజిత్ తాయా, అమర్ సింగ్ భటియ, ఏ గట్టయ్య, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌కోర్-ఆల్కమ్ ప్లాంట్ రెడీ

అల్యూమినియం డోర్స్, విండోస్ తయారీలో దేశంలో అతిపెద్ద కేంద్రం : ఫౌండర్ అవుతు శివ కోటి రెడ్డి

విశాలాంధ్ర - హైదరాబాద్ : అల్యూమినియం డోర్స్, విండోస్ తయారీ రంగంలో ఉన్న హైదరాబాద్ సంస్థ ఎన్‌కోర్-అల్కమ్ గుజరాత్‌లో నెలకొల్పిన అత్యాధునిక ప్లాంటులో కార్యకలాపాలు ప్రారంభం అయ్యాయి. సూరత్ వద్ద 1,84,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇది ఏర్పాటైంది. అల్యూమినియం డోర్స్, విండోస్ విభాగంలో భారత్‌లో తొలి ఆటో రోబోటిక్ ఫెసిలిటీ ఇదేనని ఎన్‌కోర్ ఉడ్‌క్రాఫ్ట్ ఫౌండర్, సీఎండీ అవుతు శివ కోటి రెడ్డి తెలిపారు. విస్తీర్ణం పరంగా దేశంలో ఇది అతిపెద్ద కేంద్రంగా నిలుస్తుందని చెప్పారు. ఈ ప్లాంటుకు దశలవారీగా రూ.60 కోట్లు వెచ్చిస్తున్నట్టు వెల్లడించారు. 'జర్మనీ సాంకేతికత ఉపయోగించాం. రోజుకు 35,000 చదరపు అడుగుల తయారీ సామర్థ్యం ఈ ఫెసిలిటీ ప్రత్యేకత. హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో జనవరి 24 నుంచి జరిగే ఏస్‌టెక్ ట్రేడ్ ఫెయిర్‌లో అత్యాధునిక, వినూత్న ఉత్పత్తులను ప్రదర్శిస్తాం. ఇప్పటికే యూఎస్ఏ, యూకే, దుబాయ్, ఈయూలో ప్రాజెక్టులను విజయవంతంగా పూర్తి చేసి సత్తా చాటాం. ప్రపంచ దిగ్గజ కంపెనీలకు ధీటుగా సొంత ఆర్‌అండ్‌డీతో, ఇటలీ డిజైనర్ల సహకారంతో ఉత్పత్తులను తయారు చేస్తున్నాం. 3,500లకుపైగా ప్రాజెక్టులు పూర్తి చేశాం' అని వివరించారు. ఎత్తు, వెడల్పు పరంగా ఎన్‌కోర్ -ఆల్కమ్ తయారు చేసిన 20 అడుగుల స్లైడింగ్ డోర్ భారత్‌లో అతిపెద్దదని ఆల్కమ్ డైరెక్టర్ జయంతి భాయ్ పటోలా తెలిపారు. 'అల్యూమినియం డోర్స్, విండోస్, రైలింగ్స్, గ్లాస్ ఫసాడ్స్ తయారు చేస్తున్నాం. ఆస్ట్రేలియా, మధ్యప్రాచ్య దేశాల్లో త్వరలో అడుగుపెట్టనున్నాం. భవిష్యత్ అంతా మెటల్ డోర్లదే. కొత్త ప్లాంటు రాకతో ప్రత్యక్షంగా, పరోక్షంగా 500 మందికి ఉద్యోగావకాశాలు లభించాయ్. ఇప్పటికే సూరత్‌లో 60,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో రోజుకు 10,000 చదరపు అడుగుల తయారీ సామర్థ్యం గల ప్లాంటు ఉంది. పోటీ కంపెనీలతో పోలిస్తే మా ఉత్పత్తులు 300 శాతం మెరుగ్గా ఉంటాయి.

స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల పెంపు ఇంకెంత కాలం ?

విశాలాంధ్ర - హైదరాబాద్ : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్లను 42 శాతానికి పెంచడానికి ఇంకెంత కాలం తాత్సారం చేస్తారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చిన 6 నెలల్లోనే కులగణన పూర్తి చేసి రిజర్వేషన్లు పెంచుతామని కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ద్వారా కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని, కానీ అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా ఇంకా అమలు చేయకపోవడం శోచనీయమన్నారు. ఈ మేరకు గురువారం ఎమ్మెల్సీ కవిత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. బీసీలకు ఏటా రూ. 20 వేల కోట్ల చొప్పున ఐదేళ్లలో రూ లక్ష కోట్ల బడ్జెట్ కేటాయిస్తామని హామీ ఇచ్చి 2024-25 బడ్జెట్ లో అరకొర కేటాయింపులు చేసి తొలి ఏడాదే కామారెడ్డి డిక్లరేషన్ ను సీఎం రేవంత్ రెడ్డి ఉల్లంఘించారని విమర్శించారు. కాబట్టి కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల బీసీ వర్గాల్లో ఏ మాత్రం విశ్వాసం లేదని, ఈ వైఖరితో రాష్ట్రంలో బీసీలంతా తీరని అన్యాయానికి గురవుతున్నారని పేర్కొన్నారు. కామారెడ్డి డిక్లరేషన్ లో ప్రధాన హామీ అయిన స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పించడం. "కుల గణన, బీసీ కమిషన్ నివేదిక ఆధారంగా అధికారంలోకి వచ్చిన 6 నెలల్లోపే బీసీలకు రిజర్వేషన్ల పెంపు" అని కామారెడ్డి బీసీ డిక్లరేషన్ లో స్పష్టంగా పేర్కొని ఉంది. 6 నెలలు గడిచాయి... ఏడాది గడిచింది.. అయినా కూడా రిజర్వేషన్ల పెంపునకు అతీగతీ లేదు. అశాస్త్రీయంగా బీసీ గణన నిర్వహించి, డెడికేటెడ్ కమిషన్ పేరిట కాలయాపన చేయడమే మీ ఆలోచనగా కనిపిస్తోంది." అని తెలిపారు. కుల గణన పూర్తయ్యి కూడా చాలా కాలం అవుతుందని, కానీ ఇప్పటి వరకు ప్రభుత్వం ఆ వివరాలను బహిర్గతం చేయలేదని ఎండగట్టారు. ఆ వివరాలను తక్షణమే బహిర్గతం చేయాల్సిన అవసరం ఉందని, డెడికేటెడ్ కమిషన్ నివేదిక సిద్ధమైనట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో తదుపరి కార్యాచరణపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. " బీసీల అంశాల పట్ల మీ ప్రభుత్వం ఎందుకు అంత నిర్లక్ష్యం వహిస్తోంది ? బీసీలంటే కాంగ్రెస్ పార్టీకి ఎందుకు చులకన ? 6 నెలల్లోపే అమలు చేస్తామన్న హామీ 12 నెలలు గడిచినా ఎందుకు అమలు చేయడం లేదు ? హామీని అమలు చేయడానికి ఇంకెంత కాలం పడుతుంది ?" అని ప్రశ్నల వర్షం కురిపించారు.

బీసీలకు ఇచ్చిన హామీ ప్రకారం రిజర్వేషన్లను 42 శాతానికి పెంచాల్సిందేనని తేల్చిచెప్పారు. ప్రభుత్వం తక్షణమే స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లను తక్షణమే 42 శాతానికి పెంచడానికి చర్యలను ముమ్మరం చేయాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు.

మహిళను మోసం చేసిన వ్యక్తులపై కేసు నమోదు : రిమాండ్‌కు తరలింపు

విశాలాంధ్ర-కొత్తూరు : ఉద్దేశపూర్వకంగా మహిళలను ఓ వ్యక్తి మోసం చేసిన సంఘటనలో కొత్తూరు పోలీసులు అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. ఈ సంఘటన గురువారం తిమ్మాపూర్‌లో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. కొత్తూరు మండలం, మల్లాపూర్ గ్రామానికి చెందిన రాధికకు కొత్తూరు మున్సిపాలిటీ తిమ్మాపూర్ గ్రామానికి చెందిన శ్రీకాంత్ గౌడ్‌తో గత కొన్నేళ్ళక్రితం వివాహం జరిగింది. కొన్ని నెలల క్రితం శ్రీకాంత్ అనారోగ్యంతో మృతి చెందాడు. ఐతే స్టేషన్ తిమ్మాపూర్‌కు చెందిన మహేందర్ తన భర్త ఆస్తుల వివరాలు చెప్తానని మాయమాటలు చెప్పి ఈనెల 20న తెల్లవారుజామున ఇంటి నుంచి తీసుకెళ్లాడు. తన కోడలు కనిపించడం లేదని అత్త హంసమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు వారి గురించి వెతుకుతుండగా తప్పించుకొని రాధిక తానే పోలీస్ స్టేషన్కు వచ్చి జరిగిన వివరాలను వివరించింది. దీంతో ఆస్తికోసం మహిళను మాయమాటలు చెప్పి తిరుపతి తీసుకెళ్లి బెదిరించడంతో మహేందర్ తో పాటు అతని డ్రైవర్ శేఖర్‌ను గురువారం ఉదయం హైదరాబాద్‌లో పట్టుకొని కేసు నమోదు చేసుకొని రిమాండ్ కు తరలించినట్లు సిఐ నరసింహారావు తెలిపారు. నిందితుల నుండి కారు, ఫోన్లు, కత్తి స్వాధీనం చేసుకున్నట్టు వివరించారు . చాక చక్యంగ నిందితులను పట్టుకున్నందుకు ఎస్సై జి శ్రీనివాస్‌తో పాటు కానిస్టేబుల్ లు మహిపాల్, రవికుమార్, హెూంగార్డు నరేష్ లను ఆయన అభినందించారు.

తెలంగాణ ప్రజారాజ్యం పార్టీ జెండా ఆవిష్కరణ

విశాలాంధ్ర-బషీర్ బాగ్ : శాంతి, సమానత్వం, సామాజిక న్యాయం కోసం ముందుకు సాగడమే కాకుండా యువత రాజకీయాల్లోకి వచ్చేలా తమ పార్టీ ప్రోత్సహిస్తుందని తెలంగాణ ప్రజా రాజ్యం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు జిలుకర రవికుమార్ స్పష్టం చేశారు. పార్టీ విధివిధానాలు ప్రకటించేందుకు నగరంలో త్వరలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. గురువారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ జెండా ఆవిష్కరించారు. అనంతరం రవికుమార్ మాట్లాడుతూ త్వరలోనే జిల్లాల అధ్యక్ష, కార్యదర్శిలను ఎన్నుకుంటామని తెలిపారు. అభివృద్ధి, ఐక్యత, వ్యవసాయంతో పాటు తెలంగాణ గ్రామీణ ప్రాంతాలకు తోడ్పాటు అందించడం తమ పార్టీ ఎజెండా అన్నారు. రాష్ట్ర ప్రజలకు మార్గ దర్శనం చేస్తూ సరైన నాయకత్వం సూచించే దిశగా ముందుకు సాగుతాం అన్నారు. అబద్దపు హామీల గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన అన్ని హామీలు నెరవేర్చాలని అన్నారు. అర్హులైన వారికి రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని అన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో పార్టీ నేతలు ఉప్పుగల్లా సోమన్న, చిలుక మల్లేశం, బొట్టు మంచి సుధాకర్, రాంపల్లి శ్రీనివాస్, చేరుకూరి రత్నరాజ్, బంగారి రమేష్, జన్ను ప్రభాకర్, కెఎస్.స్వామి దాస్, ఇమ్మానియల్, ఉదయ్ కుమార్, ప్రసంగి, సామ్యేల్, రాజా రత్నం, మేకల సారయ్య పాల్గొన్నారు.

బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్‌లో

పల్మనరీ ఫంక్షనల్ టెస్టింగ్ పరికరం

విశాలాంధ్ర - జూబిలీహిల్స్ : ఎల్‌ఐసి గోల్డెన్ జూబ్లీ ఫౌండేషన్ వారి ఆర్థిక సహకారంతో 80 లక్షల రూపాయల విలువైన అత్యాధునికమైన సోనోసైట్ అల్ట్రా సౌండ్ స్కానింగ్ సిస్టం మినీ బాక్స్ ం డిసిఎల్ఓ - పల్మనరీ ఫంక్షనల్ టెస్టింగ్ పరికరం వ్యాధి నిర్ధారణ పరికరములను ఆరోగ్యశ్రీ రోగుల కోసం అందుబాటులోనికి తెచ్చిన బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ %ండ% రీసెర్చ్ ఇన్సిస్టిట్యూట్ బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్, రీసెర్చ్ ఇన్సిస్టిట్యూట్ లో అత్యాధునికమైన సోనోసైట్ అల్ట్రా సౌండ్ స్కానింగ్ సిస్టం మినీ బాక్స్ ం డీసీఎల్ఓ (పల్మనరీ ఫంక్షనల్ టెస్టింగ్ పరికరం) అనే వ్యాధి నిర్ధారణ పరికరములను ఆరోగ్యశ్రీ రోగుల కోసం అందుబాటులోనికి తీసుకొని వచ్చింది. షుమారు 80 లక్షల రూపాయల విలువ కలిగిన ఈ రెండు వ్యాధి నిర్ధారణ పరికరముల ఏర్పాటు కోసం ఎల్‌ఐసి గోల్డెన్ జూబ్లీ ఫౌంఢేషన్ వారు నిధులను అందజేశారు. వీటి ద్వారా ఆరోగ్యశ్రీ రోగులకు పరీక్షల కోసం వేచి చూసే సయమం తగ్గడమే కాకుండా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించడానికి వీలవుతుంది. ఈ రెండు వ్యాధినిర్ధారణ వ్యవస్థలను నేటి మధ్యాహ్నం జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో కృష్ణ కుమార్, ఎక్జిక్యూటివ్ డైరెక్టర్, ఎల్‌ఐసి గోల్డెన్ జూబ్లీ ఫౌండేషన్ వారు జెయస్ ఆర్ ప్రసాద్, ట్రస్టు బోర్డు సభ్యులు వారి సమక్షంలో లాంఛనంగా ప్రారంభించారు. డా. కె కృష్ణయ్య, సీఈఓ రామయ్య, రీజనల్ మేనేజర్, ఎల్‌ఐసి హాజరైనారు. వీటిని ప్రారంభించిన అనంతరం ముఖ్య అతిథులు వాటి సహాయంతో రోగులకు వ్యాధి నిర్ధారణ పరీక్షలు ఎలా చేస్తారనే విషయంలో సిబ్బంది ప్రత్యేక డెమో చేసి చూపించారు. బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ వారు చేస్తున్న క్యాన్సర్ పై పోరాటంలో భాగస్వామ్యం కావడం పట్ల ఎంతో సంతోషంగా ఉందన్నారు. తాము అందించిన పరికరాలు ఎందరో పేద రోగులకు త్వరితగతిన చికిత్స అందించడానికి దోహదపడుతాయని ఆశిస్తున్నట్లు తెలిపారు. ఎప్పటికపుడు రోగులకు మరింత మెరుగైన సేవలు అందించడానికి ముందుకు వచ్చిన ఎల్‌ఐసి వారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని అలానే హాస్పిటల్ కు సహాయం అందిస్తున్న దాతలందరికీ పేరు పేరునాధన్యవాదములన్నారు.

ప్రజల పక్షాన పనిచేసే పత్రిక విశాలాంధ్ర

విశాలాంధ్ర - కాప్రా : నూతన సంవత్సరం విశాలాంధ్ర క్యాలెండర్ ఈసీఐఎల్ నీలం రాజశేఖర్ రెడ్డి భవన్లో ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిపిఐ మేడ్చల్ జిల్లా సహాయ కార్యదర్శి జి.దామోదర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ గ్రేటర్ నాయకులు నెమలి అనిల్‌లు హాజరై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దామోదర్ రెడ్డి మాట్లాడుతూ విశాలాంధ్ర దినపత్రిక ప్రజా గొంతుగా ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కృషి చేస్తుందని ఆయన పేర్కొన్నారు. అనంతరం నెమలి అనిల్‌కుమార్ మాట్లాడుతూ ప్రజల పక్షాన ఉండే ప్రజల గొంతుగా పని చేస్తున్నందుకు విశాలాంధ్ర దినపత్రిక పనిచేయడం అభినందనీయమని, నేడు ప్రజల పక్షాన పనిచేసే పత్రికలు కరువవుతున్నాయని అన్నారు. సమాజంలో ఉన్న సమస్యలను వెలుగులోకి తీసుకురావడమే కాకుండా తక్షణ పరిష్కారాలకు మార్గదర్శకంగా ఉండాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా బ్యూరో ఎం.బాలరాజు, ఏఐఎస్ఎఫ్ ఉప్పల్ మండల అధ్యక్షుడు ఎండి అజీమ్ పాషా, విశాలాంధ్ర రిపోర్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఎండి అక్బర్, తాజుద్దీన్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంతోనే ప్రజల అభివృద్ధి : కొలన్

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్ : కాంగ్రెస్ ప్రభుత్వం పాలనతోని ప్రజల అభివృద్ధి కొనసాగుతుందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ మంజీరా వాటర్ ట్యాంక్, 14వ డివిజన్ 14వ డివిజన్ వెంకటరాయ నగర్, 12 డివిజన్ సెట్విన్ కాలనీలలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ లైన్, సాయినాథ్ నగర్ కాలనీ శివాలయం వద్ద టాయిలెట్స్ వంటి పలు అభివృద్ధి కార్యక్రమాలను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి, మేయర్ నీలగోపాల్ రెడ్డి, ఎన్ఎంసి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కొలన్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాల మేరకు అన్ని రంగాలలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభివృద్ధి పరుస్తున్నారని, అందులో భాగంగానే నిజాంపేట్ అభివృద్ధిలో ముందుకు తీసుకువెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో 14వ డివిజన్ కార్పొరేటర్ కర్నాటి రాజేశ్వరి వెంకయ్య చౌదరి, చిట్ల దివాకర్, ఏనుగుల శ్రీనివాస్‌రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు తలారి వీరేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ టేకుల ప్రవీణ్ రెడ్డి, మహిళా అధ్యక్షురాలు ఇందిరా, మాజీ సర్పంచ్ వడ్ల నాగాచారి, జగన్ యాదవ్, జగదీష్ యాదవ్, ఏనుగుల శ్రీకాంత్ రెడ్డి, డివిజన అధ్యక్షులు మామిళ్ళపల్లి శ్రీనివాస్, లింగాల గంగాధర్, కృష్ణమరాజు, ఏలూరు సత్య నాని, శ్రీశైలం యాదవ్, పృధ్వి, వర్మ రాజు, మౌలేశ్వరరావు, చెరుకుపల్లి మహేష్, ప్రశాంత్ రెడ్డి, రామానాయుడు, కాంగ్రెస్ పార్ నాయకులు, మహిళా నాయకురాలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ కార్డు, ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తుల స్వీకరణ

విశాలాంధ్ర - మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 15వ డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ బండారి మంజుల రవీందర్ ఆధ్వ ర్యంలో గురువారం ఉదయం ప్రజాపాలన వార్డు సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా మేయర్ అమర్ సింగ్, కమిషనర్ త్రిలోకేశ్వర్‌రావు, సీఐ గోవిందారెడ్డి విచ్చేసి ప్రారంభించారు. ఈ సమావేశంలో అర్హులైన వారి నుండి రేషన్ కార్డు, ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తులను స్వీకరించారు. కార్పొరేటర్ బండారి మంజుల రవీందర్ మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరు రేషన్‌కార్డు, ఇందిరమ్మ ఇల్లు కోసం మున్సిపల్ కార్యాలయంలో ప్రజాపాలన ఆఫీసులో దరఖాస్తు చేసుకొని అవకాశాన్ని వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు, వివిధ కాలనీల అధ్యక్షులు, 15వ డివిజన్ నాయకులు, కాలనీ వాసులు, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య పోరాటంలో సుభాష్ చంద్రబోస్ పాత్ర కీలకం

విశాలాంధ్ర- దుండిగల్: భారత స్వాతంత్ర్య పోరాటంలో నేతాజీ సుభాష్‌చంద్రబోస్ పాత్ర కీలకమని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ వెల్లడించారు. గురువారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధి సుభాష్ నగర్ నందు మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ భారత స్వాతంత్ర్య సమరయోధుడు, ఆజాద్ హింద్ ఫౌజ్ వ్యవస్థాపకుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా ఆ మహనీయుడి విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య సమరవీరుల్లో నేతాజీ చంద్రబోస్ అగ్రగన్యుడని కొనియాడారు. కొనేటి నర్సింహా రావు, తులసి, నాగిరెడ్డి, వీరేశం, గుబ్బల రమణ, రంగనాథ్, కుమ్మరి శంకర్, మల్లేష్ గౌడ్, శైలజ, పాటిల్, మురళి, సంతోష్, త్రిమూర్తులు, నాగార్జున, జగదీష్ చక్రి, పరుశురాం, రవి, సలోమి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో ముందంజలో 1వ డివిజన్

విశాలాంధ్ర - మేడిపల్లి: బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో గురువారం ద్వారకానగర్ కాలని ఫేస్-1లో వివిధ కాలనీలకు సంబంధించి మూడు కోట్ల 40 లక్షల రూపాయల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడం జరిగింది. స్థానిక కార్పొరేటర్ బింగి జంగయ్య యాదవ్‌తో కలిసి మేయర్ అజయ్ యాదవ్ రోడ్లు, డ్రైనేజీలకు శంకుస్థాపన చేయడం జరిగింది. కమిషనర్ రామలింగం, డిప్యూటి మేయర్ కొత్త స్రవంతి కిషోర్ గౌడ్, పోగుల నరసింహ రెడ్డి, కొత్త చెందర్ గౌడ్, రంగ బ్రహ్మన్న గౌడ్, నాయకులు కుర్రి శివశంకర్, రసాల కుమార్ యాదవ్, బింగి యోగేష్ యాదవ్, వివిధ కాలనీల అధ్యక్షులు శేఖర్ రెడ్డి, సాగర్, అరుణ్‌కుమార్, నాగేంద్ర పటేల్, రాఘవేంద్ర, సతీష్ యాదవ్, క్రిష్ణమూర్తి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందజేస్తాం

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్ : అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందజేసేలా కృషి చేస్తానని కార్పొరేటర్ ఆగంరాజు ముదిరాజ్ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి బాచుపల్లి 17వ డివిజన్ పరిధి స్థానిక కార్పొరేటర్ ఆగంరాజు ముదిరాజ్ అధ్యక్షతన చిల్లన్ నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డు అప్లై చేసిన దరఖాస్తుదారుల పేర్లు వార్డ్ ఆఫీసర్ ప్రియాంకతో కలిసి పరిశీలించారు. అలాగే కొత్త దరఖాస్తుదారులకు రశీదులను కార్పొరేటర్ ఆగంరాజు చేతుల మీదగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎంసి అధికారులు సిబ్బంది కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ బలోపేతమే లక్ష్యం

పార్టీ కార్యకర్తలు, నేతలకు ముప్పాళ్ల పిలుపు

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్: దేశంలో నెలకొన్న ప్రస్తుత పరిస్థితుల్లో కార్మిక, కర్షక, ప్రజాశ్రేయస్సే లక్ష్యంగా పోరాడుతున్న భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ)ని బలోపేతం చేసుకోవాలని ఆ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. సీపీఐ గుంటూరు జిల్లా సమితి సభ్యులు, ప్రజా సంఘాల ముఖ్యకార్యకర్తల విస్తృత సమావేశం గుంటూరు మల్లయ్యలింగంభవన్‌లో గురువారం జరిగింది. జిల్లా కార్యవర్గ సభ్యులు మేడా హనుమంతరావు అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ముప్పాళ్ల మాట్లాడుతూ.. సీపీఐ శత వసంతాల పండుగ దేశవ్యాప్తంగా ఘనంగా జరుపుకుంటోందన్నారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో సీపీఐ ముందు వరుసలో నిలిచిందని... అనేక మంది నాయకులు, కార్యకర్తలు తమ ప్రాణాలు పణంగా పెట్టి స్వతంత్రం కోసం పోరాడారన్నారు. దేశంలో నెలకొన్న ప్రస్తుత పరిస్థితుల్లో కమ్యూనిస్టు పార్టీ మరింత బలపడాల్సిన అవసరం ఉందని...దీనికోసం ప్రతి కార్యకర్త దీక్షతో కష్టపడి పనిచేయాలని సూచించారు. స్థానిక సమస్యల పరిష్కారానికి చొరవచూపుతూ ప్రజలతో మమేకం కావాలన్నారు. రానున్న మూడు సంవత్సరాలను ఉద్యమాల సంవత్సరాలుగా గుర్తించి ప్రతి కార్యకర్త కష్టపడాలని, భవిష్యత్తులో ప్రజలకు ప్రత్యామ్నాయ రాజకీయ పార్టీగా సీపీఐని నిలిపేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్లు చొప్పున పేదలకు తక్షణమే ఇంటి స్థలాలు ఇచ్చి... ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇళ్ల స్థలాల పేరుతో దోపిడీ జరిగిందన్నారు. చెరువులు, గుంతలు, గుట్టల్లో స్థలాలు ఇచ్చారని... కనీసం వారి స్థలం ఎక్కడ ఉందో కూడా చాలా మంది ప్రజలకు తెలియదన్నారు. ప్రజలు తాము మోసపోయామనే విషయాన్ని ఇప్పుడే గ్రహిస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వమైనా పేద ప్రజల సమస్యలను పరిష్కారం చేయాలన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ... సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) అధ్వర్యంలో ఖనౌరీ సరిహద్దులో ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న రైతునేత జగ్జిత్‌సింగ్ దలేవాల్‌కు మద్దతుగా, రైతు సమస్యల పరిష్కారానికి ఈ నెల 25వ తేదీన గుంటూరులో నిరసన కార్యక్రమం జరుగుతుందని... ఈ కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. అదేవిధంగా 26వ తేదీన అన్ని మండల కేంద్రాలలో జరిగే కార్యక్రమాలలో కూడా పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని... అర్హులైన పేద ప్రజలను సమీకరించి ఇళ్ల స్థలాల కోసం అర్జీలు రాయించి అధికారులకు ఇప్పించాలని కోరారు.

హోంగార్డులను స్వరాష్ట్రాలకు బదిలీ చేయాలి

సీఎస్‌కు ఈశ్వరయ్య లేఖ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నియమితులయ్యి... ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల స్థానికత కలిగిన హోంగార్డులను స్వరాష్ట్రాలకు బదిలీ చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్)కు గురువారం ఆయన లేఖ రాశారు. వాటి ప్రతులను సీఎం నారా చంద్రబాబుకు, హోంమంత్రి వంగలపూడి అనితకు పంపారు. 15 సంవత్సరాల క్రితం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నియమితులైన దాదాపు 400 మంది హోంగార్డులు చాలీచాలని రోజు వారీ వేతనాలతో కుటుంబాలకు దూరంగా ఉంటూ తెలంగాణలో విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. వారంతా ఆంధ్రప్రదేశ్ స్థానికతను కలిగి ఉన్నారని తెలిపారు. ఇంటర్ వరకు వారి చదువు ఆంధ్రప్రదేశ్‌లోనే కొనసాగడంతో వారు తెలంగాణలో నాన్ లోకల్‌గా పరిగణించబడుతున్నారని పేర్కొన్నారు. ఈ కారణాలతో తెలంగాణలో కానిస్టేబుళ్ల నియామకాల్లో హోంగార్డులకు ఇచ్చే వెసులుబాటును కోల్పోతున్నారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ కానిస్టేబుళ్ల నియామకాల్లో దరఖాస్తు చేసుకుంటే... వారి సర్వీసు తెలంగాణలో ఉండటంతో వారికి ఆంధ్రప్రదేశ్ కోటా వర్తించబోదని చెబుతున్నారన్నారు. దీంతో ండు తెలుగు రాష్ట్రాల్లోనూ హోంగార్డులు నష్టపోతున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇచ్చే రేషన్‌కార్డులు, ఇళ్ల స్థలాలు, పక్కా గృహాలు తదితర అన్ని సంక్షేమ పథకాలనూ కోల్పోవడంతోపాటు, వారి పిల్లల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారుతోందని పేర్కొన్నారు. తెలంగాణలో పనిచేస్తున్న హోంగార్డుల మనోవేదనను అర్థం చేసుకుని వారిని ఆంధ్రప్రదేశ్‌కు బదిలీ చేయాలని, అలాగే తెలంగాణ రాష్ట్రం స్థానికత కలిగి...ఆంధ్రప్రదేశ్‌లో పనిచేస్తున్న దాదాపు 400 మంది హెూంగార్డులను తెలంగాణకు బదిలీచేయాలని కోరారు. దీని వల్ల ప్రభుత్వంపై ఎలాంటి బడ్జెట్ భారం ఉండబోదని తెలిపారు. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల స్థానికత కలిగిన హెూంగార్డులను వారి స్వరాష్ట్రాలకు బదిలీ చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆ లేఖలో ఈశ్వరయ్య విజ్ఞప్తి చేశారు.

రూ.1.76 కోట్ల విలువైన సిగరెట్లు స్వాధీనం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: విజయవాడ కస్టమ్స్ ప్రివెంటివ్ కమిషనరేట్ అధికారులు, గుంటూరు సెంట్రల్ జీఎస్టీ అధికారులు సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో విజయవాడలో భారీగా విదేశీ గుర్తులు కలిగిన స్మగ్లింగ్ సిగరెట్లను స్వాధీనం చేసుకున్నట్లు కస్టమ్స్ అండ్ సెంట్రల్ ట్యాక్స్ కమిషనర్ సాధు నరసింహారెడ్డి తెలిపారు. గురువారం ఆటోనగర్‌లోని కస్టమ్స్ కార్యాలయంలో స్మగ్లింగ్ సిగరెట్ వివరాలను కమిషనర్ వెల్లడించారు. విజయవాడ రామవరప్పాడులోని ఓ గోడౌన్‌లో విదేశీ గుర్తులు కలిగిన ప్యారిస్ బ్రాండ్ సిగరెట్లు దాచి ఉన్నట్లు గుర్తించామన్నారు. అవి పన్ను కట్టని నకిలీ బ్రాండెడ్ సిగరెట్లని, మొత్తం 17 లక్షల 60 వేల సిగరెట్ స్టిక్ లను స్వాధీనపరచుకున్నామన్నారు. వీటి విలువ మార్కెట్‌లో రూ.కోటి 76 లక్షలు ఉంటుందని కమిషనర్ తెలిపారు. ఈ సిగరెట్లు స్మగ్లింగ్ చేసిన ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు వివరించారు. వీరిని బుధవారం విశాఖపట్నంలోని ఆర్థిక నేరాల కోర్టులో హాజరు పరచగా, అక్కడ ప్రత్యేక న్యాయమూర్తి రెండు వారాల పాటు రిమాండ్ విధించినట్లు తెలిపారు. విదేశీ సిగరెట్లు అక్రమంగా దిగుమతి చేసుకున్నా, పన్ను చెల్లించని స్వదేశీ సిగరెట్లు రవాణా చేసినా అరెస్ట్ తప్పదని కమిషనర్ హెచ్చరించారు. ఇలాంటి సిగరెట్లు కిళ్లీ కొట్లలో అమ్మినా కూడా నేరమే అవుతుందని, భారీ జరిమానాలు కూడా ఉంటాయని ఆయన స్పష్టం చేశారు. ఈ ఆర్థిక సంవత్సరంలో విజయవాడ కస్టమ్స్ కార్యాలయం రూ.8 కోట్ల 26 లక్షల విలువైన 82 లక్షల సిగరెట్ స్టిక్‌లను స్వాధీన పరచుకున్నట్లు కమిషనర్ తెలిపారు.

కూటమిలో చిచ్చుకు వైసీపీ కుట్ర

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కూటమి ప్రభుత్వంలో చిచ్చు పెట్టేందుకు వైసీపీ దుష్ప్రచారం చేస్తోందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు. ఎవరో ఏదో మాట్లాడితే తొందరపడవద్దని నేతలు, కార్యకర్తలకు పల్లా సూచించారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన 'ఎల్లో సింగం .. హంటింగ్ ఫర్ ట్రూత్' పేరుతో మంత్రి లోకేశ్‌పై రూపొందించిన పాటను విడుదల చేశారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ కోటిపైగా సభ్యత్వం సాధించడం లోకేశ్ ఘనతేనన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు అనేకమంది పారిశ్రామిక వేత్తలు ముందుకు వస్తున్నారంటే అది లోకేశ్ కృషి వల్లనేనని పేర్కొన్నారు. మళ్లీ జగన్ అధికారంలోకి వస్తే ఎలా అని పెట్టుబడిదారులు భయపడుతున్నారంటే...ఎంత విధ్వంసకర పాలన సాగిందో రాష్ట్ర ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. ఏపీని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడంలో తండ్రికి తగిన తనయుడిగా నారా లోకేశ్ ముందున్నారన్నారు. పాదయాత్ర సమయంలో విశాఖ స్టీల్ ప్లాంట్ ను పరిరక్షిస్తామని లోకేశ్ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కూటమి నేతలంతా కలిసికట్టుగా కృషి చేసి విశాఖ ఉక్కుకు భారీ ప్యాకేజీ తీసుకొచ్చారని హర్షం వ్యక్తం చేశారు.

రైతుల్లో సంతృప్తే ధ్యేయం

రీ-సర్వేపై సందేహాల నివృత్తికి హెల్ప్‌లైన్: ప్రభాకర రెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రైతుల్లో పూర్తి స్థాయి సంతృప్తే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని సర్వే, సెటిల్మెంట్, భూ రికార్డుల శాఖ సంచాలకుడు డాక్టర్ ఎస్.ప్రభాకర రెడ్డి తెలిపారు. హడావుడిగా పని ముగించే ఉద్దేశం లేదని చెప్పారు. రీ-సర్వే మరింత పారదర్శకంగా నిర్వహించే క్రమంలో భూ యజమానులు తమ సందేహాలను నివృత్తి చేసుకునేందుకు ప్రత్యేక హెల్ప్‌లైన్‌ను ఏర్పాటు చేశామని ప్రభాకర రెడ్డి గురువారం వెల్లడించారు. రీ-సర్వే హెల్ప్‌లైన్‌ను భూ యజమానులతో పాటు రెవెన్యూ, సర్వే అధికారులు, సిబ్బంది వినియోగించుకోవచ్చన్నారు. పనిదినాలలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5.30 వరకు 81436 79222 నంబర్ అందుబాటులో ఉంటుందని తెలిపారు. ముందెన్నడూ లేని రీతిన నూతన విధానాలలో రీ-సర్వే జరిపిస్తున్నట్లు వెల్లడించారు. యజమానులు భూమి వద్దకు వచ్చి హద్దులు చూపించేందుకు మూడు సార్లు అవకాశం ఇస్తామని, వారు అందుబాటులో లేనిపక్షంలో వీడియో కాల్ ద్వారా ప్రక్రియను పూర్తి చేస్తామని తెలిపారు. 20వ తేదీ నుంచి ప్రతి మండలంలోని ఎంపిక చేసిన గ్రామంలో ప్రయోగాత్మకంగా రీ-సర్వే ప్రారంభించినట్లు చెప్పారు. యజమానులకు సమాచారం ఇచ్చేందుకు ప్రత్యేకంగా కమ్యూనికేషన్ బృందాన్ని ఏర్పాటు చేశామన్నారు. 200-250 ఎకరాలకు మించకుండా గ్రామాన్ని బ్లాకులుగా విభజించి కొలతలు వేయడానికి ఇద్దరు సర్వేయర్లు, వీఆర్వో, ఒక వీఆర్ఏను కేటాయించామని ప్రభాకరరెడ్డి వెల్లడించారు. యజమానులతో వాట్సప్ గ్రూప్ ఏర్పాటు చేసి, సర్వే నంబర్ల వారీగా రీ-సర్వే పనుల సమాచారాన్ని అందిస్తామన్నారు. భూ యజమానులు వారి పొలం వద్దకు వచ్చినప్పుడు తీసిన ఫొటోలు సర్వేయర్ల బృందం తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో పొందుపర్చాలన్నారు. అధికారులు నిర్ధారిత కొలతలపై అప్పీలుకు ప్రభుత్వం అవకాశం కల్పిస్తుందని చెప్పారు. ఎంపిక చేసిన గ్రామాలలో రోజుకు 20 ఎకరాల చొప్పున 15 రోజుల్లో సర్వే పూర్తి చేయాలని లక్ష్యం పెట్టుకున్నట్లు ప్రభాకర రెడ్డి తెలిపారు.

పరకాలకు ఘన నివాళి



విశాలాంధ్ర-విజయవాడ: ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు, సీనియర్ జర్నలిస్టు అమరజీవి పరకాల పట్టాభిరామారావు 12వ వర్ధంతి సందర్భంగా గురు వారం ఘన నివాళి అర్పించారు. విశాలాంధ్ర దినపత్రిక సంపాదక విభాగంలో వివిధ హోదాల్లో పట్టాభి అందించిన సేవలను ఈ సంద ర్భంగా గుర్తుచేసుకున్నారు. విశాలాంధ్ర ఆవిర్భావం నుంచి ఐదున్నర దశాబ్దాలకు పైగా సంపాదకవర్గ విభాగంలో పనిచేసిన పట్టాభి ఎందరినో సుశిక్షితులైన జర్నలిస్టులుగా తీర్చిదిద్దారు. అనేక పుస్తకాలను రచించారు. కమ్యూనిస్టుగా విశేష సేవలు అందించడంతోపాటు అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పట్టాభి 12వ వర్ధంతిని పురస్కరిం చుకుని ఆయన కుమారుడు పరకాల సూర్య మోహన్, కుమార్తెలు పరకాల ఉషాదేవి, పరకాల సంధ్యాదేవి విశాలాంధ్రకు చిరు కానుకగా వెయ్యి నూటపదహారు రూపాయలు అందజేశారు. వారికి విశాలాంధ్ర విజ్ఞానసమితి కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, జనరల్ మేనేజర్ పి. హరినాథరెడ్డి, ఎడిటర్ ఆర్వీ రామారావ్ ధన్యవాదాలు తెలిపారు. విశాలాంధ్రకు పట్టాభి అందించిన సేవలను ఈ సందర్భంగా వారు కొనియాడారు.

బాల్ ఠాక్రేకు భారత రత్న ఇవ్వాలి: రౌత్

ముంబై: శివసేన వ్యవస్థాపకుడు బాలాసాహెబ్ ఠాక్రేకు అత్యున్నత పౌర పురస్కారం 'భారత రత్న' ఇవ్వాలని ఆయన 99వ జయంతి సందర్భంగా శివసేన (యూబీటీ) ఎంపీ సంజయ్ రౌత్ డిమాండ్ చేశారు. మరాఠీ ప్రజల హక్కుల కోసం పోరాడిన, శివసేనను ఏర్పాటు చేసిన బాలా సాహెబ్ ఠాక్రేకు భారత రత్న పురస్కారంతో సన్మానించాలన్నారు. ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా గురువారం ఎక్స్ మాధ్యమంగా బాల్ ఠాక్రేకు నివాళు లర్పించిన క్రమంలో రౌత్ స్పందిస్తూ... అత్యున్నత పురస్కారం అందజేయడమే శివసేన వ్యవస్థాపకుడికి నిజమైన నివాళి అని అన్నారు. ఏక్‌నాథ్ షిండే, దేవేంద్ర ఫడ్నవీస్ వంటి వారు ఎక్స్‌లో బాలా సాహెబ్ ఠాక్రేకు నివాళు లర్పించడానికి మించిన కపటత్వం మరొకటి లేదని రౌత్ వ్యాఖ్యానించారు. బాలా సాహెబ్ శతజయంత్యుత్సవం ప్రారంభానికి ముందే ఆయనకు భారత్ రత్న ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. తద్వారా వీర్ సావర్కర్‌నూ గౌరవించినట్లు అవుతుందని సూచించారు. కాగా, బాలా సాహెబ్ ఠాక్రే 1926, జనవరి 23న జన్మించారు. 2012, నవంబరు 17న చనిపోయారు. 1966, జూన్ 19న శివసేన పార్టీని స్థాపించారు.

అదానీతో చంద్రబాబుకు రహస్య అజెండా: షర్మిల

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అదానీపై చర్యలకు కచ్చితమైన సమాచారం ఉంటే చర్యలు తీసుకుంటామని సీఎం చంద్రబాబు చెప్పడం ఈ దశాబ్దపు అతి పెద్ద జోక్ అని కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల ఆక్షేపించారు. నాడు ప్రతిపక్షంలో ఉండగా ఏ సమాచారంతో విద్యుత్ ఒప్పందాలపై కోర్టుకి వెళ్లారు... అదానీతో చేసుకున్న ఒప్పందాల్లో అవినీతి దాగి ఉందని ఎందుకు అన్నారు అంటూ గురువారం ఎక్స్ వేదికగా ఆమె ప్రశ్నించారు. అదానీ పవర్ ఎక్కువ ధర పెట్టి కొనడంతో రాష్ట్ర ప్రజలపై రూ.లక్ష కోట్లు భారం పడిందని ఎందుకు చెప్పారని, తాడేపల్లి ప్యాలెస్ వేదికగా రాష్ట్రాన్ని అదానీకి దోచి పెడుతున్నారని ఎందుకు ఆరోపణలు చేశారంటూ ప్రశ్నించారు. ప్రతిపక్షంలో ఉండగా అదానీ మీకు శత్రువు... అధికార పక్షంగా అదే అదానీ మిత్రుడా అని ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వం సెకీతో చేసుకున్న ఒప్పందంలో అవినీతి జరిగిందని, అదానీ పవర్‌తో చేసుకున్న అగ్రిమెంట్ వెనుక స్వయంగా మాజీ ముఖ్యమంత్రి రూ.1,700 కోట్ల ముడుపులు తీసుకున్నారని, అమెరికన్ దర్యాప్తు సంస్థ ఏబీఐ స్పష్టంగా నివేదిక ఇచ్చిందని గుర్తుచేశారు. అమెరికన్ కోర్టుల్లో అదానీపై కేసులు పెట్టారని, ఇంత తతంగం నడుస్తుంటే, అన్ని ఆధారాలు కళ్లముందు కనిపిస్తుంటే, అదానీ మోసానికి రాష్ట్రమే అడ్డాగా మారితే, మాజీ ముఖ్యమంత్రి నేరుగా అవినీతిలో భాగంగా ఉంటే, కచ్చిత సమాచారం కావాలని చంద్రబాబు అడగడం రాష్ట్ర ప్రజలను మోసగించడమేనని మండిపడ్డారు. కనీసం ఒప్పందాల్లో ఏం జరిగిందో తేల్చడానికి ఏసీబీని సైతం రంగంలోకి దించకపోవడం అదానీని కాపాడుతున్నారనే దానికి నిదర్శనమన్నారు. అదానీపై చర్యలకు భయపడుతున్నారనేదీ నిజమని, మోదీ దర్శకత్వంలో విషయాన్ని పక్కదారి పట్టించారనేదీ వాస్తవమని తెలిపారు. అదానీతో చంద్రబాబుకు రహస్య అజెండా లేకపోతే తక్షణమే అదానీ కంపెనీలతో చేసుకున్న విద్యుత్ ఒప్పందాల్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

13కు పెరిగిన రైలు ప్రమాద మృతులు

వీరిలో నలుగురు నేపాలీలు

పూనే: మహారాష్ట్రలో చోటుచేసుకున్న ఘోర రైలు ప్రమాదంలో చనిపోయిన వారి సంఖ్య 13కు పెరిగింది. మృతుల్లో నలుగురు నేపాలీలు (ఓ బాలుడు, ఇద్దరు మహి ళలు సహా) ఉన్నారు. మృతదేహాలను వారి ఆధార్ కార్డుల ఆధారంగా గుర్తించినట్లు ప్రత్యేక ఐజీ దత్తాత్రేయ కరాలే తెలిపారు. 15 మంది క్షతగాత్రుల్లో తొమ్మిది మందికి పంచోరా సివిల్ హాస్పిటల్‌లో, ఒకరికి జలగావ్ సిటీ ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. స్వల్పంగా గాయపడిన వారిని డిశార్జ్ చేసినట్లు తెలిపారు. చనిపోయిన నేపాలీలను కమలా నవీన్ భండారి (43) (ముంబైలోని కొలబా వాసి), జవఖలా భాటే (60) (థానేలోని భివాండివాసి), లచ్చిరామ్ ఖటారు ఫాసి(40), ఇంతియాజ్ అలి (11)గా గుర్తించినట్లు జల్‌గావ్ జిల్లా సమాచార అధికారి యువరాజ్ పాటిల్ చెప్పారు. ఇదిలావుంటే, కేంద్ర రైల్వే సిబ్బంది బుధవారం రాత్రి ఆసుపత్రుల్లో బాధితులను పరామర్శించి, గాయపడిన తొమ్మిది మందికి రూ.2.70లక్షల ఎక్స్‌గ్రేషియాను అందించినట్లు ఓ అధికారి తెలిపారు. రైల్వే బోర్డు తరపున మృతుల కుటుంబాలకు రూ.1.5 లక్షలు, స్వల్పంగా గాయపడిన వారికి రూ.5వేలు, తీవ్ర గాయాలు అయిన వారికి రూ.50వేలు చొప్పున పరిహారాన్ని ప్రకటించినట్లు వెల్లడించారు. మహారాష్ట్ర ప్రభుత్వం రూ.5లక్షల పరిహారం ప్రకటించడం తెలిసిందే.

చాయ్‌వాలా వదంతులతోనే ఘోరం: అజిత్ పవార్

రైలు ప్రమాదానికి ఓ చాయ్‌వాలా సృష్టించిన వదంతులే కారణమని మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ తెలిపారు. పుష్పక్ ఎక్స్‌ప్రెస్‌లో మంటలు వ్యాపించినట్లు టీ అమ్మే వ్యక్తి చెప్పడంతో భయాందోళనకు గురైన కొందరు ప్రయాణికులు చైన్ లాగి కిందకు దిగారని, అదే సమయంలో అటుగా వెళ్లే కర్నాటక ఎక్స్‌ప్రెస్ ఢీకొని ప్రాణాలు కోల్పోయారని అన్నారు. పవార్ గురువారం విలేకరులతో మాట్లాడుతూ ఈ వివరాలు వెల్లడించారు. 'కోచ్‌లో మంటలు చెలరేగాయని ప్యాంట్రీ నుంచి ఓ చాయ్‌వాలా కేకలు పెట్టాడు. ఇది విన్న యూపీకి చెందిన ఇద్దరు ప్రయాణికులు కంగారు పడి పక్క ప్రయాణికులకు చెప్పారు. దీంతో జనరల్ బోగితో పాటు దాని పక్క బోగిలో ఒక్కసారిగా గందరగోళం నెలకొంది' అని అజిత్ పవార్ తెలిపారు. ప్రయాణికులు తమ ప్రాణాలు కాపాడుకునే ప్రయత్నంలో రైలు నుంచి బయటకు దూకేశారు. ఈలోగా ఓ ప్రయాణికుడు చైను లాగాడు. రైలు ఆగిన వెంటనే ప్రయాణికులు కిందకు దిగతుండగా పక్క పట్టాలపై కర్నాటక ఎక్స్‌ప్రెస్ దూసుకొచ్చింది. రైలు ఢీకొని ప్రయాణికులు కొందరు ప్రాణాలు కోల్పోయారు. మరికొందరు గాయపడ్డారు. ఒక వదంతు ఈ ఘోరానికి దారితీసింది' అని పవార్ అన్నారు. మృతుల్లో 10 మందిని గుర్తించారన్నారు. ఘటన తర్వాత అక్కడికి చేరుకున్న ప్రభుత్వ అధికారులు, మంత్రులు పరిస్థితిని సమీక్షించారని, కొద్ది సేపటికి రైళ్ల రాకపోకలను పునరుద్ధరించారని ఉప ముఖ్యమంత్రి తెలిపారు.

బీజేపీది అబద్ధాలు, లూటీల పాలన

అఖిలేశ్ యాదవ్ ఆరోపణ

లక్నో: అబద్ధాలు, లూటీల ఆధారంగానే బీజేపీ పరిపాలన సాగుతోందని సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ విమర్శించారు. బీజేపీ... అవాస్తవాల పార్టీ అని దుయ్యబట్టారు. మోసపూరిత విధానాలతో దోపిడీ రాజ్యాన్ని సాగిస్తోందని ఆరోపించారు. సమాజంలోని ప్రతి వర్గాన్ని మోసం చేసిందని, ఇచ్చిన ఏ ఒక్క హామీని నిలబెట్టుకోలేదని విమర్శించారు. రైతులు, యువత, విద్యార్థులు, వర్తకులకు ఇచ్చిన హామీలల్లో ఏది అమలుకు నోచుకోలేదని అఖిలేశ్ యాదవ్ గురువారం ఓ ప్రకటన చేశారు. బీజేపీ డబుల్ ఇంజిన్ ప్రభుత్వానిది ఝూట్ (అబద్ధాలు), లూట్ (దోపిడీ) విధానమని వ్యాఖ్యానించారు. 'గత పదేళ్లలో రైతుల ఆదాయం రెట్టింపు కాకపోగా అది గణనీయంగా పడిపోయింది. పంటలకు గిట్టుబాటు ధర లేదు. చెరకు రుణం పెరిగిపోతోంది. ఈ ఏడాది ఇప్పటివరకు చెరకు ధరలను ప్రభుత్వం ప్రకటించలేదు' అని అఖిలేశ్ యాదవ్ అన్నారు. రాష్ట్రానికి నిజమైన పెట్టుబడులు తెస్తామంటూ పెట్టుబడి సదస్సుల పేరిట బీజేపీ ఆర్భాటాలు తప్ప ఫలితాలు లేవని దుయ్యబట్టారు. ఈ సదస్సులకు బడా పారిశ్రామికవేత్తలు, కేంద్ర మంత్రులు, రాష్ట్రపతి హాజరవుతారు కానీ జిల్లాలో కంపెనీలు, ఫ్యాక్టరీలు ఏర్పాటు కావని వ్యాఖ్యానించారు. ప్రభుత్వ తప్పుడు విధానాలు, వేధింపుల వల్ల కాన్పూర్, లక్నో వంటి నగరాల్లోని వ్యాపారాలు మూతబడుతున్నాయని, అవి ఉత్తరప్రదేశ్ నుంచి తరలిపోతుండటంతో నిరుద్యోగం పెరుగుతోందని అన్నారు. ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, అవినీతి, క్షీణిస్తున్న శాంతి భద్రతల పరిస్థితి నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే బీజేపీ ఆర్భాటాలకు పోతోందని దుయ్యబట్టారు. ఒక్క అభివృద్ధి ప్రాజెక్టును కూడా ఈ ప్రభుత్వం చేపట్టలేదని అఖిలేశ్ అన్నారు. పాలన కాలం ముగియనుండటంతో డొల్ల హామీలు గుప్పిస్తోందని విమర్శించారు. బీజేపీ జిత్తులన్నీ ప్రజలకు తెలిసిపోయాయని, 2027 ఎన్నికల్లో ఆ పార్టీని వారు తప్పక గద్దె దించుతారని అఖిలేశ్ యాదవ్ అన్నారు. అవాస్తవాలు, లూటీలతో సాగే బీజేపీ పాలన అంతానికి ఉత్తరప్రదేశ్ ప్రజలు సంకల్పించారని నొక్కిచెప్పారు.

బీజేపీ ఆరోపణలు రాజకీయ ప్రేరేపితం

సిద్ధరామయ్య

బెంగళూరు: బోర్డులు, కార్పొరేషన్ల ఏర్పాటుకు సరిపడ నిధులు లేవంటూ బీజేపీ చేస్తున్న ఆరోపణలను కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కొట్టిపారేశారు. బీజేపీ చేస్తున్నవి తప్పుడు, రాజకీయ ప్రేరేపిత ఆరోపణలు అని అన్నారు. సిద్ధరామయ్య గురువారం విలేకరులతో మాట్లాడుతూ బీజేపీ వైఖరిని ఖండించారు. కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలపై, సీఎం మార్పుపై ఓ ప్రశ్నకు బదులిస్తూ అధిష్ఠానం నిర్ణయానికి కట్టుబడతామని అన్నారు. ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తదుపరి ముఖ్యమంత్రి అవుతారని పార్టీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. సతీశ్ జర్కిహోలి పేరు కూడా వినిపిస్తోంది. అభిమానులు వారి కోసం ప్రార్థనలు సైతం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ పరిణామాల క్రమంలో సీఎంగా ఎవరు ఉండాలన్నదానిపై అధిష్ఠానానిదే చివరి మాట అని సిద్ధరామయ్య చెప్పారు. దావోస్‌లో జరిగే ప్రపంచ ఆర్థిక ఫోరం వార్షిక సమావేశానికి గైర్హాజరు కావడంపై స్పందిస్తూ బడ్జెట్ తయారీ కోసమే వెళ్లలేదన్నారు. ఇదిలావుంటే, కర్నాటకలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి షెడ్యూల్డ్ కులాలు, తెగల సంక్షేమంపై నివేదికలు లేవని, ఎస్టీ/ఎస్సీ కమిషన్ల ఏర్పాటు జరగకపోవడం దురదృష్టకరమని బీజేపీ నేత విజయన్ వ్యాఖ్యానించారు. కమిషన్ల చైర్‌పర్సన్‌ల నియామకంలో జాప్యాన్ని సవాల్ చేస్తూ హైకోర్టులో దాఖలైన వ్యాజ్యాన్ని గుర్తుచూస్తూ కర్నాటక ప్రభుత్వానికి ఉన్నత న్యాయస్థానం ఇప్పటికే నోటీసు ఇచ్చిందని ఆయన పేర్కొన్నారు.

5న ఫీజు పోరు: లేళ్ల అప్పిరెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కూటమి ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకపోవడంతో పేద విద్యార్థులు చదువులకు దూరమవుతున్నారని వైసీపీ కేంద్ర కార్యాలయ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి ఆరోపించారు. తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం తక్షణం ఫీజు బకాయిలు రూ.4వేలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించకుంటే ఫిబ్రవరి 5న వైసీపీ ఫీజు పోరు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఆ రోజు అన్ని జిల్లాల కలెక్టర్లకు వినతులు అందిస్తామన్నారు. పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదవాలనే మంచి ఆలోచనతో నాడు ఫీజు రీయింబర్స్‌మెంట్ విధానాన్ని వైఎస్సార్ తీసుకొస్తే... విద్యా దీవెన, వసతి దీవెన పేరుతో వైఎస్ జగన్ ముందుకు తీసుకెళ్లారని గుర్తుచేశారు.

యువతకు స్ఫూర్తి నేతాజీ

టీడీపీ కార్యాలయంలో ఘనంగా జయంతి వేడుకలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: స్వాతంత్ర్య సమరయోధుడు, ఆజాద్ హింద్ ఫౌజ్ వ్యవస్థాపకుడు సుభాశ్ చంద్రబోస్ జయంతిని పురస్కరించుకుని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. టీడీపీ నేతలు మాట్లాడుతూ, నేతాజీ స్వయం శక్తి, ఐక్యత, ధైర్యం నేటి యువతకు శాశ్వత ప్రేరణగా నిలుస్తుందని అన్నారు. ఆయన ఆశయాలను ఆచరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి, టీడీపీ నాయకులు వర్లరామయ్య, రమేశ్, రమణ, అఖిల్ కుమార్, కృష్ణ, హసన్ బాషా, సాహెబ్ పాల్గొన్నారు.

ఘనంగా లోకేశ్ పుట్టినరోజు

కేక్ కట్ చేసిన మంత్రి గొట్టిపాటి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: విద్యా శాఖ మంత్రి, టీడీపీ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పుట్టినరోజు సందర్భంగా పార్టీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్, శాసనమండలి చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య, ఏపీ మైనార్టీ కార్పొరేషన్ సలహాదారు ఎంఏ షరీఫ్ సమక్షంలో కేక్ కటింగ్ జరిగింది. మంత్రి గొట్టిపాటి కేక్ కట్ చేశారు. నేతలు, కార్యకర్తలు మిఠాయిలు పంచుకున్నారు. లోకేశ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రం కోసం లోకేశ్ చేస్తున్న కృషి ఫలించాలని వారు ఆకాంక్షించారు. అలాగే నాలెడ్జ్ సెంటర్ విభాగంలో జరిగిన కార్యక్రమంలో చైర్మన్ గురజాల మాల్యాద్రి మాట్లాడుతూ సంకల్పం ఉంటే ఏదైనా సాధించవచ్చని లోకేశ్ నిరూపించారన్నారు. పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ లోకేశ్ మరిన్ని విజయాలు సాధించాలని మాల్యాద్రి ఆకాంక్షించారు.

మైనారిటీ విద్యార్థులకు రూ.40.22 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలోని మైనారిటీ విద్యార్థులకు 2024-2025 విద్యా సంవత్సరానికి ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద ట్యూషన్ ఫీజు చెల్లింపులకు రూ. 40.22 కోట్లు విడుదల చేస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసిందని మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూఖ్ తెలిపారు. ఈ మేరకు ఆయన గురువారం ప్రకటన విడుదల చేశారు. ముస్లిం మైనారిటీ విద్యార్థుల కోసం రూ.37.88 కోట్లు, క్రిస్టియన్ మైనార్టీ విద్యార్థుల కోసం రూ.2.34 కోట్లు మొత్తం రూ.40.22 కోట్లు ప్రభుత్వం విడుదల చేసిందని తెలిపారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.